1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం


సంపుటి : 7
సంచిక : 9
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు


ఫిబ్రవరి 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in


## భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు ?




అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తరుచూ వినిపించే ఒక మాట ఐక్యరాజ్యసమితి వారు తెలుగు అంతరించిపోతోంది అని ప్రకటించారని. ఈ వార్త నిజం కాదని మనలో చాలా మందికి తెలుసు. మీకిప్పటి వరకూ తెలీకపోతే తెలుసుకోండి – ఐక్యరాజ్యసమితి గానీ, యునేస్కో గానీ తెలుగు భాష ప్రమాద స్థితిలో ఉందనో, అంతరించిపోతుందనో ఇప్పటివరకూ ఎప్పుడూ ప్రకటించలేదు. తెలుగు భాష ఉనికి ప్రమాదంలో ఉంది అన్న మాట ఒట్టి అపోహ మాత్రమే. కానీ కొన్ని భాషలను ఐక్యరాజ్యసమితి అంతరించిపోయినవిగా గుర్తించింది. కొన్ని భాషలు త్వరలో అంతరించిపోతాయని, కొన్ని అంతరించబోయే ప్రమాద స్థాయి కొన అంచున ఉన్నాయని, కొన్ని భాషలు ఇంకొక తరం తరువాత మనగలిగే అవకాశం లేదని ఐక్యరాజ్యసమితి ప్రకటించి, ప్రపంచ భాషల్లో ప్రమాద స్థితిలో ఉన్న భాషల అట్లాసుని వలగూడు ద్వారా ప్రచురించింది. ఆ అట్లాసులో ఇచ్చిన భారతదేశ పటాన్ని గమనిస్తే, నలుపు–తెలుపు–పసుపు–నారింజ–ఎరుపు రంగుల్లో గుర్తులు ఉంటాయి. ఒక్కో గుర్తు ఒక్కో భాషకు ప్రతీక. రంగు భాష స్థితిని తెలుపుతోంది.

ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదంలో లేని భాషలు ఈ పటంలో కనిపించవు.


– పూర్తి వివరాల గల వ్యాసం లోపలి పుటలలో...


**సరికొత్త చైతన్యంతో ఉద్యమాన్ని సాగిద్దాం**

# 2022-2032 మూలవాసుల భాషల దశాబ్దిగా జరుపుకోవాలి

2022-2032 దశకాన్ని మూలవాసుల భాషల దశాబ్దిగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది.

2019 ఏడాదిని మూలవాసుల భాషల ఏడాదిగా ప్రకటించి, మూలవాసుల భాషల అభివృద్ధి కోసం ఐరాస అనేక కార్యక్రమాలను ఆ ఏడాది సాంతం నిర్వహించింది. సభ్య దేశాలు కూడా తమ తమ స్థోమతను అనుసరించి ఐరాస ఇచ్చిన సందేశం ప్రకారం మూలభాషల అభివృద్ధి కోసం తీర్మానాలు చేసాయి. మెక్సికోలోని లాస్ పినాస్ నగరంలో జరిగిన ముగింపు సభలో లాస్‌పినాస్ తీర్మానం రూపొందించారు. ఇందులో భాగంగా మాతృభాషల పరిరక్షణ కోసం 2022-2032 దశకాన్ని మూలవాసుల మాతృభాషల దశాబ్దిగా జరుపుకుంటూ భాషా పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ముఖ్యంగా ఎనిమిది వ్యూహాత్మక దిశానిర్దేశాల ద్వారా భాషలను ఆర్థిక, రాజకీయ, సామాజిక మరియు సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి పరచవచ్చని తీర్మానించారు:



**8 మార్గదర్శకాలు**

1. చెలామణీలో ఉన్న విద్యా మాధ్యమ భాషలకు దీటుగా మూలవాసుల మాతృభాషల్లో విద్య, అందుకు తగిన వనరుల ఏర్పాటు.

2. మూలవాసుల మాతృభాషల్లో న్యాయ మరియు ప్రజాసేవా రంగాలు.

3. వాతావరణ మార్పు, జీవవైవిధ్యం మరియు మూలవాసుల మాతృభాలు

4. మూలవాసుల మాతృభాషలను డిజిటల్ రూపంలో బలోపేతం చేయడం, భాషా సాంకేతికాల అభివృద్ధి మరియు మూలవాసుల మాతృభాషల్లో మీడియా.

5. మెరుగైన ఆరోగ్యానికి, సామాజిక కలుపుగోలుకు, మానవీయ స్పందనకు మూలవాసుల మాతృభాషలు

6. సాంస్కృతిక మరియు భాషాపరమైన వారసత్వాన్ని కాపాడటం; సజీవ వారసత్వానికి మాధ్యమంగా మూలవాసుల మాతృభాషలు

7. మూలవాసుల మాతృభాషల కోసం మరియు మూలవాసుల మాతృభాషలలో చెలామణీలో ఉన్న అగ్రభాషలకు ధీటుగా ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన.

8. స్త్రీ-పురుష భేదాన్ని అధిగమించి స్త్రీల సశక్తీకరణ కోసం మూలవాసుల మాతృభాషలను ఉపయోగించటం.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

ఫిబ్రవరి 2022

* తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
* తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
* ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...




## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.**

**ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ శుభాకాంక్షలు**

***లోపలి పుటలలో....***


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | సరికొత్త చైతన్యంతో ఉద్యమాన్ని సాగిద్దాం | | **07** |
| **అమ్మనుడుల పండుగ:** | ఎవరి పరిధిలో వారు చేయగల భాషాసేవ | **రహ్మానుద్దీన్ షేక్** | **09** |
| **అమ్మనుడుల పండుగ:** | 2022 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం | | **11** |
| **అమ్మనుడుల పండుగ:** | భాష ప్రమాదంలో ఉందని ఎలా.... | **రహ్మానుద్దీన్ షేక్** | **12** |
| **అమ్మనుడుల పండుగ:** | చివరి భాష | **అన్వర్** | **15** |
| **అమ్మనుడుల పండుగ:** | ప్రపంచీకరణ యుగంలో పాలనాభాషగా... | **చంద్రయ్య.ఎస్** | **17** |
| **అమ్మనుడుల పండుగ:** | తెలుగు గ్రంథసూచి | **టి. సతీష్** | **20** |
| **చర్చావ్యాసం:** | పిల్లలకు ఎక్కాలు నేర్పడం ఎలా? | **రంగనాయకమ్మ** | **24** |
| **వారసత్వ సంపద:** | అరకులో ఆదివాసీ అంతరంగం | **పి. శివరామకృష్ణ 'శక్తి'** | **34** |
| **సాహిత్యరంగం:** | తెన్నాటి తెమ్మెర | **డా॥ మధురాంతకం నరేంద్ర** | **41** |
| **తెలుగు సామెతలు:** | నల్లేరుపై నడక! | **సద్దపల్లి చిదంబరరెడ్డి** | **43** |
| **జీవితం** | జీవించడం సులభం! | **జోన్ జాందాయ్/అన్వర్** | **45** |
| **పర్యావరణం:** | ప్రకృతిని... | **నేదునూరి కనకయ్య/ ప్రవీణ్‌కుమార్ జాలిగామ** | **48** |
| **గ్రంథాలయం** | | | **16,27,40** |
| **జి.ఒ.** | అధికార భాషగా తెలుగును ఎందుకు అమలు చెయ్యాలి? | | **49** |
| **ధారావాహికలు:** | మన చదువుల కథలు–4 | **సి.వి.కృష్ణయ్య** | **28** |
| | పడమటి గాలితో నివురు...12 | **గుజ్జర్లమూడి కృపాచారి** | **32** |
| | అడుగుజాడలు–ఆనవాళ్లు–15 | **ఈమని శివనాగిరెడ్డి** | **38** |
| **కవిత:** | నిజ నిర్ధారణ | **రామ్ పెరుమాండ్ల** | **31** |
| **పద్యం:** | సీతాకోకచిలుకలు...! | **గున్నోజు శ్రీనివాసాచారి** | **23** |


| కార్టూన్లు | రేఖాచిత్రాలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి** | **చిదంబరేశ్వరరావు** | **బండారు రఘురాం** |

ammanudi.org **వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు**

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు   మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000,   1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా **'అమ్మనుడి'** పత్రిక చందా పంపవచ్చు **నెం. '94929 80244'తో** బిజినెస్ ఆప్షన్‌లోకి వెళ్ళి

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

ఎంట్రీ చేసి పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు.
   దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**

# తెలుగు భాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య 1288/2003)

కార్యాలయం : జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కాలేజీ వీధి, మాచవరం, విజయవాడ-520004.

గౌరవాధ్యక్షుడు
డా॥ చుక్కా రామయ్య
ఫోన్: 9490300716

అధ్యక్షుడు
డా॥ సామల రమేష్‌బాబు
ఫోన్: 9848016136

## విస్తృత సమావేశానికి ఆహ్వానం

**జనవరి 23వ తేదీన జరుగవలసియున్న ఈ సమావేశం కరోనా విస్తృతి వల్ల వాయిదాపడింది. ఆ సమావేశాన్నే ఇప్పుడు ఫిబ్రవరి 20వ తేదీన(ఆదివారం నాడు) జరుపుకోనున్నాం. గమనించ ప్రార్థన**

తెలుగు భాషోద్యమ సమాఖ్యను 2003 ఫిబ్రవరి 21న స్థాపించినప్పటి నుండి తెలుగు భాష రక్షణకోసం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాలలోను, ఇతర ప్రాంతాలలోను నిర్వహించుకొన్నాము. మిత్ర సంఘాలను కూడా ప్రోత్సహించాం. పాలన, బోధన రంగాల్లో తెలుగు అమలు కోసం ఉద్యమాలను నడిపి, న్యాయస్థానాలను కదిలించి అనేక సానుకూల ఉత్తర్వులను సాధించాం. తెలుగుకు ప్రాచీన భాషగా గుర్తింపుకై ముందుగా జాతిని మేల్కొల్పి ప్రభుత్వాలను కదిలించి గుర్తింపును తెచ్చుకున్నాం. తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కోసమూ, తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ కోసమూ పోరాడి, వాటికై ప్రభుత్వ ఉత్తర్వులను సాధించుకోగలిగాం. అయినా పాలకుల్లో నిజాయితీ లేకపోవడంతో అదంతా అమలులో నీరుగారిపోయింది. ఇంతేగాక గత రెండు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో విపరీతంగా చోటుచేసుకున్న కార్పొరేటీకరణ విధానాల వల్లా, పాలక పార్టీలు బోధనామాధ్యమంగా తెలుగును అణిచివేసినందువల్లా మాతృభాష ప్రగతికి ఎంతో నష్టం వాటిల్లింది. ఈ అనేక పరిణామాల ఫలితంగా భాషోద్యమంలో ప్రాథమ్యాలను, విధివిధానాలను తిరిగి నిర్ణయించుకోవలసివుంది. ఇందుకోసం తెలుగు భాషోద్యమసమాఖ్యలోకి అనుభవజ్ఞులైన వారినీ, యువతరాన్నీ, విద్యార్థి ఉపాధ్యాయ ప్రతినిధులను, వివిధ రంగాల నిపుణులను మరికొందరిని స్వాగతించి, సంస్థను మరింత చైతన్యవంతంగా, ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకోవాలని నిర్ణయించాము. ఒక కేంద్ర విధాననిర్ణయ మండలిని కూడా మనం ఏర్పాటు చేసుకోవలసియున్నది.

**ఇందుకోసం సమాఖ్య విస్తృత సమావేశం 2022 ఫిబ్రవరి 20 ఆదివారం నాడు జరుగుతుంది.**

**వేదిక :** బిషప్ ఇగ్నేషియస్ ముమ్మడి హాల్ (ఓల్డ్ సెమినార్ హాల్), ప్రధాన లైబ్రరీ వెనుక

**ఆంధ్ర లొయోలా కళాశాల, గుణదల, విజయవాడ -520008**

సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడిని కొత్తగా ఎన్నుకోవలసియున్నది. ఇందుకోసం ఈ విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేసుకొంటున్నాం. సమాఖ్య సభ్యులతో పాటు, ఇంతవరకు సమాఖ్యతో కలసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నవారూ, ఇకపై పాల్గొనాలనే ఆసక్తి కలిగినవారూ ఈ సమావేశంలో పాల్గొనగోరుతున్నాము.

ఈ సమావేశంలో పాల్గొనదలచేవారు ఫిబ్రవరి 15లోపుగా 98480 16136 / 92994 56678 లకు వాట్సాప్ ద్వారా గానీ మెసేజ్ ద్వారాగానీ మీ చిరునామాను, ఫోన్ నెం., మెయిల్ ఐడిలను తెలుపగోరుతున్నాము. ఇంకా వివరాల కోసం సంప్రదించ కోరుతున్నాము.

**కార్యక్రమం:** ఉదయం గం.9.30 నుండి ప్రతినిధులు నమోదు

మొదటి సభ: 10.30 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు:

అధ్యక్షుని ప్రసంగం, నివేదిక సమర్పణ, ప్రతినిధుల ప్రసంగాలు, కొత్త అధ్యక్షుని ఎన్నిక, అభినందనలు.

గం 1 నుండి గం 2.30 వరకు భోజనవిరామం.

రెండవ సభ: మధ్యాహ్నం 2.30 గం. నుండి 5 గం. వరకు తీర్మానముల ప్రతిపాదన, చర్చ, ఆమోదం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు తప్పకుండా ఈ సమావేశంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాము.

– డా॥ వెన్నిసెట్టి సింగారావు సమావేశకర్త సెల్: 93930 15584

◆తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆశయ లక్ష్యాలను, విధివిధానాలను ఆమోదించేవారు మాత్రమే సభలో పాల్గొనగోరుచున్నాము.

◆కరోనా వైరస్ నుండి రక్షణకొరకై 'ముసుగు'(మాస్క్)ను తప్పనిసరిగాధరించాలి. వ్యాక్సిన్‌చేయించుకున్నవారు మాత్రమే పాల్గొనాలి.


మాతృభాషాదినో
తెలుగు అభివృద్ధికి అనేక పధకాలు
పెడతాం అన్చెప్పి ఓసారి కళ్ళు తుడుచు
కోండి-దాంతో ఈ ఏడాది దాటిపోయినట్టే!!
సరసి


ఇక మీదట మన మాతృభాష ఇంగ్లీషు-
తెలుగు కాదు అని ఓ జీవో ఇష్యూ చేద్దాం సార్!
గోలాదిలిపోతుంది!!
సరసి

సంపాదక హృదయం

# సరికొత్త చైతన్యంతో ఉద్యమాన్ని సాగిద్దాం

**2002** నవంబరులో కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో జరిగిన తెలుగుభాషోద్యమ సమాలోచనా శిబిరంలో రాష్ట్రం నలుదిక్కుల నుండీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా రంగాలలో నిపుణులైన పెద్దలు అయిదు ప్రధాన అంశాలపై సమర్పించిన పత్రాలపై చర్చలు జరిపి, కొన్ని తీర్మానాలను చేశారు. వాటి సాధనకై ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించి, 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' పేర సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించారు. అందరితో సంప్రదించి, తగిన ఏర్పాట్లు చెయ్యడం కోసం సి.ధర్మారావుగారికి బాధ్యతను అప్పగించారు. ఆయన తన అపార అనుభవంతో పాటు, శాస్త్రీయ, హేతుబద్ధమైన ఆలోచనలతో ఉద్యమ నేతగా ముందడుగు వేశారు. 2003 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం నాడు తెలుగు భాషోద్యమ సమాఖ్యను ప్రారంభించాలని ఆయన నిర్ణయించారు. ఆ రోజున హైదరాబాదులో జరిగిన గొప్ప సభలో సమాఖ్య స్థాపన ప్రకటన జరిగింది. శిబిరంలో చేసిన తీర్మానాల ప్రాతిపదికపై సమాఖ్య ఏకగ్రీవంగా కొన్ని తీర్మానాలను చేసింది. వాటి ప్రాతిపదికపై తగిన కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్నది. పరిపాలనను పూర్తిగా తెలుగులోకి తెచ్చేందుకూ, పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించేందుకూ, ఒక భాషగా తెలుగు బోధనను తప్పనిసరి చేసేందుకూ, నిరంతరం ఉద్యమిస్తూనే ఉంది. అవసరమైనప్పుడు న్యాయస్థానాలను కదిలించి తగిన ఉత్తర్వులను సాధించింది. ప్రజల్లో విస్తారంగా చర్చనూ ఆలోచననూ కలిగించే ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఒక దశలో– 2012లో తిరుపతిలో ప్రభుత్వం తలపెట్టిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు నిరసనగా కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లను పెట్టి వాటిలో కొన్నిటిని సాధించింది. దాని ఫలితంగానే తెలుగుకై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు జరిగింది. అకాడమీల పునరుద్ధరణతో పాటు మరికొన్ని అంశాలపై కూడా ముందడుగు పడింది. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను సాధించగలిగింది. ఇవి అమలులోకి వచ్చేనాటికి రాష్ట్రవిభజన జరిగింది. అన్ని ప్రాంతాల తెలుగు వారిని మాతృభాషా రక్షణ విషయంలో ఉమ్మడిగా ముందుకు నడిపేందుకు అడ్డుగావున్న అంశాల నివారణకై రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటునూ సమాఖ్య సమర్థించింది కూడా.

ఇంత పెద్ద తెలుగుజాతికి పాలనాపరంగా ఒకే రాష్ట్రం ఉండాలనే ఆలోచనకు కాలం చెల్లిందనీ రెండూ లేదా మూడు రాష్ట్రాలు తెలుగువారికి ఉండడంలో తప్పులేదని సమాఖ్య అభిప్రాయపడింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రఉద్యమంలో కొందరు భాష విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా క్రమంగా ఆ వాదనలు సమసిపోయి రెండు రాష్ట్రాలూ తెలుగువే అనే అభిప్రాయం బలపడింది. ప్రజల భాషకు పట్టం కట్టాలనే శాస్త్రీయ ప్రజాస్వామిక దృక్పథానికి అనుగుణంగా రెండు రాష్ట్రాల ఏర్పాటు పట్ల సమాఖ్య అనుసరించిన విధానం కాలం గడిచేకొద్దీ ప్రజల ఆమోదాన్ని పొందగలిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు సభలతో ఈ దృక్పథాం బలపడింది. నాటి నుండీ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న సోదర సంబంధం బలపడుతూనే ఉంది.

రెండు రాష్ట్ర ప్రభుత్వాలలోనూ, సాంస్కృతిక శాఖలలో తెలుగును కూడా చేర్చి 'తెలుగు భాష, సాంస్కృతిక శాఖ'లు ఏర్పడ్డాయి. రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరిగి కొత్తగా ఏర్పాటైన మంత్రివర్గాల్లో కూడా ఈ ఏర్పాటు కొనసాగుతూనే ఉంది. అధికారభాషాసంఘం రెండు రాష్ట్రాల్లోనూ ఏర్పడి లాంఛనంగా మాత్రమే ఉన్నాయి.

## సంపాదక హృదయం

తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకై ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందే ఏర్పడిన వ్యవస్థ, ఆ తరువాత గాలికి ఎగిరిపోయింది. తెలంగాణాలో ఐతే ఆ ఊసే నాటికీ నేటికీ లేదు. ప్రభుత్వాల చర్యల పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నా ఉద్యమించే పరిస్థితులు రెండు చోట్లా లేవు.

రెండు రాష్ట్రాల్లోనూ ఆంగ్ల మాధ్యమ మోజును ప్రభుత్వాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. 20 ఏళ్ళుగా పెరుగుతున్న ఈ ధోరణి ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు తర్వాత మరింతగా బలపడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన రెండవ ప్రభుత్వమైతే పాఠశాల స్థాయిలోనే ఆంగ్ల మాధ్యమాన్ని నిరంకుశంగా రుద్దింది. క్రమంగా తెలంగాణలో కూడా ఇదే పద్ధతి వచ్చింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ తమవి తెలుగు ప్రభుత్వాలుగా చెప్పుకోవడం మానివేశాయి. పరిపాలనైతే రెండు రాష్ట్రాల్లోనూ దాదాపుగా ఆంగ్లంలోకే వెళ్లిపోయింది. రెండు రాష్ట్రాల్లోనూ తెలుగుకు సంబంధించిన పాలనా సంస్థలు అచేతనంగా సాగుతున్నాయి. వాటి పట్ల ప్రభుత్వాలకు ఆసక్తి లేదు. ఇదీ పరిస్థితి! తొలి భాషారాష్ట్రంగా చెప్పబడి, తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలైనా, ఆచరణలో ఆ రెండు ప్రభుత్వాలూ తెలుగు స్పృహనే కోల్పోయాయి. ఇందుకు ప్రత్యక్షంగా రాజకీయ పార్టీలే కారణం. ఇదీ రాజకీయంగా మన దౌర్భాగ్యం! అన్ని రంగాల్లోనూ తెలుగువారి ప్రతిభకు నాటికీ నేటికీ ఏ లోటూలేదు. యువత కూడా తెలుగువారి కీర్తి ప్రతిష్టలను అన్ని రంగాల్లో నిలబెడుతూనే ఉంది. యువతతో సహా తెలుగు వారందరినీ దగా చేస్తున్నది మన ప్రభుత్వాలే, మన నేతలే.

తమ రాజకీయ అవసరాల కొద్దీ ఆ నేతలు, ఆ పార్టీలు వ్యవహరిస్తున్నారు. మొదటినుంచీ ఇదే ధోరణి. ప్రభుత్వాన్ని నిలదీసేవిధంగా మాట్లాడినా, చర్యలు చేపట్టినా, వాటికి రాజకీయ పార్టీల్లో ఉన్నవారి నుండి సరైన మద్దతు లభించదు. అధికార పక్షంలో ఉన్నవారిని ఉద్యమకారులు నిలదీసేటప్పుడు ప్రతిపక్షాలు మద్దతుగా నిలిచినట్లుంటాయి. అదే ప్రతిపక్షం అధికారంలోకొచ్చిన తర్వాత ఆ పాత్రను అప్పుడు ప్రతిపక్షంలోకొచ్చినవారు పోషిస్తారు తప్ప, ఎవరికీ భాషశ్రేయస్సు పట్ల శ్రద్ధ ఉండదు. కారణం అది వాళ్లెవరికీ రాజకీయ అవసరం కాదు! "రాజకీయాల్లో ఉన్నవాళ్లం ఏమీ ఆలోచించినా దాని వల్లా కలిగే రాజకీయ ప్రయోజనాన్ని బట్టే చూస్తాం!" అని ఆ రంగంలోని ఒక మిత్రుడు ఓ సందర్భంలో అన్యాపదేశంగానే అయినా, నాతో అన్న సంగతి తరచూ నాకు గుర్తుకొస్తుంటుంది!

తెలుగు భాషోద్యమం తెలుగు నాట పాలకవర్గాల్లో అధికార, ప్రతిపక్షాలు రెండిటికీ రాజకీయ అవసరంగా అనిపించలేకపోయింది! ఎలాంటి రాజకీయ ప్రయోజనాలనూ ఆశించకుండా, పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసిన భాషోద్యమం, వారిని తగినంతగా ప్రభావితం చేయలేకపోయిందన్న మాట వాస్తవం. విఫలమైందని అనుకోవలసిన అగత్యం లేదుగాని, నేటి అవసరాలకు తగ్గట్లు సరికొత్త ఆలోచనలతో ఉద్యమ వ్యూహాలను తిరిగి రూపొందించుకొని ముందుకు సాగాల్సిన అవసరం ముంచుకొచ్చిందని గ్రహించాలి.

19వ ఏడాదిలోకి ప్రవేశించబోతున్న సమయంలో సమాఖ్య కొత్త రక్తాన్ని ఎక్కించుకొని ముందుకు సాగాలని తలపెట్టడం శుభసూచకం. కొత్తతరం యువత విశ్వవిద్యాలయాల నుంచీ కళాశాలల నుంచీ బయటకు వస్తున్న సమయం కూడా ఇది. సరిగ్గా ఇరవైయేళ్లక్రితం నుండి మన విద్యావ్యవస్థ, మాతృభాషల గతి పక్కదారి పట్టడం మొదలైంది. ప్రపంచీకరణ పేరుతో ప్రయివేటీకరణ విచ్చలవిడితనంతో ఆర్థిక స్వార్థశక్తుల చేతుల్లోకి ప్రభుత్వాలూ, విద్యారంగం వెళ్లిపోయాయి. సామాన్య ప్రజల శ్రేయస్సుకూ అభివృద్ధికీ, జాతి అవసరాలకూ ఆకాంక్షలకూ భిన్నంగా వేగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో అధ్యాపక, విద్యార్థి బృందాలు, మేధావులు, సామాజిక ఉద్యమకారులు, పట్టించుకొని ఉద్యమాల్లో భాగం కావలసి ఉంది. అదే సమయంలో మాతృభాషను కాపాడుకోవడంలో విద్య, పాలనారంగాల పాత్రను అందరి అవగాహనకు తేవడానికి భాషోద్యమకారులు మరెంతగానో శ్రమించాలి.

తేదీ : 30-01-2022

సామల రమేష్ బాబు

# ఎవరి పరిధిలో వారు చేయగల భాషాసేవ ఇది!

**మళ్ళీ** ఏడాదిలో మాతృభాషల కోసం చిన్నా-పెద్దా బాగా మాట్లాడేసుకునే సందర్భం వచ్చింది. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం. మిగతా ఏడాదంతా మాతృభాష మీద అసలు ధ్యాసే లేని ఎందరో మహానుభావులు నా భాష, మన భాష అంటూ రాజకీయ లబ్ధికోసం, కొన్ని ఫోటోలు, వీడియోల కోసం మాతృభాషపై ఉపన్యాసాలిస్తూ, భాషను ఉద్ధరించే అనేకానేక వాగ్దానాలు చేస్తూ వార్తల్లో నిండి ఉండే వ్యక్తులు వీరు. మరుసటి రోజే అసలు మాతృభాషంటే ఏమిటో అని అడిగే రకం. ఈ రాజకీయ వ్యక్తులు మాటలతో గాలిమేడలు కడతారే గానీ వారి ఉపన్యాసాల వలన, నెరవేరని వాగ్దానాల వలన మాతృభాషలకు గానీ, మాతృభాషలు మాట్లాడే వ్యక్తులకు గానీ ఎలాంటి లాభం చేకూరదు. పైగా ఆ భాష ఏదో ఉద్ధరించబడుతోంది అన్న తప్పుడు సంకేతం కచ్చితంగా ప్రజలలోకి వెళుతుంది. అది భాషకు అపారమైన నష్టాన్ని చేకూర్చుతోంది!

భాషకోసం పిసరంత పని చేయాల్సిన వారు కూడా భాష భవ్యంగా ఉందన్న ఊహతో తమ కర్తవ్యం తాము చేయటం లేదు.

పూర్వం ఒక ఊరిలో ఒక వేడుక కోసం స్వచ్ఛంద పాల సేకరణ జరిగిందట. ఊరి మధ్యలో ఒక పెద్ద గంగాళాన్ని పెట్టి అందులో అందరినీ ఇంటికొక బిందెడు పాలు తెచ్చి పొయ్యమన్నారట. ఒక ఎల్లయ్య, మిగితా ఊరి జనాభా మొత్తం పాలు పోస్తే – నేనొక్కడినే నీళ్ళు పోస్తే – ఎవరికీ తెలీదు, అని గంగాళంలోకి నీళ్ళు పోశాడట. ఇంకొక పుల్లయ్య కూడా ఎల్లయ్య లాగానే ఆలోచించాడట, ఆ ఆలోచనను అమలు చేశాడట. ఊరి మొత్తానికి పాయసం వండి పంచేందుకు ఏర్పాటు చేసిన ఆ కార్యక్రమం కోసం అందరూ పాలు పోశేసారు అనుకున్నాక గంగాళం తీసి చూస్తే, ఒక్క చుక్క పాలు లేవట, అందరూ ఎల్లయ్యలాగా, పుల్లయ్యలాగా పాల బదులు నీళ్ళే ఆ గంగాళంలో పోశారు.

సరిగ్గా ఇలానే రాజకీయ నాయకుల నుంచి బడిలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల వరకూ అందరూ మరొకరు చేస్తారులే అనుకొని భాష పట్ల మనం కనీసం పాటించాల్సిన మెలకువలు పాటించడం లేదు. అందువలన అపార నష్టం జరిగిపోతోంది.

వస్తుసేవల నుండి ప్రభుత్వ ఉత్తర్వుల దాకా, వార్తాంశాల నుండి వైద్య సూచనల దాకా – మన రోజువారీ జీవితంలో ప్రతి అంశం మన భాషలో మనకు అందుబాటులో ఉంటేనే, ఆ భాష మాట్లాడుతున్న వారిగా మనకు ఉనికి ఉంటుంది. ఏదైనా రంగంలో మన భాషలో కాకుండా వేరే ఏదో భాషలో ఒక అంశం ఉండి, ఆ రంగంలో పని చేయడానికి వెళ్ళిన మన భాష వాడు ఆ వేరే భాషను నేర్చుకుని మరీ ఆ రంగంలో తన చోటు దక్కించుకుంటున్నాడంటే – భాషగా, జాతిగా మనం ఆ రంగంలో మన భాష అస్తిత్వాన్ని కాలరాసినట్టే.

మనం ఒక వస్తువు కొనాలనుకున్నాము, ఆ వస్తువును ఉపయోగించే విధానాన్ని తెలిపే సమాచారం కచ్చితంగా మన భాషలో ఉండాలి. అలా లేనట్లయితే మనం ఆ వస్తువును కొనకూడదు.

ఒక రాజకీయ నాయకుడు ఉన్నాడు, మనతో తన మాటామంతీ మన భాషలో సాగుతున్నా, ఉత్తరప్రత్యుత్తరాలకు అతను మన భాష కాని పరాయి భాషను వాడి మనతో సంభాషిస్తున్నాడు. అతడ్ని ఆ క్షణమే నిలదీసి, ఆపై అతను చేసే సంభాషణలన్నీ మన భాషలో ఉండే లాగా చేసుకోవాలి.

రైలు టిక్కెట్టు కొనుక్కోవాలి, ఆ కొనుక్కునే వ్యవస్థ మన భాషలో ఉండాలి. లేకపోతే మన భాషలో వ్యవస్థను మార్చమని మనం ఫిర్యాదు చేయాలి.

విపత్తు నిర్వహణ వారు మన భాష కాని భాషలో మనకు సూచనలు ఇవ్వరు కదా. మిగితావన్నీ కూడా అంతే!

ఇందులో ఏదైనా మన భాషలో మనకు అందకపోతే, మన భాషలో ఆయా అంశాలను అడిగే హక్కు మనకు ఉంది.

ఈ హక్కును మన దేశ ప్రభుత్వమో, రాష్ట్ర ప్రభుత్వమో కాదు, మన రాజ్యాంగం మనకు కల్పిస్తోంది.

మనకు కావాల్సిన విషయాలు మనకు అర్థమయ్యే భాషలో ఉండాల్సిందేనని, లేని పక్షంలో మన మానవహక్కులకు ఘాతం కలుగుతుందని ఐక్యరాజ్య సమితి "మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన" ద్వారా దశాబ్దాల క్రితమే చెప్పింది.

భాష ప్రాతిపదికన ఏ వ్యక్తీ ఎలాంటి వివక్షకూ గురి కాకూడదని ఐరాస వక్కాణించి చెప్పింది.

అందువలన ఎవరైనా ఏదైనా విషయాన్ని మీకు మీ భాషలో అందించడంలో విఫలమైతే అది మీ హక్కుల హననమని గుర్తించి మసలుకుంటే, మన మన మాతృభాషలకు మనం ఎంతో చేసిన వారమవుతాము.

మాతృభాషా మాధ్యమ బడులను తీసివేసి వాటి స్థానంలో ఆంగ్లభాషా మాధ్యమ బడులను ప్రభుత్వాలు నడపడానికి సిద్ధమవుతున్నాయి. కానీ ఏ ఒక్క విద్యార్థి అయినా తనకు తన మాతృభాషలోనే విద్య కావాలి అని అడిగితే మాత్రం ప్రభుత్వం ఆ విద్యార్థి అభ్యర్థనను తోసిపుచ్చకూడదు.

తెలుగు మాధ్యమంలో విద్య ఉండడం కచ్చితంగా తెలుగు భాషా అస్తిత్వానికి అవసరం కానీ మనం బ్రతుకుతున్నది అసాధారణమైన సమయంలో.

కంప్యూటర్లు-ఇంటర్నెట్ రాకతో ఇప్పటికే విద్యావ్యవస్థ నిలువెత్తునా మారిపోతోంది. కొరోనా వలన వచ్చిన ఈ లాక్‌డౌన్‌ల కారణంగా

# అమ్మనుడుల పండుగ



**ఏ భాష** అయినా నశిస్తే నష్టం ఏమిటి? దాని బదులు ఆ జాతి వేరే భాషలో వ్యవహరిస్తోంది కదా! క్షమించాలి, భాష అంటే సమాచార వినిమయ వాహకం మాత్రమే కాదు.

భాష అంటే, ఆ భాష మాట్లాడే జాతి చరిత్ర, ఆ జాతి తరతరాల జ్ఞానసంపద, ఆ జాతి ప్రత్యేక గుర్తింపు.

భాష అంటే అక్షరాలు మాత్రమే కాదు. అది కుటుంబ సంబంధాలకు అద్దంపట్టే పనిముట్టు.

భాష అంటే కొన్ని పదాలూ వాక్యాలూ మాత్రమే కాదు, అది ఒక సామాజిక చైతన్య వేదిక.

భాషలు మానవ వికాస పరంపరలో ఏర్పడిన జీవభౌతిక సృజనలేకాదు, అవి తరతరాల సామాజిక సాంస్కృతిక వారసత్వ జ్ఞాన సంపదలు కూడా. ఆ జాతికి ప్రత్యేక గుర్తింపు నిచ్చేవికూడా. వాటిని పక్కన పెట్టించే పనులు ఆ సమాజంపై దాడితో సమానం.

సుమారు ఒక లక్ష సంవత్సరాల క్రితం నరావతారంలో భాగంగా ఉద్భవించినదే భాష. ఆనాటి నుంచి ఈనాటి వరకూ జరిగిన మానవ వికాసంలో భాష తోడునీడగా మనతో కలిసి అనేక మార్పులు చెందింది. కానీ మన భాష మనల్ని వీడలేదు. మన అమ్మమ్మ నుండి అమ్మకూ అమ్మనుండీ మనందరికీ వేలతరాలుగా వారసత్వంగా వస్తూనే ఉంది. అమ్మ జోలపాటలే మొదటి పాఠాలు అమ్మనుడిలో.

కానీ అక్కడక్కడ ఈ నేలపై కొందరు ముష్కరులు నరహంతకులై సాగించిన అతిక్రమణలలో ఆక్రమణలలో తగులబడ్డ అమ్మల ఆక్రందనలలో పసివాడని పసిగుడ్ల ఏడ్పులలో, నిహతులైన సోదరుల హాహాకారాలలో ఎందరి అమ్మనుడులు మాయమైపోయాయో. వాటితో పాటే ఆ జాతుల యావత్తు చరిత్రా, ఈ నేల అడుగుల్లో నిక్షిప్తమైన ఎముకల పంజరాలను మిగిల్చి ఆవిరైపోయిన జాతుల జననుడులు ఎన్నో.

ఒక జాతి బానిసత్వానికి మొదటి మెట్టు పరభాష. ఒక జాతి జవసత్వాలకు అద్దం అమ్మభాష. జాతిపోయినా భాషలో బతికే ఉంటుంది. కానీ అమ్మభాషనుకోల్పోయిన జాతికి బతుకూ లేదు, భవితా ఉండదు.

**– గారపాటి ఉమామహేశ్వరరావు**

భారతీయ భాషల జాతీయ సంఘ అధ్యక్షుడు

చదువుల విధానం, పద్ధతి చాలావరకూ మారనున్నాయి.

చరిత్ర మొదలు నుంచి గత దశాబ్దం వరకూ పనుల్లో వ్రాత ముఖ్యంగా ఉండేది. వ్రాత వలన పాఠ్యాన్ని చదవడం కూడా ప్రాముఖ్యతను సంపాదించుకుంది. మాటకు–విని అర్థం చేసుకోవడానికి పెద్ద అవకాశం లేనందున, కొద్దిపాటి ఉద్యోగాలకు అవి ముఖ్యమయ్యాయి.

మారుతున్న సాంకేతికతల వలన వ్రాత–వ్రాసినది చదవడం అనే క్రియలు వెనక్కు నెట్టబడి, మాట్లాడడం–వినడం అనే క్రియలు ముఖ్యమవుతున్నాయి.

రాత్రికి రాత్రే పరిస్థితులు మారిపోవు గానీ, రాబోయే రోజుల్లో వ్రాయటం అనే పని పూర్తిగా తగ్గిపోతుంది. టైప్ చేయడం కూడా అరుదుగా కనిపిస్తుంది. భవిష్యత్తులో లిఖిత రూపంలో పాఠ్యం ఉన్నా, అది ఒక యంత్రం ద్వారా వ్రాయబడటానికే ఎక్కువ ఆస్కారాలు.

పలికే మాటల్లో, వినబడే మాటల్లో తెలుగును పరిపుష్టం చేయడం ద్వారా మనం తెలుగు భాషను మరింత దృఢంగా మనేలా చేయగలుగుతాము.

అందువలన మన కబుర్లను, కథలను, ప్రాచీన వాఙ్మయాన్ని, సమకాలీన సాహిత్యాన్ని మౌఖిక రూపానికి "కూడా" మార్చుకోవడం, అందుకు తగిన దృశ్య–శ్రవణ వనరులు తయారు చేసుకోవడం ముఖ్యం.

ఒకప్పుడు ఒక పుస్తకం పాఠ్యపుస్తకంగా మారడానికి ఒక పెద్ద ప్రక్రియ ఉండేది. తీరా ఆ పుస్తకం పాఠ్యపుస్తకంగా చెలామణి అయ్యే నాటికి బయటి ప్రపంచంలో చాలా మార్పులు వచ్చేసేవి. పిల్లలు పుస్తకాల్లో చదివే ప్రపంచానికి, బయట చూసే ప్రపంచానికి పొంతన ఉండకపోవటం వలన అది చదువుల్లో ఒక వెలితిని మిగిల్చేది.

మారిన కాలంలో పాఠ్యసామగ్రి నిత్య నూతనంగా తయారు చేసుకోవచ్చు. ఈ అంశంలో ఉంది, ఈ అంశంలో లేదు అన్నట్టుగా కాకుండా అన్ని విషయాల మీదా ప్రతి ఒక్కరూ యూట్యూబ్ లాంటి వేదికలపై మాట్లాడేస్తున్నారు. అతివృష్టిలా సమాచార విస్ఫోటనం జరుగుతోంది. అయినా తెలుగులో తెలుగువారికి అందించాల్సిన సమాచారం దృశ్యకాల రూపంలో శ్రవ్యకాల రూపంలో ఇంకా బోలెడంత ఉంది.

మనం ప్రతి ఒక్కరం మనకు కుదిరినన్ని కబుర్లను, విషయాలను, సమాచారాన్ని, తెలుగులో పలుకుతూ శ్రవ్యకాలుగా, దృశ్యకాలుగా రూపొందించి ప్రపంచానికి అందించడమే భాషకు మనం చేయగల పెద్ద పనుల్లో ఒకటి.

ఇంటర్నెట్‌లో సమాచారం కుప్ప పోసినట్టు ఉంటుంది. ఇందులో సరైన సమాచారం ఏది, సరైంది కాని సమాచారం ఏది అన్నది మరొక సవాలు. ఒక క్రమ పద్ధతిలో తెలుగులో ఇంటర్నెట్లో సమాచారాన్ని సంగ్రహించడం మరొక పెద్ద పని.

ఇంటర్నెట్ – దృశ్యకం – శ్రవ్యకం – ఎవ్వరైనా ఏదైనా మాట్లాడొచ్చు – అన్న విషయాలు ఆసక్తిగా ఉన్నాయి కదూ.

ఈ కొత్త రూపంలో తెలుగు భాషకు మాండలికాల, యాసల పరిధులు లేవు. పండితులే పలకాలి, ఇతరులు వినాలి అన్న నిబంధన లేదు.

మీకు నచ్చిన విషయాలు మాట్లాడండి, మీకు తోచిన కబుర్లు చెప్పండి.

ఇలాంటి చిన్న చిన్న పనులే ఎవరైనా తమ తమ పరిధి నుంచే చేయగల అద్భుతమైన భాషాసేవ.

– రహ్మానుద్దీన్ షేక్

# 2022 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

## అంశం: "బహుభాషా విద్య కోసం సాంకేతికతను ఉపయోగించడం: సవాళ్ళు మరియు అవకాశాలు"

**బహుభాషా విద్యను అభివృద్ధి చేయడానికి మరియు అందరికీ నాణ్యమైన బోధన మరియు అందరికి న్యాయమైన బోధన, అభ్యాసాన్ని అభివృద్ధి చేయడానికి సాంకేతికత పాత్రను గురించి చర్చ**

నాణ్యమైన బహుభాషా బోధన మరియు అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడం ఎలా? సాంకేతికత ద్వారా బహుభాషా బోధనని, అభ్యాసాన్ని మరింత పరిపుష్టం ఎలా చేయాలి, అవకాశాలు ఏమున్నాయి అన్న విషయమై అధ్యయనం.




ఈరోజు విద్యలో ఎదురవుతున్న కొన్ని అతిపెద్ద సవాళ్లను పరిష్కరించగల సామర్థ్యం సాంకేతికతకు ఉంది.

"అందరికీ సమాన విద్య", "అందరినీ కలుపుకుపోయే పద్ధతుల" ద్వారా దిశానిర్దేశం చేస్తే, అందరికీ జీవితకాల అభ్యాస అవకాశాలను నిర్ధారించే దిశగా ప్రయత్నాలను వేగవంతం చేయవచ్చు.

మాతృభాషపై ఆధారపడిన బహుభాషా విద్య ప్రస్తుత విద్యావ్యవస్థలో చేర్చడం కీలకమైన అంశం.

కోవిడ్ - 19 పాఠశాల మూసివేత సమయంలో, ప్రపంచంలోని అనేక దేశాలు చదువులను కొనసాగించడానికి సాంకేతిక పరిష్కారాలను ఉపయోగించాయి.

ఇటీవల యునెస్కో, యునిసెఫ్, వరల్డ్ బ్యాంక్ మరియు ఒఇసిడి 143 దేశాలలో కోవిడ్- 19 పాఠశాలల మూసివేతపై జాతీయ విద్యా ప్రతిస్పందనలపై జరిపిన సర్వేలో 96 శాతం అధిక-ఆదాయ దేశాలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా రిమోట్ లెర్నింగ్‌ను అందించాయని తేలింది, ఇది కేవలం 58% మాత్రమే.

**తక్కువ ఆదాయ దేశాలలో శాతం:**

తక్కువ-ఆదాయ సందర్భాలలో, మెజారిటీ దేశాలు టెలివిజన్ (83%) మరియు రేడియో (85%) వంటి ప్రసార మాధ్యమాలను చదువుల కొనసాగింపుకు ఉపయోగిస్తున్నట్లు నివేదించాయి.

సహజంగానే, ఉపాధ్యాయులకు దూర బోధనను ఉపయోగించడంలో నైపుణ్యం కానీ సంసిద్ధత కానీ లేదు.

చాలా మంది విద్యార్థులకు అవసరమైన పరికరాలు, ఇంటర్నెట్ యాక్సెస్, యాక్సెస్ చేయగల మెటీరియల్‌లు, స్వీకరించబడిన కంటెంట్ మరియు దూరవిద్యను అనుసరించడానికి అనుమతించే మానవ మద్దతు లేదు.

అంతేకాకుండా, దూరబోధన మరియు అభ్యాస సాధనాలు, కార్యక్రమాలు మరియు కంటెంట్ ఎక్కువగా అధికారిక/ఆధిపత్య జాతీయ లేదా అంతర్జాతీయ భాషలలో అందించబడ్డాయి. అ

**మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది - 'యునెస్కో'**

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు?

**అం**తర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తరుచూ వినిపించే ఒక మాట ఐక్యరాజ్యసమితి వారు తెలుగు అంతరించిపోతోంది అని ప్రకటించారని. ఈ వార్త నిజంకాదని మనలో చాలా మందికి తెలుసు. మీకిప్పటి వరకూ తెలీకపోతే తెలుసుకోండి – ఐక్యరాజ్యసమితి గానీ, యునెస్కో గానీ తెలుగు భాష ప్రమాద స్థితిలో ఉందనో, అంతరించిపోతుందనో ఇప్పటివరకూ ఎప్పుడూ ప్రకటించలేదు. తెలుగు భాష ఉనికి ప్రమాదంలో ఉంది అన్న మాట అపోహ మాత్రమే.

కానీ కొన్ని భాషలను ఐక్యరాజ్యసమితి అంతరించి పోయినవిగా గుర్తించింది. కొన్ని భాషలు త్వరలో అంతరించిపోతాయని, కొన్ని అంతరించబోయే ప్రమాద స్థాయి కొన అంచున ఉన్నాయని, కొన్ని భాషలు ఇంకొక తరం తరువాత మనగలిగే అవకాశం లేదని ఐక్యరాజ్యసమితి ప్రకటించి, ప్రపంచ భాషల్లో ప్రమాద స్థితిలో ఉన్న భాషల అట్లాసుని వలగూడు ద్వారా ప్రచురించింది.




ఆ అట్లాసులో ఇచ్చిన భారతదేశ పటాన్ని గమనిస్తే, నలుపు–తెలుపు–పసుపు–నారింజ–ఎరుపు రంగుల్లో గుర్తులు ఉంటాయి. ఒక్కో గుర్తు ఒక్కో భాషకు ప్రతీక. రంగు భాష స్థితిని తెలుపుతోంది.

ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదంలో లేని భాషలు ఈ పటంలో కనిపించవు. ఇంటా బయటా ఆ భాషను మాట్లాడుతూ ఒక తరం నుంచి మరొక తరానికి ఆ భాషను కొనసాగిస్తున్న జనాభా ఉంటే, ఐరాస ప్రకారం ఆ భాషకు ఎలాంటి ప్రమాదమూ లేదు.

తెలుపులో చూపించిన భాషలు దుర్బలంగా ఉన్నాయని అర్థం. అంటే ప్రస్తుత తరం వారి పిల్లలకు ఆ భాష నేర్పినా, పిల్లలు ఇంట్లో తప్ప బయట బడిలో ఆ భాష మాట్లాడటం లేదు.

పసుపులో చూపించిన భాషలు కచ్చితంగా ప్రమాద స్థాయిలో ఉన్నాయని అర్థం. అంటే ఇళ్ళలో పిల్లలు ఆ భాషను మాతృభాషగా నేర్వడం లేదు.

నారింజ రంగులో చూపిన భాషలు తీవ్రమైన ప్రమాద స్థాయిలో ఉన్నాయని అర్థం. అంటే తాతల తరంలో ఉన్న పెద్దలు మాత్రమే ఆ భాషను మాట్లాడుతున్నారు, తల్లిదండ్రుల తరంలో ఉన్నవారు కేవలం భాషను అర్థం చేసుకోగలరు కానీ మాట్లాడరు. తమ మధ్య, పిల్లలతో మాట్లాడేటప్పుడు ఆ భాషను వాడటం ఆపేసారు.

ఎరుపులో చూపించిన భాషలు పూర్తి స్థాయి ప్రమాదంలో ఉన్నాయని అర్థం, కనుమరుగవటానికి కొద్ది దూరంలో ఉన్న భాషలను ఎరుపు రంగులో చూపించారు. భాషను మాట్లాడే తరం కనుమరుగు అయిపోయి, అక్కడక్కడా అరకొరగా ఆ భాషను అర్థం చేసుకోగల ముసలివాళ్ళే మిగిలి ఉన్న భాషలు. ఆ ముసలివాళ్ళు కూడా ఆ భాషను రోజువారీ సంభాషణల్లో వాడటం లేదు.

ఇక నలుపులో ఉన్న భాషలు అంతరించిపోయినవని అర్థం, పూర్తిగా కనుమరుగు అయిపోయిన భాషలు. ఆ భాషలు ఒకప్పుడుండేవన్న ఆనవాలు తప్ప ఆ భాష సహజంగా మాట్లాడే వ్యక్తి ఎవరూ లేకపోతే ఆ భాషను నల్ల రంగులో చూపారు. 1950 తరువాత అంతరించిపోయిన భాషలను మాత్రమే ఈ అట్లాసులో చూపారు.

ఇక్కడ చదువరుల సౌకర్యార్థం భారతదేశ దక్షిణ భాగ పటం బొమ్మని జత చేస్తున్నాను. (ముఖచిత్రం)

భారతదేశంలో అంతరించిపోయిన భాషలు – అహోమ్, అండ్రో, చాయ్రెల్, రంగ్కాస్, సెంగ్మై, తోల్చా.

భారతదేశంలో పూర్తిగా ప్రమాదస్థాయిలో ఉన్న భాషలు – పర్జీ, సిర్మౌడి, గదబ, కొరగ, పంగ్వలి, కురుబ, బంగని, లమ్గన్గ్, ముపోత్, నాయకి, పు, బఘతి, తకహన్యిలంగ్, ఐమోల్, బిరోర్, కోట, లూడో, నిహాలీ, సనెన్యో, పెంగో, కొయ్రెంగ్, తోడ, తౌతా, తరౌ, పురుమ్, లమొంగ్సె, మ్రా, నా, అకా, హందూరి, రుగ, షొంపెన్, తై నొర, తై రౌంగ్, తంగం, ఒంగె, సెంటిలీస్, జరావా, పెద్ద అండమానీస్, బెళ్ళారి, లంగ్రౌంగ్ మరియు మండా భాషలు.

భారతదేశంలో తీవ్రంగా ప్రమాద స్థాయిలో ఉన్న భాషలు – గెత, రెమొ, ఐతౌన్, తై ఫకె, మెచ్ మరియు అఅతొంగ్ భాషలు.

భారతదేశంలో కచ్చితంగా ప్రమాద స్థాయిలో ఉన్న భాషలు – కంగ్డి, మండేలి, మిసింగ్, మహాసుయి, కుర్రు, కువి, లింబు, మాల్తొ, కులుయి, కొడగు, బడగ, చంబేలి, కోలామి, కొండ, జౌన్సరి, భద్రవాహి, కిన్నౌరి, చౌరాహీ, కచరి, కోచ్, లేప్చా, దేవ్రి, జువంగ్, తివ, మారా, బీతే, గంగ్తె, నహాలీ, బౌం, కొండ ప్రాంతపు మిరి, ఇదు, మొతువౌ మెన్బ, అసుర్, సులుంగ్, గౌరుం, కొం, మిజి, సింగ్పొ, తురి, అక, బునన్, భర్మౌరి, మొయొన్, బ్రొక్షత్, బోరి, జంగ్షుంగ్, మిలంగ్, తినన్, దర్మ, బ్యాంగ్సి, కనషి, ఖంబ, లిష్పు, దక్పు, ఖొవ, పసి, జైవ, కుందల్‌షాహి, భలేసి, జడ్, ఖసలి, కొరొ మరియు జంగ్సరి.

దుర్బలంగా ఉన్న భాషలు – గౌండీ, కుమావుని, కురుఖ్, తుళు,

మెయిథి, తమంగ్, కుయి, ఖాసి, బోడో, ముండారి, అంగిక, కోక్బొరొక్, మిజో, కర్బి, హో, గఢ్వాలీ, సోర, కొన్యక్, అఒ, ఇరుల, ఖరియ, కొర్కు, షంగ్లు, తడో, ఆది, ఖౌట, న్యిషి, రభ, షేర్పా, తంగ్ఖుల్, అంగామీ, ఫోమ్, దిమస, లద్దాఖీ, సిమి, కబుయి, యిమ్‌చుంగ్రు, చొక్రి, సంగ్టం, మఒ, బిష్ణుప్రియ మణిపురి, క్రెవొల్, చాంగ్, సువాంఖ్మి, రెంగ్మ, కువోన మెంబ, హ్మార్, పైతె, వాంచో, ఖుంజి, ఖేజా, గుటోబ్, మిన్యోంగ్, తంగ్స, ఖియామ్‌న్, మరం, అపతాని, గలో, కోర్వ, లియంగ్మై, జెమె, నొక్టె, టగిన్, మ్‌జియెమె, కొడ, అనల్, మరింగ్, బంగ్ని, ఖైరావొ, మంచడ్, పడం, హ్రాంగ్‌ఖోల్, పోచూరి, ఖంప్టి, తరువంగ్, రోంగ్పో, మిజు, బోకర్, షెర్దుక్పెన్, బాల్టీ, పాద్రి, పురిక్ మరియు స్పిటి.

ఒక భాష ప్రమాదకర స్థితికి చేరుకుందంటే, ఆ భాష కనుమరుగయ్యేందుకు సిద్ధంగా ఉందని, అందుకు ఆ భాష మాట్లాడే జాతివారు బాట వేయటం మొదలుపెట్టారని. సరైన విధానంలో కావాల్సిన వనరులు సమకూరిస్తే ఆ భాషను పునరుద్ధరించవచ్చేమో. అలాంటి వనరులు సమకూర్చకపోతే ఆ భాషను ఈ లోకం పూర్తిగా కోల్పోతుంది. మరెప్పటికీ ఆ భాషను పునరుద్ధరించలేము!

ఒక భాష ప్రమాదంలో పడిందంటే అర్థం ఆ భాష మాట్లాడే వ్యక్తులు ఆ భాషను నిర్లక్ష్య పెడుతున్నారని. ఆ భాషను తమ మాటల్లో, సంభాషణల్లో వాడట్లేదని. భాషను వాడే వివిధ మాధ్యమాల్లో – రోజువారీ మాటలు, సాహిత్యం, విద్వత్ సభలు, వార్తలు, వార్తా పత్రికలు, సినిమాలు, దృశ్యకాలు, శ్రవ్యకాలు, రేడియో, ఇంటర్నెట్లో వివిధ జాలస్థలాలు – ఒక్కొక్క మాధ్యమంలో ఆ భాష వాడకం తగ్గిపోతుంది లేదా ఉనికి పొందలేదు అని. ఒక తరం వారు తమ తరువాతి తరానికి ఆ భాషను మాతృభాష రూపంలో అందించకపోయినా ఆ భాష ప్రమాదంలో ఉన్నట్టే! కాలానుగుణంగా కొత్తగా ఆ భాషను మాట్లాడే పిల్లలు కానీ, పెద్దలు కానీ పుట్టుకురాని సందర్భంలో ఆ భాష కచ్చితంగా ప్రమాదంలో ఉన్నట్టే!

ప్రపంచ జనాభాలోని 97% మంది ప్రపంచంలోని భాషల్లో 4% భాషలనే మాట్లాడతారు. అదే ప్రపంచంలోనే 96% భాషలను మాట్లాడే జనాభా ప్రపంచంలోని మొత్తం జనాభాలో కేవలం 3% మాత్రమే. బెర్నర్డ్ రజెల్ తమ పరిశోధనాపత్రం “ప్రిజర్వింగ్ లాంగ్వేజ్ డైవర్సిటీ(భాషా వైవిధ్యాన్ని కాపాడుట)” లో చెప్పిన మాటలివి. అంటే భాషా వైవిధ్యాన్ని పాటిస్తున్న జనాభా చాలా చాలా తక్కువ అనమాట.

వేల జనాభా మాట్లాడే భాషలు సైతం తరువాతి తరం పిల్లలకు నేర్పబడటం లేదు. ఏడాది మారేసరికి ప్రపంచంలో నేడు అస్తిత్వంలో ఉన్న భాషల్లో సగం అంతరించిపోతున్నాయి. 21వ శతాబ్దం చివరికి 90% భాషలు కనుమరుగు అయి, ఆ భాషలు మాట్లాడాల్సిన జనాభా ఒక పెద్ద భాషను తమ మాతృభాషగా మార్చుకోవటం సాధారణంగా జరిగిపోయే విషయంలా అనిపిస్తోంది.

భాషలు ప్రమాదస్థాయికి పడిపోవటం అనేది రెండు కారణాల వల్ల జరగవచ్చు – బాహ్య ప్రోద్బలం, లేదా అంతర్గత కారణాలు.

సైనికాధికారం వలనో, ఆర్థికపరమైన, మతపరమైన, సాంస్కృతిక పరమైన లేదా చదువుల కారణాల వలనో బాహ్యంగా భాష ప్రమాద స్థాయికి చేరుకుంటుంది.

ఉదాహరణకు పాకిస్తాన్ లో ఉర్దూను జాతీయ భాషగా అమలు చేయటం వలన, అక్కడ 5% జనాభాకు కూడా తెలీని ఒక బయటి భాష, ఐదారు తరాలలో 40% జనాభాకు మాతృభాషగా మారిపోయింది. ఆయా వ్యక్తుల మాతృభాషలు కనుమరుగైపోయాయి. ఈజిప్టు నుంచి వలస వచ్చిన కొన్ని తెగల వాళ్ళు భారతదేశంలో తాము స్థిరపడిన ప్రాంతాల స్థానిక భాషలను ఆర్థిక కారణాల వలన తమ మాతృభాషలుగా మార్చేసుకున్నారు.

ఇక ఒక భాష మాట్లాడే జాతిలోని వ్యక్తులకు తమ భాష పట్ల ఆదరాభిమానాలు లేకపోవడంతో తమ భాషను తామే చులకనగా చూడటం వలన అంతర్గత కారణాలతో భాష ప్రమాదంలో పడుతుంది. తమ సొంత భాష పట్ల చులకన భావనుండే ఈ అంతర్గత భావానికి పైన చెప్పుకున్న బాహ్య కారణాలు తోడ్పాటును అందించి మరింత త్వరగా భాషను కనుమరుగు అయ్యేలా చేస్తాయి. ఈ బాహ్యాంతర కారణాల వలన ఆ భాష తరువాతి తరం పిల్లలకు అందకుండా అయిపోతుంది. భాషతో పాటుగా సంస్కృతిలో కూడా మార్పులు చోటు చేసుకుని ఆ జాతి నాశనమవుతూ మరో జాతిని పరిపుష్టం చేస్తుంది.

ఎందరో మూలవాసి ప్రజలు తమ సామాజిక వెనకబాటుతనానికి తమ సంస్కృతే కారణమని భావించి, తమను తాము తమ సొంత మాతృభాష నుండి, తమ సంస్కృతి నుండి దూరం చేసుకుంటున్నారు. ఆ భాష లేదా ఆ సంస్కృతి తమను సామాజికంగా దిగజార్చుతుందనే భావనలోకి వారు వెళ్ళిపోయారు. పెద్ద భాష మాట్లాడే వారు ఈ చిన్న భాషను మాట్లాడే వారిని భాష నెపంతో హేళన చేయడం, తక్కువ చేసి చూడటం వలన చిన్న భాష మాట్లాడే వ్యక్తులు సామాజిక దర్జా కోసం పెద్ద భాషను సొంతం చేసుకుంటున్నారు, చిన్న భాషను బలవంతంగా మర్చిపోతున్నారు.

ఈ సామాజిక వివక్ష నుండి తప్పించుకోవచ్చని తమదైన భాషను, సంస్కృతిని పరాయి చేసుకుంటున్నారు. పరాయి భాషను, సంస్కృతిని సొంతం చేసుకుంటున్నారు.

మంచి ఉద్యోగం వస్తుందని, సమాజంలో స్థాయి మెరుగవుతుందని, తమకన్నా పెద్ద మెరుగైన సమూహంలో చేరుతామని ఈ చిన్న భాషల వ్యక్తుల ఉబలాటం.

కానీ ఒక సారి ఒక భాష అంతరించిపోతే (కనుమరుగయిపోతే), ఆ భాషకే ప్రత్యేకమైన సాంస్కృతిక, చారిత్రక, పర్యావరణ విజ్ఞానాన్ని ఈ ప్రపంచం కోల్పోతుంది. ప్రతీ భాష, ప్రపంచాన్ని ఆ భాషను మాట్లాడే వ్యక్తులు చూసే తీరును నిక్షిప్తం చేసుకుని ఉంటుంది. భవిష్యత్తులో మనం మానవజాతిగా ఎదుర్కోబోయే ఎన్నో సవాళ్ళకు ఈ భాషల విజ్ఞానంలో సమాధానం దాక్కొని ఉంటుంది. ఒక భాష పోగొట్టుకుంటే, ఆ భాషలో సమకూరిన అపార విజ్ఞానం మొత్తం మానవజాతి కోల్పోయినట్టే. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఎలా బ్రతకాలి, ఏం తినాలి, ఎలా వ్యవహరించాలి, విపత్తులను ఎలా ఎదుర్కోవాలి లాంటి విషయాలు ఒక్కో భాషాజాతి తమతో పాటుగా మోసుకొస్తుంది. ఆ జాతిలోని ప్రతి వ్యక్తికి ఆ భాష ఒక గుర్తింపు. ఆ భాష పోగానే ఆ

వ్యక్తికి ఆ గుర్తింపు కూడా పోతుంది. పెద్ద భాషకు మారినా, ఆ పెద్ద భాషాజాతి వారు చిన్న భాషాజాతి వాడిపై వివక్షను ఆపరు, కొత్త రకంగా వివక్ష మళ్ళీ బయటపడి ఆ చిన్న భాషవాడిని అనాథను చేస్తుంది.

అందువలన చిన్నా-పెద్దా అన్ని భాషలను కాపాడేందుకు సమస్త మానవాళి కృషి చేయాలి. ఆయా భాషల జాతుల్లో ఆ భాషకు సముచిత గౌరవం ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి భాషకూ ఒక సమున్నత స్థానం ఏర్పడాలి. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సంఘంగా, సాంకేతికంగా, న్యాయపరంగా, పర్యావరణ పరంగా ప్రతి భాషకూ అర్థవంతమైన స్థాయి ఏర్పడాలి. ఉద్యోగ కల్పన ఆ భాషలో జరగాలి. మన ఆధునిక జీవితాలలో సమర్థవంతంగా ఈ చిన్ని భాషలన్నిటికీ స్థానం ఏర్పడాలి. రోజువారీ సంభాషణలలో చిన్నా-పెద్దా అన్ని భాషల వాడకం పెరగాలి. ఆర్థిక లావాదేవీల్లో భాష వాడకం ఎక్కడెక్కడ ఉందో, ఆ ప్రదేశాలలో చిన్నా-పెద్దా భాషలకు స్థానం కల్పించాలి. చదువుల్లో ప్రారంభ స్థాయి నుండి పరిశోధన స్థాయి వరకూ భాషకు స్థానం ఉండాలి. సాహిత్య రూపకల్పన భాషలో విరివిగా జరగాలి. ప్రదర్శనా కళలలో భాషకు పెద్దపీట వేసి, ఆ భాషా సంస్కృతికి అద్దం పట్టే పాత కళలను పునరుద్ధరించాలి అలాగే ఆధునిక అంశాలలో కూడా ఆ భాషలో ప్రదర్శనా కళలను రూపొందించాలి. వల(ఇంటర్నెట్) విరివిగా వాడకంలో ఉన్న ఈ కాలంలో సాధ్యమైనంత మోతాదులో ఆ భాషలో విషయ సమాచారం అందుబాటులోకి రావాలి.

భాషను బలపరచడానికి ఆ భాషా జాతిలోని వ్యక్తులు సమూహాలు లోపల నుంచి తమ సాధ్యమైనంతలో కష్టపడాలి, బయట నుంచి ప్రభుత్వాలు భాషను బలపరిచేలా చర్యలు తీసుకుని, ఆ చర్యల అమలుకు తగ్గ చట్టాలు రూపొందించాలి.

భాషకు సంబంధించిన గణాంకాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఏ భాషా ప్రమాద స్థాయిలో అట్టడుగు స్థానానికి పడిపోకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

యునెస్కో భాషల పరిరక్షణకు ఒక సంఘాన్ని ఏర్పరిచి భాషల ప్రమాద స్థాయిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తించేందుకు కావాల్సిన వనరులు ఏర్పాటు చేసింది. యునెస్కో నుండి అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన పిలుపు వల్ల స్థానికంగానూ జాతీయ స్థాయిలోనూ పలు దేశాల్లో భాషల స్థితిపై అధ్యయనం చురుగ్గా మొదలయింది.

అసలు యునెస్కో ఏర్పడిందే భాష వివక్ష లేని మానవ హక్కుల దిశగా.

2001 లో యునెస్కో భాషా పరిరక్షణకు కొన్ని మార్గదర్శకాలను, వాటి అమలుకు కొన్ని కార్యక్రమాలను రూపకల్పన చేసింది.

ఈ అనేకానేక కార్యక్రమాలలో ఒకటి - ది రెడ్ బుక్ ఆఫ్ లాంగ్వేజెస్ ఇన్ డేంజర్ ఆఫ్ డిసప్పియరింగ్ (కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్న భాషల ఎర్ర పుస్తకం). ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలు:

1. ప్రమాదంలో ఉన్న భాషలను గురించిన సమాచారాన్ని కూడపెట్టడం.

2. కనుమరుగవటానికి దాదాపుగా సిద్ధంగా ఉన్న భాషలను కనుగొని, వాటిపై జరుగుతున్న పరిశోధనలను శక్తిమంతం చేయడం. ఇప్పటికే పరిశోధన మొదలవ్వని భాషల కోసం కొత్త వనరులు సృష్టించి, వెంటనే పరిశోధనలు జరిగే దిశలో పని చేయడం.

3. ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి ఉన్న సంస్థలను, వ్యక్తులను ఉపయోగించుకొని అంతర్జాతీయ స్థాయిలో ప్రాంతీయ కేంద్రాల సహాయంతో భాషల రక్షణ దిశగా పలు కార్యక్రమాలు నిర్వహించడం.

4. ప్రమాదంలో ఉన్న భాషల గురించిన సమాచారాన్ని ప్రచురించడం కోసం, పరిశోధనల ఫలితాలు ప్రచురించడం కోసం సహకారం అందించడం.

అయితే ఈ ఎర్ర పుస్తకం రూపొందించే కార్యక్రమంలో ఆయా భాషలను మాట్లాడే వ్యక్తుల సమూహాలతో కలిసి పనిచేసే అంశంపై శ్రద్ధ లేదు. ప్రమాదంలో భాషను ఉన్న స్థితిలో కొనసాగించేలా చూడటం మొదటి సవాలు(మరింత ప్రమాద స్థాయికి చేరకుండా). భాష స్థితిని మెరుగు పరచటం రెండవ సవాలు. భాషను ఆధునిక కాలానికి అనుగుణంగా అభివృద్ధి చేయటం మూడవ సవాలు. భాష కోసం చేస్తున్న ఈ కృషి శాశ్వతంగా అమలు అవడం నాలుగవ సవాలు.

ప్రమాదంలో ఉన్న భాషలపై చేస్తున్న పరిశోధనలన్నీ కూడా కేవలం ఆ భాష స్థితిని తెలియపరచటంతో ఆగిపోకూడదు. అధ్యయనంతో పాటుగా ఆ భాషాజాతిని అంతర్జాతీయంగా యునెస్కో ఆశిస్తున్న విద్యా-సామాజిక-సాంస్కృతిక ఔన్నత్యం వైపుకు తీసుకు వెళ్ళేలా పనులు చేపట్టాలి. ఆ భాషాజాతిలోని అన్ని వర్గాలను కలుపుకు పోయేలా ఆ పరిశోధనలుండాలి. పరిశోధనల్లో, అధ్యయనాలలో ఆయా భాషా జాతుల వ్యక్తుల సహకారం, భాగస్వామ్యం పరిశోధన రూపకల్పన స్థాయి నుంచి అన్ని అంశాల్లో ఉండాలి. పరిశోధన బయటి వ్యక్తి ద్వారా నామమాత్రంగా జరగకూడదు. పరిశోధన ఎలా చేయాలి, ఏమేం కార్యక్రమాలు చేపట్టాలి, లాంటి ప్రాథమిక విషయాలలో జనం పాత్ర ఎక్కువగా ఉండాలి.

అక్టోబర్ 2001 నాటి యునెస్కో వారు సాంస్కృతిక వైవిధ్యంపై చేసిన ప్రపంచస్థాయి తీర్మానంలో జీవ వైవిధ్యానికీ, సాంస్కృతిక వైవిధ్యానికీ, భాషా వైవిధ్యానికీ మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించారు.

యునెస్కో ఐరాస సభ్య దేశాలన్నింటిలో కింద తెలిపిన చర్యలు చేపట్టేలా ఉత్తర్వులనిచ్చింది:

1. మానవ భాషా వైవిధ్యాన్ని పరిరక్షిస్తూ, వీలైనన్ని ఎక్కువ భాషల్లో సమాచారం వినిమయమై, తయారై, వాడబడేలా చర్యలు తీసుకోవాలి.

2. చదువుల్లో అన్ని స్థాయిల్లో భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ, చిన్న వయస్సు నుండే పిల్లలకు ఎక్కువ భాషలు నేర్పేలా చర్యలు తీసుకోవాలి.

3. ఇంటర్నెట్ లో భాషావైవిధ్యాన్ని ప్రోత్సహించాలి. చదువుల్లో అవకాశం ఉన్నంతమేర ఆ భాషలో సంప్రదాయ పద్ధతుల్లో సమాచారాన్ని అందించే పద్ధతులను అన్వయించాలి. సమాచారం అందించడంలో, వాడుకలో సాంస్కృతికపరంగా ఆయా భాషా జాతి సముదాయాల సహకారంతో సార్వజనీనమైన(అందరికీ ఉచితంగా అందుబాటులో ఉండేలా) వనరుల సృష్టి జరగాలి.

**(ఇంకా ఉంది. మార్చి నెల సంచికలో చదవండి)**

# చివరి భాష !




**భాష** అంతరించిపోతే ఏమవుతుంది ? ఏమీ అవదు... రాత్రి కనబడే చంద్రుని మీద మసక మజ్జిగ పొరలా కాలుష్యం రోజు రోజు కప్పబడి చందమామ లేకుండా పోతుంది.
ఏదోఒకరోజు చంద్రుడు నశించి పోతాడు, వెన్నెల వదిలి పోతుంది. అయితే మాత్రం ఏమవుతుంది ? భాష నశించి పోతే మాత్రం మనకేమవుతుందని? నీ చుట్టూ, నా చుట్టూ మునుపు ఉన్న చెట్ల గుంపు పచ్చదనం ఇప్పుడు లేదు, చెట్ల నీడ కింద పడుకుని, నెత్తి పైని ఆకుల మధ్యలోనుండి వంటికి సన్నని వెలుతురు పచ్చ బొట్లు సోకిన కాలం రాలిపోయి ఎంతకాలం అయివుంటుంది? అయితేనేం ఇప్పుడు మునిగిపోయింది ఏముంది? భాష నశించిపోతే మాత్రం ఏమవుతుంది? పిల్ల కాలువ ఈ జీవితంలో నుంచి జారిపోయింది, కాలువ వడ్డున కూచుని, కాలు ఆడి, ఆడిన కాలును చేపపిల్ల ముట్టె తగిలి జన్మ గడిచింది? అయితే మాత్రం ఇప్పుడేమయింది కనుక? వీటన్నిటిలాగే భాషనశించిపోతే మాత్రం ఏమవుతుంది? మనకేం పట్టింది?

భాష, చరిత్ర, సంస్కృతి, సంపద, బాంధవ్యం, ప్రాణం, అని కొన్ని శ్వాసలు నడుస్తుంటాయి. నిజానికి అమూల్యమైనదేదో తెలిసిన ఆ ప్రాణాలు దానిని అంతరించి పోనీకుండా కాపాడుకోటానికి ఆరాటపడుతుంటాయి. అటువంటి మనుష్యుల్లోని ఒక అమెరికన్ యువ లింగ్విస్ట్ మార్టిన్‌కు భాషాశాస్త్రమే జీవితం, వీలయినంతగా భాషలని అంతరించి పోకుండా కాపాడుకోడమే లక్ష్యం. ఇప్పుడు అతడు మెక్సికో దేశంలోని ఆ అడవి మధ్య, సుమారు ఏభై గడపలైనా లేని, ఒక పేరు తెలియని ఒక చిన్న ఊర్లో, ఆ చిన్న చెక్కపలకల గదిలో ఉన్నాడు, అతని ఎదురుగా డెబ్బై సంవత్సరాల పైబడిన వారు ఇరువురు ఉన్నారు. ఒకరు 'జసింటా' స్త్రీ. మరొకరు 'ఇసారో' పురుషుడు. 'జిక్రిల్' అనేది ఒక భాష. అంతరించిపోతున్న భాష, మెక్సికో భాష. ఇప్పుడు మెక్సికో అంతటికీ దానిని మాట్లాడగలిగినవారు వీరు ఇద్దరే మిగిలారు. వయోవృద్ధులు. దాదాపు పన్నెండున్నర కోట్ల జనాభా గల దేశంలో ఒక చివరి మాటల ప్రపంచానికి మిగిలిన రెండు చివరలు.

జసింటా, మార్టిన్‌ని అడుగుతుంది 'నాయనా ఇంతగా వెదుక్కుంటూ ఎక్కడి నుండో ఇక్కడికి వచ్చావు కదా! నీకు జక్రిల్ భాష గురించి, మా తెగ గురించి ఏమి తెలుసు?'
'తెలిసింది చాలా తక్కువ అనుకోండి. మీ ఆచార వ్యవహారాలు, మీ భాష పుట్టుక, మీ బహుదేవతారాధన...' ఇలా మార్టిన్ ఏదో చెపుతున్నాడు. జసింటా అసహనంగా, అడ్డంగా తల ఊపుతుంది.
'ఈ విశ్వవిద్యాలయాల పిలగాడికి పాపం ఏమీ తెలీదు ఇసారో!' జసింటా, ఇసారో ఒకరి వైపు ఒకరు చూసి ఏదో సంజ్ఞ చేసుకుంటారు. 'మార్టిన్ – ఇసారో నీకు ఒకటి చూపిద్దామనుకుంటున్నాడు పోదాం పద'. ముగ్గురూ అడవిలోకి నడిచారు. దారిలో జసింటా జిక్రిల్ భాష పుట్టుక ఎలా జరిగిందనే కథ చెబుతూ నడుస్తోంది. సృష్టి ప్రారంభమయిన మొదట్లో గాలిలో ఎగిరే ఆడపిట్ట ఒకటి , నేలపై నడిచే తొలి మగ పురుషుణ్ణి చూసి ప్రేమించింది. ఆ పురుషుడూ ఈ పిట్టని ప్రేమించాడు. కానీ ఇద్దరి మధ్య మాటలాడుకోడానికి ఇద్దరిదయిన ఒక భాష తోడులేదు. అడవిలోని పక్షికీ, పశువుకూ, పురుగుకూ అన్నిటికి భాష ఇచ్చాడు దేవుడు, అదే జిక్రిల్. మనిషికే ఏ భాషా లేదు. మాటా మాటా లేని ప్రేమ అసంపూర్ణం కదా అని ఆ మానవుడికి జిక్రిల్ భాష నేర్పడం మొదలెట్టింది ఆ ఆడపక్షి. ఆ పక్షికి, పురుషుడికి కలిగిన సంతానమే మేము జిక్రియులము. ఈ అడవిలోని చెట్టూ, చేమ, పిట్టా మృగమూ అందరమూ ఈ భాషే మాటాడుకుంటాము. జక్రిల్ అంటే ప్రకృతి, ప్రకృతే మేము" అని కథ ముగించి ఆ ముసలి వాళ్ళు ఇద్దరూ ఆ అడవి నడిన నిలబడి గొంతెత్తి ఏదో పలుకుతారు. ఒకటి, రెండూ, పద్నాలుగు, వందలుగా, వేలుగా పిట్టల గొంతులు, పురుగుల పలుకులు వీరి మాటలకు ఓయని సమాధానం ఇస్తాయి అడవి అంతా ఆ తెలీని భాష పలుకుల పచ్చదనం మధ్య గలగలా విహారమవుతుంది . మార్టిన్ విభ్రాంతుడవుతాడు. ఏమిటి మనం అనుకుంటున్న భాష అంటే ? ఒక పలకరింపా? నాలుగు వరుసల వాక్యాలా? కాగితాల బొత్తులా?

ప్రకృతికి ప్రకృతి మొత్తం 'ఓ'యని సమాధానం పలకడమా?

మరుసటి ఉదయం నిద్ర లేవగానే మార్టిన్‌కి జసింటా ఇంట్లో ఏదో అసహజంగా ఉంది. విషాద వాతావరణం. బరువుగా ఉన్న మౌనం. జసింటా రాత్రి నిద్రలో గుండె పోటుతో మరణించింది. మరణం అంటే జక్రిల్ జాతి వారికి మరేం లేదు, కేవలం అదృశ్యం కావడం. పక్క నలిగి ఉంది. రాత్రి గుండె నొప్పి తాలూకు వేదనతో.. ఇక జసింటా ఎప్పటికీ కనపడదు. తమకు లేదు. మరి ఈ అపురూపమయిన భాష సంగతి ఏమిటి? ఇసారో ఉన్నాడు కానీ అతనికి జక్రిల్ తప్ప మరే భాషా తెలవదు. మార్టిన్‌కు స్పానిష్ వచ్చు, చనిపోయిన జసింటా మార్టిన్‌తో స్పానిష్‌లోనూ, ఇసారోతో జక్రిల్‌లోనూ మాట్లాడి వారి ముప్పురి మధ్య మాటలని భాషలో అనుసంధానం చేసేది. ఇక చేయడానికి ఏముంది. జిక్రిల్ అనే చివరి భాష ఒకే ఒక చివరి మనిషిది అయిపోయింది!

అయితే అదృష్టవశాత్తూ అదే ఊరిలో జిక్రిల్ తెలిసిన 'ఎవరిస్టో' అనే మనిషి ఉన్నాడు, ఇతను ఇసారోకి చిన్ననాటి స్నేహితుడు. ఇద్దరూ రెండు శరీరాలు, ఒకే ప్రాణం. ఇదంతా గతం. గత ఏభై సంవత్సరాలుగా ఇద్దరి మధ్య మాటలు లేవు. ఇసారో పేరు ఎత్తితే ఎవరిస్టో ఆగ్రహంతో ఊగిపోతాడు. ఇద్దరూ కలవడం అసాధ్యం. ఎప్పటికీ కుదరని పని. ప్రాణానికి ప్రాణం అయిన ఇద్దరు స్నేహితుల మధ్య అంత అగాధం వచ్చిది ఎందుకు? ఇద్దరు వృద్ధులు, ఒక గ్రామం, ఒక యువకుడు, ఒక భాష.... రెండు ప్రేమ కథలు. దశాబ్దాలుగా నిశ్శబ్దం. సమాధానం లేని ప్రశ్నగా ఒక గతం. ఏభై సంవత్సరాల వెనుక కథ ఏమిటి? ఇప్పుడు మార్టిన్ ఏకైక లక్ష్యం, ఇద్దరు వృద్ధుల మధ్యనున్న ఆ దీర్ఘకాలిక ద్వేషం ఎందుకో తెల్సుకొని దానిని తొలగించి జిక్రిల్‌కి ప్రాణం పోయడం. కాని కుదురుతుందా? అసలు ఎంతో కొంత జనాభా మధ్యఉన్న ఆ ఊరి జనం, ఆ జకరీయుల వారసులు ఎందుకని జిక్రిల్ నేర్చుకోలేదు. ఎందుకు నేర్చుకోవాలి? వాళ్ళు మనలాగే ఇంగ్లీష్ పాండిత్యం సాధించి ఆ అడవి మధ్యనుంచి, తమ గుడిసెల నడుమ నుండి పారిపోయి అమెరికాకు పోవాలి. మనుష్యులు అనేవారు అమెరికాలోనే ఉండాలి. అనాగరికులు మాత్రమే అడవిలో ఉండాలి. మానవజాతినంతా కలిపే ఏకైక భావన డాలర్. డాలరే పరమ సత్యం....

భాష, సంస్కృతి అపురూపమైనవి. వాటిని కాపాడుకోడానికి ఒక యువ భాషావేత్త తపనకు ప్రతిరూపం అయిన ఈ సినిమా కథ ఆలోచించదగినది. సినిమా ఆద్యంతం దృశ్యమానంగా, పచ్చగా ఉంది. జరుగుతున్న సాంస్కృతిక విధ్వంసం గురించి ఆలోచన పెంచడానికి కాసింత వేదన, మథన మనలో నింపుతుంది. కానీ రోజుకో ఆలోచన చేసే మన అకశేరుకాల(వెన్నులేని ప్రాణుల) బ్రతుకుల్లో, బుర్రల్లో ఏదీ నాలుగు రోజులు నిలవనట్లే, ఈ సినిమాలు, సాహిత్యాలు, పోరాటాలు, జీవితాలు, వేదనలు. కాలం వెళ్లబుచ్చుకోడానికే. అసలు నిజానికి అంతరించి పోయింది, పోతున్నవి భాషలు కావు. మనిషి జాతే! మనిషి తనమే! దీన్ని కాపాడుకోవలసినది, నిలుపుకోవలసినది అనే తెలివిడితనమే. అయినప్పటికీ ఇంత గందరగోళం, గమ్యం లేని వేగం మధ్య కూడా, ప్రపంచం మూలమూలన ఎవరో ఒకరు కోటి మంది పెట్టులా ఒక్కడే కదులుతుంటాడు. అవసరమయినదాన్ని కాపాడుకోడానికి. గొప్ప ఆశ అనే రెండు చేతుల మధ్య దాన్ని కాపాడుతూ మరిన్ని చేతులకు అందించడానికి. అదే ఈ సినిమా. వీలయితే సినిమా చూడండి.

ఇది మెక్సికన్ సినిమా Sueño en otro idioma అనేది అసలు పేరు. I Dream in Another Language(2017) పేరుతో ఇంగ్లీషులో దొరుకుతుంది. దీనికి ఎర్నెస్టో కాంట్రేరాస్ దర్శకత్వం వహించారు. స్పానిష్, ఆంగ్ల భాషలలో ఉంది.

– అన్వర్

## గ్రంథాలయం

**వలసల రాయలసీమలో మహిళా చైతన్యం** (చరిత్ర)



రచయిత:డా. షేక్‌మహబూబ్‌బాషా
పుటలు:88,వెల: రు.100/-
ప్రతులకు: వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్.హైదరాబాద్-29
ఫోన్: 7330795849



**నిర్వచన శిల్పకళా విజయము** (సంగ్రహ చరిత్ర)
రచయిత: మన్నె రాములు,
పరిష్కర్త: డా॥ కపిలవాయి లింగమూర్తి
పుటలు: 22, వెల :50/-
ప్రతులకు : యం.డి. జహంగీర్
ఇం.నెం. 11-45, రాంనగర్ కాలనీ,
నాగర్‌కర్నూలు - 509 509
సెల్: 949 307 9850

**స్నేహరాగం**
నవలిక, మరికొన్ని కథలు
పుటలు: 144, వెల :200/-





**అంపశయ్య నవీన్**
సాహితీ మూర్తిమత్వం
నవీన్ సాహిత్యంపై సమగ్ర మూల్యాంకనం
పుటలు: 286, వెల :300/-

రచన: అంపశయ్య నవీన్ ; ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్
ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, హైదరాబాద్ ఫోన్040-24652387

### చదువరులకు సూచన

జనవరి 2022 సంచికలో 'అక్షరాభ్యాసం - కొత్త పద్ధతి' అనే పేరుతో ఒక వ్యాసాన్ని ఇచ్చాము. దానికి కొనసాగింపుగా ఇంకా కొన్ని వ్యాసాలను కూడా క్రమంగా ఇవ్వవలసియున్నది. కాని, వాటిని ఒకేసారిగా ఒక పుస్తకంగా అందిస్తే బాగుండుననే సూచన వచ్చింది. సమగ్రమైన పుస్తకంగా తేవాలని రచయిత కూడా సంకల్పించారు. అందువల్ల ప్రస్తుతానికి ఈ శీర్షికన వ్యాసాలను ప్రచురించడం విరమించాము. త్వరలోనే ఈ పుస్తకం పాఠకుల ముందుకు రాగలదని ఆశిద్దాం. –సంపాదకుడు

డా. చంద్రయ్య.ఎస్
99637 09032

# ప్రపంచీకరణ యుగంలో పాలనాభాషగా తెలుగు- విమర్శనాత్మక అధ్యయనం

## (ప్రభుత్వ కార్యాలయాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా)

**సంక్షిప్తి**

ప్రపంచీకరణ యుగంలో ఆంగ్లం, తెలుగుభాషపై చూపిన ప్రభావాన్ని ఈ వ్యాసంలో రెండు స్థాయిల్లో చర్చించాను. ఒకటి- 'తెలుగు పదజాల వినియోగాన్ని కుదించడం'. రెండు-'ఆంగ్లంతో కూడిన మిశ్రమ వాక్య నిర్మాణాలను తయారుచేయడం'. ప్రపంచీకరణ, తెలుగు సంస్కృతిని పరాస్తం చేసిన విషయాన్నీ ఈ వ్యాసం చర్చించింది. ప్రపంచీకరణ ప్రభావంతో పరిపాలనారంగంలో వినియోగించే తెలుగుభాష ఆధారంగా ఈ వ్యాసం రాయబడింది.

**1 పరిశోధన వ్యాస నేపథ్యం**

ప్రపంచాన్ని ఒక కుగ్రామంగా మార్చే లక్ష్యంతో బయలుదేరిన ప్రపంచీకరణ- వివిధ దేశాల, జాతుల భాషాసంస్కృతులమీద, వాటి జీవనవిధానంమీద గణనీయమైన ప్రభావాల్ని వేసింది. అనేక భాషల, జాతుల సంపుటి అయిన భారతదేశంలోకి ప్రపంచీకరణ ప్రవేశించిన తరువాత, స్థానికంగా ఉన్న అనేక మాతృభాషలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. కొన్ని అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరాయి. ఈ నేపథ్యంలో భారతదేశ వ్యాప్తంగా ఉన్న మాతృభాషాసంస్కృతులను ప్రత్యేకించి తెలుగు భాషాసంస్కృతులను పరిరక్షించుకోవాల్సిన నేపథ్యంలో ఈ పత్రం రాసాను. దీన్ని రాయడంకోసం ఖుత్బుల్లాపూర్ 'మండలప్రజాపరిషత్తు కార్యాలయం', కూకట్‌పల్లి 'తహసీల్దార్ మరియు డిప్యూటీ కలెక్టర్' కార్యాలయాలను సందర్శించాను. ఆ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు, ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు పత్రాలు, వివిధ చట్టాలు మొదలైన అనేక రకాల నమూనా పత్రాలను సేకరించి ఈ వ్యాసాన్ని రాసాను.

"ప్రపంచీకరణ అంటే మార్కెట్ ఏకీకరణ, విశ్వవ్యాప్త మార్కెట్ సమన్వయం, విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసమో, ఏదైనా ఒక ప్రత్యేక సంస్కృతి కోసమో పెట్టుబడి ప్రపంచీకరణ నినాదాన్ని తలకెత్తుకోలేదు. తన సరుకులు ప్రపంచవ్యాప్తంగా అమ్మడానికి వీలయిన ఒకే కొనుగోలుదారు సంస్కృతిని వ్యాపింపజెయ్యడం దాని లక్ష్యం" (వేణుగోపాల్, ఎన్. 2011:79) ఈ లక్ష్యంతో భారతదేశంలోకి 1991 సరళీకరణ ఆర్థిక విధానాల పేరుతో అడుగుపెట్టి, రెండున్నర దశాబ్దాల్లోనే సకల రంగాలను ప్రభావితం చేసింది. ముఖ్యంగా ఈ వ్యాసం తెలుగు భాషాసంస్కృతులపై ప్రపంచీకరణ ప్రభావాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేస్తుంది. ప్రపంచీకరణ- మార్కెట్ ఏకీకరణగా బాహిర రూపాన్ని ప్రదర్శిస్తున్నా, తదానుషంగికమైన ఆభిజాత్య దేశాల భాష, సంస్కృతులు కూడా భారతదేశంలోకి ప్రవేశిస్తున్నాయి. స్థానిక తెలుగు భాషాసంస్కృతులను ఎందుకూ కొరగానివిగా ప్రచారంచేస్తూ, ప్రజల్లో భ్రమలను కల్పిస్తుంది. ప్రపంచీకరణ-ఆంగ్ల భాష ఒక్కటే ఉద్యోగాలను కల్పించగలదు అనే మానసిక స్థితిలోకి ప్రజల్ని దాదాపుగా నెట్టివేసింది. ధనిక దేశాల సంస్కృతే అసలైన సంస్కృతి అని ప్రకటిస్తూ, వారు వాడే భాషే నాగరిక భాష అనే విష ప్రచారానికి తెరలేపింది. భాషా ప్రపంచీకరణను, సాంస్కృతిక ప్రపంచీకరణను ఏకకాలంలో తెలుగు నేలమీద విస్తరింపచేస్తుంది.

**2. ప్రపంచీకరణ: భారతీయ భాషల మనుగడ-తెలుగు భాష**

ప్రపంచీకరణలో భాగంగా తెలుగునేల మీదికి కుప్పలుతెప్పలుగా దిగుమతి అవుతున్న విదేశీ ఉత్పత్తులు తమతోపాటు ఆ ఉత్పత్తుల వాడకానికి అనుకూలమైన భాషను, సంస్కృతిని మోసుకొస్తున్నాయి. ఆ ఉత్పత్తులతో వ్యవహారాన్ని నడపాలంటే ఆ భాషాసంస్కృతులను నేర్చుకోవాల్సిన అనివార్యతను అవి కల్పిస్తున్నాయి. ఈ వ్యవహారాల నిర్వహణకు దేశీయ భాషాసంస్కృతులు అసమర్థమైనవి అనే ముద్రను ప్రపంచీకరణవాదులు వేస్తున్నారు. తద్వారా దేశీయ భాషావ్యవహర్తలను, వారి వ్యవహారభాషలను ఎందుకూ పనికిరానివిగా చిత్రించి, మనల్ని మరలా విదేశీ భాషాదాస్యంలోకి ప్రపంచీకరణ నెట్టేస్తోంది. ప్రపంచీకరణకు ఆంగ్లం వచ్చిన వినియోగదారులు కావాలి. ఇందుకు అనుకూలమైన విద్యావిధానాన్ని మన స్థానిక ప్రభుత్వాలచేత ప్రవేశపెట్టేట్టు చేసి, అందులో ఆంగ్లానికి పెద్దపీట వేస్తున్నారు. ఈ రకంగా వివిధ అంతర్వుల్లో స్థానికభాషలను ప్రజా వినియోగానికి దూరం చేస్తూ, వాటి మనుగడను శాసించే స్థితికి చేరుకుంది భాషా ప్రపంచీకరణ. కనుక, దేశీయ భాషల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ప్రపంచీకరణవల్ల సంభవించింది. "మానవ భాషలకు సంబంధించిన ప్రస్తుత సంక్షోభం కూడా ఉత్తర దక్షిణాలు కానీ, తూర్పు పడమరలుకానీ, ప్రపంచమంతటా ప్రాథమిక ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పువల్ల ఏర్పడిందేననడంలో పొరపాటేమీ లేదు." (గణేశ్. ఎన్. దేవి. 2015: 13) కనుక, దేశీయంగా అమలుపరిచిన ఆర్థిక సంస్కరణలు ఉపరితలాంశాలైన భాషాసంస్కృతులను ఎంతో ప్రభావానికి గురిచేసాయి.

భారతదేశంలోని మిగతా దేశీయ భాషలతోపాటూ తెలుగుభాషపై కూడా ఆంగ్లభాష గణనీయమైన ప్రభావాల్ని చూపింది. ఇది అన్నిరంగాల్లోనూ దీని ప్రభావం ఎక్కువే. ప్రజలతో నిరంతరం ఉత్తరప్రత్యుత్తరాలు నెరిపే ప్రభుత్వ కార్యాలయాల్లోకీ ఈ ఆంగ్లం చొరబడింది. తెలుగుభాష అమలుకు సంబంధించి వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం "ఆంగ్లంలో వచ్చిన ఏ ఉత్తరం, ప్రతిపాదనైనా చర్యతీసుకోకుండా... తిప్పి పంపేసే అధికారం రాష్ట్రంలోని ప్రతి గెజిటెడ్ అధికారికీ ఉంది. తమకంటే పై కార్యాలయాలనుంచి ఆంగ్లంలో వచ్చిన వాటి పట్లా ఇలాగే చేయొచ్చు." (ఈనాడు దినపత్రిక. 17-

12-2012). కానీ, ఆచరణలో ఇది శూన్యమని క్షేత్రపర్యటనలో సేకరించిన సమాచార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ప్రభుత్వపాలనారంగంలో తెలుగుభాష ముఖ్యంగా రెండు రకాలుగా వ్యవహారానికి దూరమవుతోంది. అవి:2.1. పదజాల వినియోగాన్ని కుదించడం లేదా తగ్గించడం. 2.2. ఆంగ్లంతో కూడిన మిశ్రమ వాక్య నిర్మాణాలను తయారుచేయడం. వీటి విశ్లేషణ ఈ కింద చూడవచ్చు.

**2.1 తెలుగుపదజాల వినియోగాన్ని కుదించడం లేదా తగ్గించడం**

స్వేచ్ఛావాణిజ్యం పేరుతో తెలుగునేల మీదకి కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతోన్న విదేశీ సరుకులు తమతోపాటు తమ దేశభాషల్నీ మోసుకొస్తున్నాయి. తెలుగునాట ఈ అన్యభాషా పదజాలాన్ని అనువాదంచేసుకొని వాడుకునే రంగాలు అంత పటిష్ఠంగా లేకపోవడంవల్ల వాటిని విద్యావంతులు, సాధారణ ప్రజలు యథాతథంగా వాడటానికి కారణమౌతుంది. దీంతో తెలుగులోకి విదేశీయ ముఖ్యంగా–ఆంగ్ల భాషా పదజాలం ఎక్కువగా వచ్చి చేరుతుంది. ఈ పరిణామంతో ఆ వస్తూత్పత్తికి కావాల్సిన శాస్త్రసాంకేతిక విజ్ఞానమంతా, దాని వినియోగ జ్ఞానమంతా ఆంగ్లంలోనే అందుబాటులో ఉండటంతో ఆంగ్లాన్ని అనివార్యంగా వాడుకోవాల్సిన దుస్థితి ప్రపంచీకరణ మనకు కల్పించింది. ఇది ఆ వస్తువును వాడే ప్రతిరంగానికి వ్యాపించింది. ప్రజల జీవనవిధానాన్ని అత్యంత ప్రభావితంచేసే ప్రభుత్వ పాలనారంగంలోనూ ఈ రకమైన పద్ధతే ఆంగ్లభాషను వాడటంలో కనిపిస్తోంది. తాము రాసే తెలుగు వాక్యాల్లో తెలుగు పదజాలం స్థానంలో ఆంగ్ల పదజాలాన్ని వాడటంవల్ల, తెలుగు పదజాలాన్ని క్రమ క్రమంగా వినియోగంనుంచి తప్పించినవాళ్ళం అవుతున్నాం. ఉదాహరణకు ఈ కింద పేర్కొన్న మాటలు చూడండి. "సర్వీస్ చార్జ్, ఎంక్వైరీ రిపోర్ట్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ నెం., సబ్సిడి, రిజిస్టర్, నోటిఫికేషన్"

పై ఉదాహరణలన్నీ వివిధ పత్రాలలోంచి ఉటంకించినవి. వీటిని తెలుగులో వరుసగా "సేవా రుసుము, విచారణ నివేదిక, ఆహార భద్రత కార్డు సంఖ్య, రాయితీ, హాజరు పుస్తకం, ప్రకటన" అని ఇలా రాయవచ్చు. ఆంగ్ల భాషావ్యామోహంతో, ఆంగ్ల భాషాపదజాలాన్ని వాడితేనే హోదా, గౌరవం దక్కుతుందనే మానసిక అభిప్రాయం(Psychological feeling) అటు ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ అత్యంత బలీయంగా గూడుకట్టుకొని పోయింది. ప్రపంచీకరణ దృష్టిలో 'మార్కెట్ ఏకీకరణ'కు అర్థం 'భాష ఏకీకరణ' అంటే 'ఆంగ్ల భాషా ప్రపంచీకరణ' అని అర్థం చేసుకోవాల్సి వస్తోంది. భాషలకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న సమకాలీన పరిణామాలు ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

**2.2 ఆంగ్లంతో కూడిన మిశ్రమ వాక్య నిర్మాణాలను తయారుచేయడం**

ప్రపంచీకరణకు భాషాముఖమైన ఆంగ్లం, విద్యామాధ్యమరంగంలో తెలుగుభాష స్థానాన్ని పూర్తిగా కమ్మేసింది. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలూ ఇటీవల ఆంగ్ల మాధ్యమ ప్రవేశం విషయంలో తీసుకున్న ఆంగ్ల అనుకూల నిర్ణయాలు తెలుగుభాష ఉనికిని మరింత ప్రశ్నార్థకంగా మార్చేసాయి. తెలుగు పేరుతో వినియోగిస్తున్న తెలుగుభాషలో ఎంతో ఆంగ్ల పదజాలం, ఎన్నో వాక్య నిర్మాణాలు ఇప్పటికే చేరిపోయాయి. అవసరం లేకున్నా, తెలుగుభాషలో ప్రత్యామ్నాయ పదజాలం, వాక్య నిర్మాణాలున్నా ఆంగ్లాన్ని వాడటం గమనించవచ్చు.

ఉదా:

అ) "6 to 10th Study ఉన్నవారికి Residence Certificate అవసరం లేదు."

ఆ) "క్రిమినల్ కోడ్ ప్రకారము జరుపు శవ పంచనామా."

ఇ) "బావి పబ్లిక్ ప్రాపర్టియా లేక ప్రైవేట్ ప్రాపర్టియా?

ఈ) "చనిపోయిన మనిషి యొక్క వేలు ముద్రలు తీసి ఆంధ్రప్రదేశ్ ఫింగర్ ప్రింట్ బ్యూరోకి పంపబడినదా?" (గమనిక: పైన ఉటంకించిన వాక్యాల్లో ఉన్న దోషాలన్నీ యథాతథంగా ఇచ్చాను. అవి ఈ వ్యాసకర్తవి కావు)

ఈ వాక్యాలు ఖుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంవారినుంచి సేకరించిన సమాచారంలో ఉన్న అనేక వాక్యాల్లో కొన్ని మాత్రమే. పై వాక్యాల్లో తెలుగు వాక్య నిర్మాణ పద్ధతిలో ఆంగ్ల పదాలను కలిపి ఒక రకమైన మిశ్ర వాక్య నిర్మాణాలను తయారుచేసినట్టు తెలుస్తోంది. ఆంగ్ల పదజాలానికి తెలుగు ప్రత్యయాలను చేర్చి వాక్యాన్ని సాధించిన పద్ధతులను కూడా మనం పై వాక్యాల్లో గమనించవచ్చు.

ఉదా:

A) 'ఇ' అనే వాక్యంలో 'పబ్లిక్ ప్రాపర్టి' అనే నామవాచకానికి ప్రశ్నార్థక పదకల్పకావ్యయమైన '–ఆ' చేరి, యడాగమమై ప్రాపర్టియా? అనే రూపం సాధింపబడింది.

B) 'ఈ' అనే వాక్యంలో కూడా 'ఫింగర్ ప్రింట్ బ్యూరో' అనే నామవాచకానికి గమ్యార్థంలో షష్ఠీ విభక్తి ప్రత్యయమైన '–కి' చేరి వాక్యం సాధింపబడింది.

C) 'అ, ఆ' వాక్య నిర్మాణాలు కూడా తెలుగు వాక్య నిర్మాణ స్థాన సంబంధాలను అనుసరించి చేరిపోయినవే. ఈ రెండు స్థాయిలు ఒక ఎత్తైతే పూర్తిగా ఆంగ్లంలోనే పరిపాలనా రంగం తమ వ్యవహారాలను నడుపుకోవడం తెలుగు భాషా విషయమై ప్రపంచీకరణలో భాగంగా ఏర్పడిన అతిపెద్ద అఘాతం. ఇలా ఆంగ్లభాష అనేక స్థాయిల్లోని తెలుగు భాషలో చేరిపోయి, తెలుగు భాషను ఎంతో ప్రభావానికి గురిచేస్తున్నది.

**ముగింపు**

ఈ సమస్యకు పరిష్కారం రెండు స్థాయిల్లో సమాంతరంగా చేయాల్సి ఉంటుంది. ఒకటి, భాషా పరంగా, రెండు, సామాజిక ఉద్యమాల పరంగా. భాషాపరంగా– ప్రపంచీకరణలోభాగంగా తోసుకొస్తున్న వస్తువులకు దేశీయ పేర్లను పుట్టించడం లేదా ఉన్న పదాలనే కొత్త అర్థంలో వాడుకోవడం చేయాలి. దీనినే 'నూతన పదకల్పన' అని అంటున్నాం. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొద్దిమంది కలిసి చేస్తూ, వీటిని వాడకంలో వినియోగదారుల సౌకర్యానికి సంబంధించిన అభిప్రాయాలను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో తెప్పించుకునే ప్రణాళిక అవసరం. అవసరమైతే మరో కొత్త పదాన్ని సృష్టిచేసే ఓపిక, శ్రద్ధ నియమిత భాషావేత్తలకు ఉండాలి.

రెండు, సామాజిక ఉద్యమాల పరంగా–భాషాసంస్కృతులు రెండూ అవిభాజ్య సంబంధులు. సంస్కృతి– భాష రూపంలోనే వ్యక్తమౌతుంటుంది. భాష– సంస్కృతీ వ్యక్తీకరణకు ఒక ధ్వన్యుపకరణంగా పనిచేస్తుంటుంది. కనుక, ప్రపంచీకరణయుగంలో

## తప్పిపోయిన అదృష్టం!

**నాకు** పదేళ్ల వయసులో ఒకసారి రాజమండ్రి నుంచి మా మామయ్యగారు మా బోడపాడు వచ్చారు. ఆయన జమీందారు. మా వూళ్లో ఆయనకున్న పొలాల ఆలనాపాలనా మా నాన్నగారు చూసేవారు.

ఇంటికెవరొచ్చినా నేను వేసిన బొమ్మలు గొప్పగా చూపించేవాడిని. అలాగే ఆయనకు చూపిస్తే ముచ్చటపడి భుజం తట్టారు. అప్పటికే నేను మా బంధువుల్లో ఆర్టిస్టుగా పాపులర్(!) మరి.




ఎడమ నుండి కుడికి: ప్రముఖ కార్టూనిస్టులు పి.రవికిషోర్, సరసి, బి.వి.సత్యమూర్తి, బుజ్జాయి

"మీవాడిని మెడ్రాసులో బుజ్జాయి దగ్గర పెడదామమ్మా. పైకొస్తాడు. కృష్ణశాస్త్రి నాకు బాగా తెలుసు. వాళ్ల కొడుకేగదా బుజ్జాయి!" అన్నారు మా మామయ్య, భోజనం చేస్తూ మాటల సందర్భంలో. ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు గానీ నేను తీసుకొని, తర్వాత మా నాన్నగారి వెంటపడి మదరాసు వెళతానని పట్టుబట్టేను.

"చాల్లే! సినిమా వాళ్లతో చేరితే లేనిపోని అలవాట్లొచ్చి పాడైపోతావు!" అంది మా అమ్మ.

బుజ్జాయిగారు 20॥వ సం.లో హైదరాబాదు వచ్చినపుడు కొద్ది మంది మిత్రులకు ఆయన్ని కలిసే అవకాశం వచ్చింది. నేను ఆయన పక్కన కూర్చొని నా కార్టూన్లు చూపిస్తూ నాచిన్ననాటి సంఘటన చెప్పాను. "సినిమా వాళ్లతో చేరితే పాడైపోతానో లేదో గానీ మీ వద్ద శిష్యరికం చేసే గొప్ప అదృష్టం పోగొట్టుకున్నాను సార్" అన్నాను బుజ్జాయి గారితో.

ఆయన ఫక్కున నవ్వి "బాపు శిష్యరికం లభించిందిగా, అంతకన్న ఏం కావాలి?" అంటూ నా చెయ్యి నొక్కేరు.

తెలుగులో కామిక్ చిత్రకళకు ఆద్యులై, తనకంటూ ఒక శైలిని ఏర్పరచుకొని ప్రసిద్ధులైన శ్రీ బుజ్జాయి ఇటీవల మనకందరకూ భౌతికంగా దూరమయ్యారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిద్దాం.

– సరసి

దేశీయ భాషలు నిరాదరణకు గురవుతున్నాయని మాట్లాడుతున్నామంటే తదాధారిత సంస్కృతులు కూడా నిరాదరింపబడుతున్నాయని అర్థం. తెలుగు సంస్కృతిలోకి మార్కెట్ ప్రవేశపెట్టాలనుకున్న సంస్కృతి ఆక్రమించటం మొదలై దాదాపు రెండున్నర దశాబ్దాలవుతోంది. ఈ కాలంలో తెలుగు ప్రజల ఆలోచన విధానంలోనూ, ఆహారపు అలవాట్లలోనూ, దుస్తువులు ధరించడంలోనూ, వస్తువుల వాడకంలోనూ ఎన్నో విప్లవాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జాతి జీవనవిధాన సరళే ఆ జాతి సంస్కృతి– అనే స్థూల అవగాహనలోంచి చూసినపుడు, తెలుగు ప్రజల జీవన విధాన సరళిలో వచ్చిన ఈ పరిణామాలన్నీ వారి సంస్కృతిలో వచ్చిన మార్పులుగా పరిగణించవచ్చు.

ఈ రెండున్నర దశాబ్దాల్లో తెలుగు సంస్కృతిలో వచ్చిన మార్పులను స్థూలంగా ఈ కింది విధంగా క్రోడీకరించుకోవచ్చు. వస్తు వినిమయ సంస్కృతికి అలవాటుపడటం. తెలుగు వారసత్వ సంపద అయిన మానవ విలువలను– త్యజించటం. వందల ఏళ్ళుగా జీవన భృతిని కల్పిస్తున్న కులవృత్తులు విధ్వంసం కావడం. ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం విధ్వంసం కావడం. విద్య, వైద్యం మొదలైన రంగాలు కార్పోరేటీకరింపబడటం. వేళ ఏళ్ళుగా కాపాడబడుతూ వస్తున్న తెలుగు భాషను వినియోగంనుంచి తప్పించటం. మరీ ముఖ్యంగా తెలుగు ప్రజల్లో సహజంగా ఉండే పోరాట లక్షణాన్ని కోల్పోయి, చైతన్య రాహిత్యంగా మారటం... మొదలైన ఎన్నో దుష్పరిణామాలు ప్రపంచీకరణ ప్రభావంతో సంభవించాయి.

ఒక భాషను, ఒక సంస్కృతిని కాపాడటమంటే వాటిని మిగతా రాజకీయార్థిక రంగాల్లో జరిగే పరిణామాలకు అతీతంగా పరిగణించటం కాకుండా ఆ పరిణామాల్లో భాగంగా చూసినప్పుడు మాత్రమే సాధ్యమవుతుందనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. ఇటువంటి స్థూలదృష్టితో చూసినప్పుడు తెలుగు భాషాసంస్కృతుల పరిరక్షణలో భాగంగా ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జరిగే సామాజిక, రాజకీయార్థిక ఉద్యమాల్లోనూ భాషాశాస్త్రవేత్తలు, సాహితీసాంస్కృతికవేత్తలు ప్రత్యక్షభాగస్వాములైనప్పుడే సాధ్యపడుతుంది. ఆ వైపుగా కృషి ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ సమన్వయంతో జరగాలి. అప్పుడే మన భాషాసంస్కృతులను భావి తరాల వారికోసం భద్రపరిచినవాళ్ళం అవుతాం.

(ఈ వ్యాసరచనలో తమ విలువైన ఆలోచనలను పంచుకొన్న ఆచార్య పమ్మి పవన్‌కుమార్ గారికి, ప్రభుత్వ ఉత్తర్వులకు, కార్యాలయంలో వాడే అన్నిరకాల పత్రాలను అందించిన కూకట్‌పల్లి అప్పటి తహసీల్దార్ డా. ఏనుగు నరసింహారెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు).

అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగువిశిష్ట
అధ్యయన కేంద్రం, నెల్లూరు

టి.సతీష్
93916 14443

# తెలుగు గ్రంథసూచి

**డి**జిటల్ హ్యూమానిటీస్ అనే భావన ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన చాలాదేశాలు అందిపుచ్చుకున్నాయ్. మనదేశం దీన్ని అందిపుచ్చుకోవడంలో కొంత వెనకబడే ఉంది. వర్తమాన కాలంలో సాంకేతికతను వెంటనే అందిపుచ్చుకోకపోతే వెనుబడినట్లే లెక్క. ఇది ఏ రంగానికైనా వర్తిస్తుంది. ప్రస్తుతం తెలుగు సాహిత్యానికి సాంకేతికతని అన్వయించాల్సిన ఆవశ్యకత, ప్రణాళిక, కార్యచరణ, పరిశోధనలు, ఫలితాల నేపథ్యంలో ముందుకొచ్చిందే "తెలుగు గ్రంథసూచి" అనే ఆలోచన. ఈ వ్యాసంలో 'గ్రంథ' అనే మాటని 'రచన' అనే విస్తృతార్థంలో వాడుతున్నాను.

తెలుగు కావ్యసూచి పేరుతో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రంలో అంతర్గత యోజనలో భాగంగా ప్రాచీన తెలుగు సాహిత్యానికి సమాచారనిధి (database) రూపొందింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ సాహిత్య అకాడమీవాళ్ళు తెలంగాణ గ్రంథసూచిని రూపొందించడానికి పూనుకున్నారు. కానీ, ఇవి బహిరంగంగా ఇంకా వినియోగించుకోవడానికి అందుబాటులోకి రాలేదు. ఇతర భారతీయ భాషలైన సంస్కృతానికి పండిట్ (https://www.panditproject.org/) ప్రాజెక్ట్‌పేరుతో దేశ, విదేశాలనుండి వందమందికిపైగా స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. 2019లో ఒకబృందంగా ఏర్పడి, కన్నడభాషకు ఇలాంటి కృషి జరుగుతోంది (https://www.bookbrahma.com). ఈ నేపథ్యంలో తెలుగు గ్రంథసూచి ఆలోచనకి పదునుపెట్టాలి.

తెలుగు రచనా సర్వస్వం అనేది ఎక్కడా లేదు. తెలుగు రచయితలు, రచనల్ని ఒక చోట నిల్వచేసే పద్ధతి ఇప్పటివరకూ లేదు. ఆధునికకాలంలో రచయితలు తాము ప్రచురించిన గ్రంథాలు నిర్దిష్ట సంస్థలకు పంపాలన్న నియమమున్నా, అది అమలవ్వడంలేదు. తెలుగు సాహిత్యమంతా తెలుగు జాతి సామూహిక వారసత్వ సంపద. తెలుగు గ్రంథసూచి నేపథ్యంలో తెలుగు సాహిత్యాన్నంతా ఒక రాశిగా చూసినా, చారిత్రక, పరిశోధన సౌలభ్యాలకోసం ఎంత కాదన్నా స్థూలంగా ప్రాచీన (1850 వరకూ), ఆధునిక (1851నుండి) సాహిత్యాలుగా వింగడించాల్సి వస్తుంది. ఈ సూచి నిర్మాణంలో వైయక్తిక అభిరుచులకు తావులేదు.

ప్రాచీన సాహిత్య విషయానికొస్తే, ప్రాచీన గ్రంథాల సమాచారమంతా ఒకచోట దొరకదు. ప్రాచీన తెలుగు కవుల సంఖ్య కూడా ఇప్పటివరకూ తేలని విషయం. ఆ రచనలు, రచయితల వివరాలు తెలుసుకోవాలంటే వివిధ వ్యక్తులు రాసిన సాహిత్య చరిత్రలే ఆధారం. ఆ సాహిత్య చరిత్రలు ఆయా రచయితల అభిరుచి, దృష్టికోణం, వనరుల లభ్యత వంటి అనేక పరిమితులకు లోబడి రాసినవి. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర అంటూ ఇప్పటికీ మనం రూపొందించుకోలేదు.

తెలుగు గ్రంథసూచిని రూపొందించే క్రమంలో కేవలం సాహిత్య చరిత్రల వరకూ పరిమితమైతే తామరపల్లి తిమ్మయ్య రాసిన శేషధర్మములు అనేకావ్యం మాత్రమే మనకు తెలుస్తుంది. కానీ, అతడు హరివంశము అనే కావ్యం రాసిన విషయం గౌతమీ గ్రంథాలయంలోని తాళపత్రాన్ని చూస్తేగానీ చెప్పలేం. ఆరుద్ర పెద్దాడ నాగరాజు రాసిన శకుంతలాపరిణయము గురించి రాస్తూ దాని ముద్రణ వివరాలు చెప్పలేదు. ఆ సమాచారాన్ని పిండిప్రోలు లక్ష్మణకవి గురించి రాసే సమయంలో చెప్పాడు. ఇలా ఒక రచనకు సంబంధించిన సమాచారాన్నంతా ఒకచోటికి చేర్చాల్సిన అవసరముంది. లేకపోతే, ఆ పుస్తకం ముద్రణ అవ్వలేదని పాఠకులు పొరబడే అవకాశం ఉంది. మరో ఉదాహరణ పిడుపర్తి సోమన ప్రభులింగలీల గురించి సమాచారం ఉంది. కానీ, తంజావూరులోని సరస్వతీ మహల్ గ్రంథాలయంలో ఈయన రాసిన నిరోష్ఠ్యసీతాకల్యాణము అనే మరో రచన ఉంది. ఆయా గ్రంథాలయాల సూచీల వల్ల ఈ విషయం తెలుసుకోవచ్చు. ఈ సమాచారం కావాలంటే తంజావూరు కేటలాగును చూడాల్సిందే.

దీనికి కావాల్సిన సమాచారమంతా ఒకేచోట దొరకదు. రచనలు, కవులకు సంబంధించిన సమాచారం వివిధ సాహిత్య చరిత్రల వల్ల కష్టపడి సాధించినా, ఆ గ్రంథాల ప్రచురణ వివరాలు సంపాదించడం చాలాకష్టం. గ్రంథప్రచురణ వివరాలకు అనేక గ్రంథాలయాల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. పైగా గ్రంథాలయాల్లో కూడా దొరకని పుస్తకాల ముద్రణ వివరాల్ని భవిష్యత్తులో చేర్చుకుంటూపోవాలి. ఒక రచన గురించి మౌలిక సమాచారం వేరువేరు గ్రంథాల్లో లభిస్తోంది. ఆ సమాచారం ఒకచోట చేర్చాల్సిన అవసరం ఉంది. ఉదా. గణపనారాధ్యుఁడు స్వరశాస్త్రము అనే శాస్త్రగ్రంథం రాసిన విషయం వివిధ గ్రంథాల్లో ఉంది. 2016లో పునర్ముద్రితమైన ముంగిలి పుస్తకంలో ఇది అముద్రితం అని చెప్పారు (ముంగిలి, 136). కానీ, ఈ పుస్తకం మేడపాటి వెంకటరెడ్డి-తిరుమల రామచంద్ర పరిష్కరణతో, అర్తమూరు (తూర్పు గోదావరి, 1988)లో ముద్రించినట్లు ఇప్పగుంట సాయిబాబాగారు తన పుస్తకంగా రాసుకున్నారు. ఇప్పగుంట సాయిబాబాగారిలాంటివాళ్ళు వ్యక్తిగతంగా రాసుకున్న వివరాలూ చాలా అమూల్యమైనవి. తెలుగు అకాడమీ ముద్రించిన ప్రాచీన సాహిత్యకోశంలో లేని ప్రచురణ వివరాల్ని ఇప్పగుంటగారి ప్రతి నుండి పొందవచ్చు. అలభ్యం అని ఇతర ఆకరాల్లో ఉంటే, ఇప్పగుంట వారి పుస్తకంలో ముద్రిత వ్యాఖ్యాన వివరాలు కూడా ఉన్నాయ్. ఉదా: కవిరాక్షసుడు రాసిన సంస్కృత రచన కవిరాక్షసీయమ్, శ్రీనివాసపురం లోకనాథకవి తెలుగు వ్యాఖ్య, చెన్నపురి, 1902. తెలుగు పుస్తకాలన్నీ ఒకచోట ముద్రణ జరగలేదు. సంస్థాగతంగానే కాక, వ్యక్తిగతంగానూ చాలామంది వేరువేరు ప్రాంతాలనుండి తెలుగు ప్రాచీన సాహిత్యాన్ని గ్రంథరూపంలో ముద్రించారు. ముద్రించిన తెలుగు గ్రంథాలన్నీ ఒకచోట భద్రపరిచే పద్ధతి లేకపోవడం వల్ల పుస్తక ముద్రణ వివరాలన్నీ ఇందులో చేరలేదు. ఇప్పటికీ ముద్రించిన తెలుగు గ్రంథాలన్నీ ఒకేచోట భద్రపరిచే

లేదా సేకరించి ఒకచోటకు చేర్చే ఏర్పాట్లు ఏవీ లేవు.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన కోసం ఆంధ్రగ్రంథములపట్టి (ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, మద్రాసు D. 2898), గీర్వాణ గ్రంథములపట్టి (ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, మద్రాసు D. 2905) అనే రెండు చిన్న సూచీ పుస్తకాల్ని 1848 నాటికే తయారు చేసుకున్నాడు. ఇది వ్యక్తిగత అవసరాలకోసం తయారయ్యింది. తెలుగుభాషలో విస్తృత వాఙ్మయ సూచికి ఆద్యుడు కాశీనాథుని నాగేశ్వరరావు. ఆయన 1929లో ప్రచురించిన ఆంధ్ర వాఙ్మయసూచిక ఆ కోణంలో ముద్రించిన తొలి పుస్తకం. దీనికి ప్రేరణ మహారాష్ట్ర వాఙ్మయసూచి.

ఎస్. కుప్పుస్వామిశాస్త్రి సంకలనం చేసిన తెలుగు రాతప్రతుల అకారాదిసూచి (1932) లో రాతప్రతుల వివరాలు 'Triennial Catalogue' నెంబరుతోపాటు ఇచ్చారు. ఈ సూచి ప్రకారం మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో మూడువేలా ఎనిమిదివందలా డెబ్బై (3870) తాళపత్ర, కాగిత రాతప్రతులున్నాయ్. అందులో కొన్నింటిని తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనసంస్థకు అప్పగించారు. తిరుపతికి పోగా మద్రాసు గ్రంథాలయంలో ఉన్న రాతప్రతుల వివరాలతో మళ్ళీ ఎలాంటి సూచీ తయారు చెయ్యలేదు. ఈ గ్రంథాలయంలో ఉన్న రాతప్రతుల్ని ఆ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథం, గ్రంథకర్త వివరాలతో వేరువేరుగా కాగితాల అట్టల (Catalogue Cards)పై రాసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేటలాగే ఆధారం. కాబట్టి తిరుపతికి రాతప్రతుల్ని ఇచ్చిన తర్వాత మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న రాతప్రతుల్తో మరో కొత్తసూచీని తయారు చేయాల్సిన అవసరం ఉంది. కాకినాడలోని ఆంధ్రసాహిత్యపరిషత్తు తరపున అకారాద్యముద్రితగ్రంథసూచిక అనే పేరుతో 1920లో ఒక పుస్తకం ముద్రించారు. ఇందులో ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రంథాలయంలోని రాతప్రతుల్లో అముద్రితంగా ఉన్న గ్రంథాల వివరాలు మాత్రమే లభిస్తాయ్. ఇలాంటివే ప్రాచ్యలిఖిత భాండాగారాలు ఆ సాహిత్య సంస్థకు పరిమితమై జరిగిన కృషి చేశాయ్.

ఒకే పేరుతో వివిధ ప్రాచ్యలిఖిత గ్రంథాలయాల్లో ఉన్న ప్రతుల్ని తులనాత్మకంగా పరిశీలించి, అవి ఒకే రచనకున్న విభిన్న ప్రతులా, లేదా వేరువేరు రచయితల ప్రతులా అన్నది తేల్చాల్సిఉంది. ఇలా చెయ్యాలంటే ఆ ప్రతుల్ని నేరుగా చూసి అధ్యయనం చేసి, నిర్ణయించాల్సిందే. ఆ ప్రతుల మృదుప్రతులు (Soft copies) అందుబాటులో ఉంటే మరింత సులభంగా, వేగంగా ఆ ప్రతుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

నేను శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయానికి ఒకసారి (ఫిబ్రవరి, 2020) వెళ్ళగా అక్కడ తాళపత్ర, కాగితపు ప్రతుల వివరాలతో ఒక కేటలాగు కన్పించింది. అది ఆ సంస్థకు వచ్చే సందర్శకులకు మాత్రమే అందుబాటులో ఉంది. అది పుస్తకంగా ముద్రితం కాలేదన్నది అక్కడి సిబ్బంది ఇచ్చిన సమాచారం. దాన్ని కనీసం ఛాయాచిత్రాలు తీసుకుంటానన్నా, అప్పటి డైరెక్టర్ సురేంద్రరెడ్డి ఒప్పుకోలేదు. అందువల్ల శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థలోని రాతప్రతుల వివరాల్ని తెలుసుకోవాలంటే అక్కడికి వెళ్ళాల్సిందే.

| Sl.No. | Title | Authour | Subject | Nature | ACC No. | Remarks |
|---|---|---|---|---|---|---|
| 1578. | పంక్తిరథోపాఖ్యానము | క్రాలేటి లక్ష్మీనరసింహకవి | ఉపాఖ్యానము | కాగితము | ఆర్ 581 F | అసమగ్రము |
| 1579. | పంచతంత్రము | వెంకటనాథుడు | నీతి | తాళపత్రం | ఆర్ 847 | సమగ్రము |
| 180. | పంచతంత్రము | వెంకటనాథుడు | నీతి | తాళపత్రం | ఆర్ 930 | అసమగ్రము |
| 1581. | పంచతంత్రము | -- | నీతి | తాళపత్రం | డి 2680 | అసమగ్రము |
| 1582. | పంచతంత్రము | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | డి 2681 | సమగ్రము |
| 1583. | పంచతంత్రము | నారాయణకవి | నీతి | తాళపత్రం | డి 2682 | అసమగ్రము |
| 1584. | పంచతంత్రము | నారాయణకవి | నీతి | తాళపత్రం | డి 2683 | అసమగ్రము |
| 1585. | పంచతంత్రము | నారాయణకవి | నీతి | తాళపత్రం | డి 2679 | సమగ్రము |
| 1586. | పంచతంత్రము(భాన) | భానుకవి | నీతి | కాగితము | డి 2684 | సమగ్రము |
| 1587. | పంచతంత్రము | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | డి 2938 | అసమగ్రము |
| 1588. | పంచతంత్రము | భానుకవి | నీతి | తాళపత్రం | డి 3025 | అసమగ్రము |
| 1589. | పంచతంత్రము | -- | నీతి | తాళపత్రం | డి 3068 | సమగ్రము |
| 1590. | పంచతంత్రకథ | -- | నీతి | తాళపత్రం | ఆర్ 990 | అసమగ్రము |
| 1591. | పంచతంత్రకథ | -- | నీతి | తాళపత్రం | డి1422 | అసమగ్రము |
| 1592. | పంచతంత్రకథ | -- | నీతి | తాళపత్రం | డి 1423 | సమగ్రము |
| 1593. | పంచతంత్రకథ | వేంకటనాథకవి | నీతి | తాళపత్రం | డి 3082 | సమగ్రము |
| 1594. | పంచతంత్రి | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | ఆర్ 53 | అసమగ్రము |
| 1595. | పంచతంత్రి | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | ఆర్ 84(b) | అసమగ్రము |
| 1596. | పంచతంత్రి | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | ఆర్ 156 (b) | సమగ్రము |
| 1597. | పంచతంత్రి | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | ఆర్ 161(a) | సమగ్రము |
| 1598. | పంచతంత్రి | దూబగుంట నారాయణకవి | నీతి | తాళపత్రం | ఆర్ 283 | అసమగ్రము |
| 1599. | పంచపక్షి శాస్త్రము | దూబగుంట నారాయణకవి | ప్రశ్నశాస్త్రము | తాళపత్రం | డి 2307లో | సమగ్రము |
| 1600. | పంచపాదసీసమాలికాదశావతారము | కాశీచర్ల లక్ష్మణకవి | స్తుతి | కాగితము | ఆర్ 352 D | సమగ్రము |
| 1601. | పంచపాదసీసమాలికాదశావతారస్తవము | కాశీచర్ల లక్ష్మణకవి | స్తుతి | కాగితము | ఆర్ 352 e | సమగ్రము |

(పై ఛాయాచిత్రాన్ని నా మిత్రుడు రహస్యంగా తీసిపంపాడు.)

తెలుగు అకాడమి తెలుగు సాహిత్యకోశము (ప్రాచీన సాహిత్యము) అనే పేరుతో ఒక కోశాన్ని 1980 (2005)లో ముద్రించింది. ఈ కోశంలో 1851 వరకూ వచ్చిన తెలుగు గ్రంథాల వివరాల్ని పొందుపర్చారు. దానికోసం అప్పటివరకూ వచ్చిన సాహిత్య చరిత్రల్ని,

వివిధ సాహిత్య, సాహిత్యేతర గ్రంథాల్ని ఆకరాలుగా గ్రహించారు. ఈ సూచి తయారు చేసే క్రమంలో ప్రాచ్యలిఖిత గ్రంథాలయాల్లో ఉన్న రాతప్రతుల్ని పరిగణనలోకి తీసుకోలేదు. అందువల్ల కొంతమంది కవుల వివరాలు, మరికొంత మంది కవుల సాహిత్య చరిత్రల్లో నమోదుకాని రచనలు ఇందులో చేరలేదు. ముద్రణ వివరాలు చాలా పుస్తకాలకు లేదు. ఈ కోవలోదే 1986 (1999)లో ముద్రించిన తెలుగు సాహిత్యకోశం ఆధునిక సాహిత్యం (1851-1950) అనే కోశం.

విశ్వవిద్యాలయాల్లో వివిధ కవులపై వారి రచనల ఆధారంగా పరిశోధనాంశాలుగా తీసుకుని పరిశోధన చేసినా, తెలుగు గ్రంథసూచి రూపంలో ఎలాంటి కృషీ జరగలేదు. ఆధునిక రచయితల నేపథ్యంలో విశ్వనాథ వాఙ్మయసూచి (కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ తెలుగుశాఖ సిబ్బంది రూపకల్పన), చేరా వాఙ్మయసూచి (హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఎం.ఫిల్) వంటివి కొన్ని జరిగాయ్. ఆధునిక కాలంలో వచ్చిన వివిధ ప్రక్రియలకు చెందిన సూచులు కూడా ఏమీ విశ్వవిద్యాలయాల్లో జరగలేదు. బహుశా వీటికి ఎక్కువ సమయం, పరిశ్రమ, వివిధ ప్రాంతాలకు తిరగాల్సిరావడం వల్ల వచ్చే ఆర్థికశ్రమకు అవసరమైన సౌకర్యాలు విద్యార్థులకు లేకపోవడం వంటివి కారణాలు కావొచ్చు.

పూర్వ సూచీల్లో పేర్కొన్న వర్గీకరణలతోపాటు వర్తమాన, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ గ్రంథసూచిలో రచనపేరు, రచయిత పేరూ నామాంతరాలూ కలంపేర్లూ లింగం, ప్రక్రియ, విషయం, భాష, కాలం, ఆస్థానం, ప్రాంతం (గ్రామం, మండలం, జిల్లా), కులం, అంకితం, లభ్యఅలభ్య ముద్రిత వివరాలూ (పునర్ముద్రణలు కూడా), ప్రచురణ స్థలం, రాతప్రతి లభ్యస్థానం (ప్రాచీనమైతే తాళపత్ర గ్రంథ సంఖ్య, స్థలం), జనన – మరణ కాలాలతో పాటూ ఇతర అంశాలేవైనా ఉంటే విశేషం శీర్షికలో ప్రత్యేక వివరాలు తప్పనిసరిగా చేర్చాల్సిందే. శాసనాలూ రాతప్రతులూ కైఫియత్తులూ జానపద సాహిత్యమూ మర్చిపోకూడదు.

1900వ సంవత్సరం నుండి వచ్చిన పద్య, పద్యేతర ఆధునిక ప్రక్రియలన్నిటికీ నవలాసూచి, నాటకసూచి, విమర్శగ్రంథసూచి, సాహిత్యేతర వివిధ శాస్త్ర, శాస్త్రేతర పుస్తకాలు, వ్యాసాలకు సూచీలు తయారుచేసి, తెలుగు గ్రంథసూచి రూపొందించాల్సిన అవసరముంది. ఇలాంటికృషి పూర్వ పరిశోధనలన్నిటినీ ఉపయోగించుకుంటూనే మరింత విస్తృత ప్రయోజనం కోసం మృదుప్రతి (Soft copy) రూపంలో సిద్ధం చేయాలి.

ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్యం ప్రాచీన సాహిత్యంకంటే భిన్నం. ఎన్నో సామ్యాలూ వైవిధ్యాలూ వైరుధ్యాలూ ఉన్నాయ్. అనువాదాలూ (ఏ భాషనుండి) అనుసృజనలూ ప్రభావాలూ ప్రేరణలూ వంటి ఎన్నో కొత్త అంశాల్ని చేర్చాల్సి ఉంటుంది. రాజకీయం, ఆర్థికం, సామాజికం, బాలసాహిత్యం, అభ్యుదయం, హాస్యం, విషాదం, సైన్స్ ఫిక్షన్, బూతు, అపరాధపరిశోధనం... ఇలాంటి ఎన్నో వైవిధ్యమైన వర్గీకరణలతో వివరాల్ని ఇవ్వాల్సి ఉంటుంది.

సాంకేతికత అభివృద్ధి చెందాక రచనలు, రచయితలు, గ్రంథ ముద్రణలసంఖ్య క్రమంగా పెరుగుతోంది. అందుబాటులోని సాంకేతిక ఉపకరణాల్ని ఉపయోగించుకుని రచయితలు తమ రచనల్ని ఇటీవల ఎలక్ట్రానిక్ ప్రచురణలు (E-Publications) గా తెస్తున్నారు. మరికొంతమంది తమ రచనల్ని శ్రవణ పుస్తక (Audio Book) రూపంలోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ శ్రవణ పుస్తకాలు (E-Books) దృశ్యలోపం ఉన్నవాళ్ళకు, భాష తెలిసీ చదవడం రాని (లిపి నేర్చుకోని) మాతృభాషీయులకీ–భాషేతరులకీ, చాలా ఉపయోగకరం. పుస్తకం చదవడానికి అనువుగా లేనిచోట పుస్తకం వినడానికి ఈ శ్రవణ పుస్తకాలు పనికొస్తాయ్. ఇలాంటి వాటినికూడా ఈ సూచిలో చేర్చుకోవాలి.

ఈ పరిశోధన గ్రంథసూచితో ఆగిపోతే ప్రయోజనం పరిమితం. ఈ గ్రంథసూచికి సంబంధించినవరకూ ప్రాథమిక పరిశోధన ఇక్కడితో పూర్తవుతుంది. దీని తర్వాతే అసలు పరిశ్రమ మరింత గట్టిగా చేయాల్సి వస్తుంది.

ఆ సూచులలోని రచనల వివరాలకు ఆ రచనల మృదుప్రతుల్ని (Soft copies) జత చేసుకుంటూ వెళ్ళాలి. ఎవరికి ఏ రచన కావాలంటే ఆ రచనని అక్కడే చదువుకునేలా, దిగుమతి (Download) చేసుకుని వాడుకునేలా ఉండాలి. ఇలాంటి దానికి కథానిలయం వెబ్ సైటుని నమూనా (Model)గా తీసుకుని రూపొందించాలి.

ఈ కథానిలయం వెబ్సైటులోని కథలు, రచయితలపై వచ్చిన విమర్శక రచనల్ని ఆయా రచనలు, రచయితల దగ్గర అనుసంధానం (Tag) చేయాల్సినపని మిగిలే ఉంది. ఇలా తెలుగులో వచ్చిన అన్ని ప్రక్రియ, ధోరణులు, భావజాలాలకే కాక ఏ రచనలకైనా చేయవచ్చు. ఏ ప్రక్రియ, భావజాల, కాల రచనలు కావాలంటే వాటినే ఎంపికచేసి, చదువుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రాచీన కావ్య విషయంలో ఒక ఉదాహరణ చూద్దాం.

**ఉదా: క్రీడాభిరామం**

ఈ క్రీడాభిరామం కావ్యాన్ని వల్లభరాయుడు రాశాడు. తెలుగులో ఈ కావ్యాన్ని వేరువేరు వ్యక్తుల పరిష్కరణలో, వేరువేరు

| గుర్తింపు సంఖ్య | పేరు | ప్రక్రియ | రచయిత | పత్రిక | పత్రిక అవధి | ప్రచురణ తేదీ | సంపుటి | PDF | శ్రవణం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 42015 | అద్దం తిరిగిన చరిత్ర మూలం | కథ | కాళీపట్నం రామారావు | ఆనందవాణి | వారం | 1945-03-25 | కాళీపట్నం రామారావు రచనలు | | |
| 25274 | అదృశ్యం | కథ | కాళీపట్నం రామారావు | రూపవాణి | వార్షిక | 1945-10-01 | కాళీపట్నం రామారావు రచనలు | | |

సంస్థలు ముద్రించాయ్. వాటి వివరాలను ఇక్కడ ఇస్తున్నాను.

1. మానవల్లి రామకృష్ణకవి పరిష్కరణ, వనపర్తి, 1909.

2. వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కరణ, చెన్నపురి, 1928, 1952, 1960.

3. బండారు తమ్మయ్య పరిష్కరణ, 1954, 1960.

4. బి.వి. సింగరాచార్య, ఎమెస్కో, హైదరాబాదు, 1972.

5. బి.ఎన్. శాస్త్రి పీఠిక, హైదరాబాదు, 1977.

6. యార్లగడ్డ బాలగంగాధరరావు వచనం, నిర్మలా పబ్లికేషన్సు, విజయవాడ, 2008.

పై పుస్తకాల్లో ఎవరికి కావాల్సిన పుస్తకాన్ని వాళ్ళు ఎంపిక చేసుకుంటే, ఆ పుస్తకం పూర్తిగా అక్కడే చదువుకోవడానికి లేదా దిగుమతి (Download) చేసుకోవడానికి అవకాశం ఉండాలి.

ఒక కవి లేదా రచన గురించి పాత పత్రికల్లో అచ్చైన వ్యాసాలు, వక్తిగతంగా రాసిన ఇతరత్రా సమాచారాన్ని ఈ సూచిలోని కవి లేదా రచనతో అనుసంధానించాలి. వీటికి సాంకేతి పరిజ్ఞానాన్ని సహాయంగా తీసుకోవాలి. ఉదా. క్రీడాభిరామం గురించి భారతి, ఆంధ్రసాహిత్య పరిషత్ మొదలైన పత్రికల్లో రాసిన వ్యాసాలు క్రీడాభిరామం రచన దగ్గర చదువుకునేలా ఉండాలి. నన్నయమీద వచ్చిన వ్యాసాల్ని నన్నయభారతి పేరుతో ఒక పుస్తకం తీసుకొచ్చారు. ఆ పుస్తకంలో చేరని వ్యాసాలు అనేకం పాత తెలుగు పత్రికల్లో ఉండిపోయాయ్. అలాంటివన్నీ ఈ సూచిలో చేరిపోతాయ్.

తెలుగు భాషా, సాహిత్యాలకు తెలుగు పత్రికలు చేసిన సేవ అపారం. ఆ పత్రికలన్నిటికీ సూచీలని తయారు చెయ్యాలి. నేలనూతల కృష్ణమూర్తి వ్యాససూచిలాంటి పుస్తకాలు ఎంతో శ్రమతో వచ్చినా ఇప్పటి అవసరాలకు అనుగుణంగా, మరింత విస్తృతంగా అందులోని అన్ని రచనలూ అనేక వర్గాలుగా వింగడించుకుని, వాటికి సంబంధించిన వర్గాలతో (Category) అనుసంధానం (Tag) చేయాలి. అప్పుడు ఒక ప్రత్యేక రచన, రచయిత, ప్రాంతం, కాలం మొదలైన ఐచ్ఛికాల్లో పాఠకులు/శ్రోతలు వాళ్ళకు కావాల్సినవి ఎంచుకోవచ్చు. గణితం, ఆర్థికం, రాజకీయం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం వంటి శాస్త్ర జ్ఞానరంగాల్లో తెలుగులో ఇప్పటి వరకూ జరిగినకృషిని భావితరాలకు అందించాలి. జ్ఞానం దాచుకున్న స్థాయినుండి, జ్ఞానప్రసార స్థాయికి చేరుకోవాలి. తెలుగు సర్వస్వం కళ్ళముందు అందుబాటులో ఉంచాలి. ఇక్కడ తెలుగు సర్వస్వమంటే తెలుగులో వచ్చిన ప్రతీరచనా అనే అర్థంలో వాడుతున్నాను.

ఇది చిన్న విషయమేమీకాదు. నిజాయితీ, నిబద్ధతలతో విస్తృత సాహిత్య, సామాజిక ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక, అంగబలాల్ని సమర్థవంతంగా వాడుకోవాలి. ఔత్సాహిక వ్యక్తులు మాత్రమే చేసేదికాదు. రచయితలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఇతోధికంగా సాయంచేయాలి. ప్రభుత్వం తమ బాధ్యతగా దీనికి అవసరమైన నిధుల్ని, సమన్వయ వ్యవస్థని ఏర్పాటు చెయ్యాలి. ఒకవేళ ప్రభుత్వం నిధులు, మానవ వనరులు కూర్చలేనిపక్షంలో ఔత్సాహిక తెలుగు భాషాభిమానులు చేసేకృషికి అడ్డంకులు సృష్టించని అవసరమైన అనుమతుల్ని ఇవ్వగల్గాలి.

సాంకేతికతను ఉపయోగించి రూపొందించే గ్రంథసూచిని అంతర్జాలంలో అందుబాటులోకి తీసుకొస్తే, ఎప్పటికప్పుడు నవీకరించుకునే వెసులుబాటు ఉంటుంది.

ఇలా తెలుగు రచనలన్నీ ఒకే చోట, ఒక్కసారిగా ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏది కావాలంటే అది దొరికేచోటంటూ ఉండాలి. అది విశ్వవ్యాప్తం కావాలి. అప్పుడు కదా తెలుగుభాష విభిన్న కోణాల చరిత్ర బయటపడేది. దాని ఆధారంగా తెలుగు భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా ఎవరెంతకృషి ఎలా చేసుకోవాలో సేకరణలూ అధ్యయనాలూ పరిశోధనలూ సూత్రీకరణలూ కార్యచరణలూ వగైరా వగైరా. చేవగల తెలుగువాళ్ళకు చేతినిండాపని. తెలుగు సర్వస్వానికి బృహత్ప్రణాళిక ఇదిగో అందుకోండి. కార్యశీలురు, కార్యశూరులకు స్వాగతం.

రచయిత సీనియర్ ఫెలో,
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

పద్యం

## సీతాకోకచిలుకలు...!

చుక్కలునింగినుండిదిగి : చూడగముచ్చట ముద్దుమీరగన్,
రెక్కలమీదనద్దకపు : రేఖలరంగులుకంటికింపుగన్,
చిక్కనిపూరసంబులను : చిత్తముమీరగపీల్చుచుండగన్,
చక్కగమానసంబులును : సంబరమౌనులెమానసంబులన్!

ఎవ్వదురంగులద్దెభువి : నెవ్వదుపెక్కగువన్నెచిన్నెలున్,
యెవ్వదురమ్యరూపముల : యెన్నగజేసెనుచిత్రపర్ణులన్,
ఇవ్విధిమానవాళియును : ఈతరివర్ణమయంబుజేతురే?!
ఎవ్వనిపుణ్యఫలంబుమహి : నెంతమనోజ్ఞపురూపసంపదల్!

మీకునుమీరెసాటిబహు : మీసరియందములేరుజూడగన్,
సోకులుకంటికింపుగను : సొంపులవంపులసోయగంబులున్,
చేకొనిబాలబాలికలు : చేతనమీరగనాటలాడుచున్,
కేకలువేయుచుండగను : కెవ్వునహాసములొల్కుచుందురే!

రంగులలోకమందుబహు : రంజిత రూపసిచిత్రపర్ణియున్,
చెంగునపూలపైనిలచి : చెల్మినిబంచియుహొయినొందు,యా
భంగినవీక్షకుల్ పరమ : భావనపావనపొందు రీతులున్,
పొంగులువారమానసము : ప్రోత్సహమందునుహొయినొందగన్!

ఎంతటిమంజులంబును,మ : రెంతటిసుందరపక్ష భాగముల్,
యెంతటివర్ణబంధురము : లెన్నగనలేఖ్యచిత్రపర్ణులున్,
ఎంతగజిల్గులీనుచును : నెవ్విధివెల్గులనందచందముల్,
వింతలలోకముల్ కన,ని : వేదితమోదముమానవాళికిన్!

డా. గన్నోజుశ్రీనివాసాచారి
8555899493,

చర్చావ్యాసం

రంగనాయకమ్మ

# పిల్లలకు ఎక్కాలు నేర్పడం ఎలా?

**ఇది**, లెక్కల టీచర్ల కోసం! ఇంకా 1,2 ఎక్కాల దశ లోనే వున్న 'చిన్న పిల్లల కోసం' కాదు. కొంచెం పై తరగతుల పిల్లలు, దీన్ని స్వయంగా చదవగలిగితే, దీన్ని స్వయంగానే తెలుసుకోగలిగితే, వాళ్ళు కూడా చిన్న పిల్లలకు చెప్పగలుగుతారు. లేకపోతే, పెద్ద పిల్లలకైనా, టీచర్లే ఆధారం. టీచర్లే నేర్పాలి.

'ఎక్కాలు' నేర్పడం, ఒక 'తర్క విధానంతో' జరగాల్నా లేకపోతే, ఎలా పడితే అలా నేర్పాలని చూసినా ఫర్వాలేదా? తర్క విధానంతో నేర్పేది, మొదటి పద్ధతి.

ఏ విషయం నేర్పడానికైనా, 'ఎలా నేర్పినా ఫర్వాలేదు' – అని ఎవ్వరైనా అంటారా? – ఎవ్వరూ అనరు. అలా ఎవ్వరూ అనరు గానీ, 'ఎక్కాల'ను నేర్పే విషయంలో అయితే, నేర్పేవారు, చాలా కాలం నించీ ఒక విచిత్రమైన పద్ధతిలో నేర్పుతున్నారు! దీన్ని, 'రెండో పద్ధతి' అంటున్నాను నేను.

'నేర్పడం' లోనూ, నేర్చుకోవడం' లోనూ, తెలికైన పద్ధతీ వుంటుంది, తేలిక కాని పద్ధతీ వుంటుంది. మొదటి పద్ధతినీ, రెండో పద్ధతినీ కూడా, వరసగా చూస్తేనే వాటిలో తేడాలేమిటో తెలుస్తాయి.

## పిల్లలకి ఎక్కాల్ని నేర్పే మొదటి పద్ధతి:

1టో ఎక్కంతో మొదలు పెడదాం. స్కూల్లో వుండే బ్లాక్ బోర్డు మీద, టీచరు, మొట్ట మొదట 1ని గియ్యాలి. పిల్లలందర్నీ బోర్డు వేపే చూస్తూ వుండమనాలి. "ఈ గీతని 'ఒకటి' అంటాము" అని చెప్పి, పిల్లలతో, "ఒకటి, ఒకటి" అనిపించాలి. "దీన్ని 'అంకె' అనాలి" అని చెప్పాలి. పిల్లలందర్నీ ఒక వేలు ఎత్తి, ఒకటిని చూపించేలా చెప్పాలి. బోర్డు మీద వున్న 1ని చూపిస్తూ, మళ్ళీ మళ్ళీ "ఇది ఏమిటి?" అని, పిల్లల్లో ఒక్కొక్కర్నీ అడగాలి. "ఈ గీతని, 'ఒకటి' అనాలి. దీన్ని రాయాలంటే, 1 గీతని గియ్యాలి" అని మళ్ళీ మళ్ళీ చెప్పాలి. పిల్లలు ఇంకా అంకెల్ని చూడని వాళ్ళే – అని అర్థం.

"ఇప్పుడు ఇంకోటి చూడండ్రా!" అంటూ, "ఈ 1 కి, ఇంకో 1 ని కలిపితే, అప్పుడు ఇది ఎంత అవుతుంది?" అని ఒక పిల్లనో, పిల్లాణ్ణో అడగాలి. పిల్లలు చెప్పలేరు.

టీచరు మొదట, 'ఒక గోళీ'నో, 'ఒక గింజ'నో, 'ఒక గచ్చకాయ'నో, బల్ల మీద పెట్టి, "ఈ ఒక్క గోళీ దగ్గిర, ఇంకో గోళీని పెట్టాను. ఇవి ఎన్ని అవుతాయి?" అని మళ్ళీ ప్రశ్న.

"రెండు అవుతాయి" అని పిల్లలు చెప్పగలగాలి. వెంటనే చెప్పలేరు. చెప్పలేకపోతే, దాన్ని టీచరు, 2 వేళ్ళతో చూపించి, బోర్డు మీద 1,1 అని గీసి, "ఈ గీతలు రెండూ కలిసి, 2 అవుతుంది" అని, ఆ చిన్న పిల్లలకు తెలిసేలా, బోర్డు మీద 2 అంకెని గీసి, ఆ అంకెనే బోర్డు మీద మళ్ళీ మళ్ళీ గీసి, 'రెండు, రెండు' అని పిల్లలందరితోటీ అనిపించాలి. పిల్లలు 'రొండు, రొండు' అంటే, "అలా కాదర్రా. 'రెండు' అనాలి" అని చెపుతూ, 'ఇది ఇంకో అంకె. రెండు అంకె, రెండు అంకె' అని కూడా పిల్లలతో అనిపించాలి.

ఈ 2 అంకెని చూపిస్తూ, "ఈ 2లో, 1 టే, 2 సార్లు వుందర్రా! 1, 1, కలిశాయి" – అని, దాన్ని 1 + 1 గా వెయ్యాలి. 'ప్లస్' గుర్తుని మళ్ళీ మళ్ళీ గీసి, 'ప్లస్, ప్లస్' అనీ, "రెండిటినీ కలపాలంటే, ఈ + గుర్తుని పెడతాం" అనీ, చెప్పాలి. "1 + 1, కలవడం అంటే, దీన్ని 'కూడిక లెక్క' అనాలి"– అని, పిల్లలు, ఆ మాటని కూడా మళ్ళీ మళ్ళీ పలికేలా చెయ్యాలి. వాళ్ళు బోర్డు మీద, 1 నీ, 2 నీ, గీసేలా చెయ్యాలి. కొన్ని సార్లు ప్రయత్నిస్తే, ఆ అంకెల్ని రాయగలరు పిల్లలు.

ఇక్కడ, పిల్లలతో కూడా ఉదాహరణగా, 1 పిల్లని దూరంగా నించో పెట్టి, 'అది ఒక్క పిల్లే' అని చెప్పి, దాని దగ్గిరికి ఇంకో పిల్లని చేర్చి, ఇప్పుడు 'ఇద్దరు పిల్లలు' అని చెప్పాలి. మళ్ళీ మళ్ళీ ఇలా వివరిస్తూ పోవాలి.

1 + 1 = 2 లో, ప్లస్ మాటతో పాటే, 'ఈజీక్వల్టు' (ఈజ్ ఈక్వల్ టు) ని కూడా, అంటారని, మళ్ళీ మళ్ళీ రాసి, చూపించాలి.

ఇప్పటి దాకా, 1టో ఎక్కంలో, 1 అంకెనీ, 1 + 1 = 2గా వున్న ఇంకో అంకెనీ – ఇలా చూశాం.

'ఏ ఎక్కానికి అయినా, చదివే విధానమూ, రాసే విధానమూ, వుంటాయి. 1టో ఎక్కానికి, అవి ఎలా వుంటాయో ఇప్పుడు చూద్దాం" అని చెప్పి, 1టో ఎక్కాన్ని రాసే 'పట్టిక'ని బోర్డు మీద రాస్తూ, ప్రతీ లైనునీ వివరిస్తూ రాయాలి.

**మొదటి పద్ధతిలో,**

**1వ ఎక్కానికి, రాసే విధానమూ, చదివే విధానమూ, ఇవీ:**

| ఎక్కంలో నిలువు లైన్లలో మొదటి వరస 1 | ఎక్కం, ఏ నెంబరుదో దాన్ని చెప్పే వరస 2 | ప్రతీ వరసకీ వచ్చే జవాబుని చెప్పే వరస 3 |
|---|---|---|
| ఒక్క 1 | ఒకటి 1 | ఒకటి ( ఇక్కడ 1టే వుంటుంది.) |
| రెండు 2 | ఒకట్లు 1 + 1 | రెండు ( 2ఎలా అయింది? 1కి 1 కలిసి.) |

| | | |
|---|---|---|
| మూడు<br>3 | ఒకట్లు<br>1,1,1 | మూడు (3ఎలా అయింది?పైన వున్న 2కి, 1 కలిసి.) |
| నాలుగు<br>4 | ఒకట్లు<br>1,1,1,1<br>వున్న 3కి, 1 కలిసి) | నాలుగు (ఇక్కడ 4 ఎలా అయింది? పైన |
| ఐదు<br>5 | ఒకట్లు<br>1,1,1.. | ఐదు( 5 ఎలా వచ్చింది? పైన వున్న 4కి, 1 కలిసి 5) |

ఈ పట్టికని చూసి పిల్లలు, 'ఇది 1టో ఎక్కం పట్టిక' అని తెలుసుకునేలా టీచరు చేయాలి, తన ప్రశ్నలతో.

ఈ పట్టికలో, నిలువు వరసలు (లైన్లు) 3 అనీ, అడ్డం వరసలు 5 అనీ, పిల్లలు ఆ లైన్లని చూసి చెప్పగలగాలి. 3 నిలువు లైన్లలో, ఏ లైను ఎందుకు వుందో, పిల్లలకు తెలిసి వుండి, టీచరు అడిగితే, వాళ్ళు చెప్పాలి.

అడ్డం వరసల్లో, 'ఒక్క ఒకటి ఒకటి' అని వున్న వరస, ఈ 1టో ఎక్కంలో, మొదటి అడ్డం వరస. 2డో అడ్డం వరసలో, '2 ఒకట్లు', 1 + 1 అనేవి కలుస్తాయి. ఇది, 1టో ఎక్కం కాబట్టి, ప్రతీ అడ్డం లైనులోనూ, పైన వున్న జవాబుకి 1 కలుస్తూ కొత్త జవాబు ఏర్పడుతూ వుంటుంది.

ఇలాగ, 3డో అడ్డం వరసలో, 2 + 1 = 3 అవుతుంది.

4గో అడ్డం వరసలో, 3 + 1 = 4 అవుతుంది.

5దో అడ్డం వరసలో, 4 + 1 = 'ఐదు అవుతుంది' – ఈ అడ్డం వరసలు, పిల్లలకి తెలిసే విధంగా, ప్రశ్నలతో అడిగితే, పిల్లలు జవాబులు చెప్ప గలగాలి.

ఎక్కంలో వున్న అడ్డం వరసల్ని చూశాం. ఇప్పుడు, ఎక్కంలోనే వున్న 3 నిలువు వరసల్ని చూద్దాం: నిలువు వరసల్లో, 2డో వరసనే మొదట చూస్తున్నాం. ఇది, ఏమిటి? ఈ నిలువు వరసలో, ఏ ఎక్కం వుందో, ఈ 2వ వరస చెపుతుంది. ఇప్పుడు ఈ 2డో వరసలో, 'ఒకట్లు, ఒకట్లు' అని వుంది. కాబట్టి, ఇది 1టో ఎక్కం!

ఎక్కంలో వున్న 3 నిలువు వరసల్లో, మొట్ట మొదటి వరస, దేని కోసం? ఈ మొదటి వరస, దేనిని చెపుతుంది? ఈ ఎక్కంలో, అడ్డం వరసలు ఎన్ని వున్నాయో, వాటిని, ఈ మొదటి నిలువు వరస చెపుతుంది. ఈ పట్టికలో మనం, 5 అడ్డంవరసల వరకే చూశాం.

నిలువు వరసల్లో, చివరి వరస, దేని కోసం? – ప్రతీ అడ్డం వరస లోనూ వచ్చే జవాబు, ఈ చివరి నిలువు వరసలో తెలుస్తుంది.

ఇక్కడ, మొదట 5 అడ్డం లైన్లనే చూపించి, తర్వాత, పిల్లలతో ఇంకా 10 లైన్ల వరకూ కూడా అడ్డం లైన్లని చెప్పించాలి.

5వ అడ్డం వరసలో,

"5 ఒకట్లు, ఐదు" – అన్నాం కదా? ఇది, 4 + 1 = 5. అంటే, పై అడ్డం వరసలో వున్న 4కి, ఎక్కం నంబరు 1 కాబట్టి, ఆ 1 కలిసి, 5 అయింది. తర్వాత?

6 ఒకట్లు, ఆరు. 5+1 = 6.

7 ఒకట్లు, ఏడు. 6+1 = 7.

8 ఒకట్లు, ఎనిమిది. 7+1 = 8.

9 ఒకట్లు, తొమ్మిది. 8+ 1 = 9.

10 ఒకట్లు, పది. 9+1 = 10.

ఇలా, ప్రతీ అడ్డం వరసా ఎలా ఏర్పడిందో, పిల్లలకి తెలుస్తూ వుండాలి.

ఈ అడ్డం లైన్లని ఇంకా కూడా రాయవచ్చు గానీ, 1టో ఎక్కాన్ని తెలుసుకునే ఈ చిన్న పిల్లలకి, 10 లైన్ల వరకూ చాలు.

ఇది, 1టో ఎక్కం కాబట్టి, ఇందులో, ఒక అడ్డం లైనుకి చివర వచ్చే జవాబుకి, 1 టే కలుస్తూ వుండాలి. ఒకట్లు కలవడం, **1ట్ల** కూడికలు అవుతాయి.

**పిల్లలు ఇలా చెప్పగలగాలి:**

1 కి, ఇంకో 1 కలిస్తే, అది 2.

ఆ 2 కి, ఇంకో 1 కలిస్తే, అది 3.

ఆ 3 కి, ఇంకో 1 కలిసి, అది 4.

ఆ 4 కి, ఇంకో 1 కలిసి, అది 5.

......................................

ఆ 9 కి, ఇంకో 1 కలిసి, అది 10.

ఇంత వరకూ చూసిన దాని వల్ల, 'ఎక్కం' అనేది, ఎలా తయారవుతుందో పిల్లలకు తెలియాలి. ఇది ప్రారంభమే కాబట్టి, ఇన్ని వివరాలతో చెపితే, చెప్పినది తేలికగా తెలుస్తుంది. ఎక్కం అనేది, ఏ అంకె ఎక్కంగా వుంటుందో, ఆ ఎక్కంలో, ప్రతీ అడ్డం లైనులోనూ, ఆ ఎక్కం అంకే కలుస్తూ, ఆ ఎక్కం తయారవుతుందని పిల్లలకి మళ్ళీ మళ్ళీ చెప్పాలి. ఎక్కాన్ని నేర్పడంలోనూ, నేర్చుకోడంలోనూ, ఇదే అసలైన ముఖ్య విషయం. మొదటి నించీ ఇది తెలియాలి పిల్లలకి. ఇప్పటికి, 1వ ఎక్కాన్ని మాత్రమే చెప్పుకున్నాం.

అసలు, లెక్కల టీచర్లు, ఎక్కాల్ని నేర్పేటప్పుడు, '1వ ఎక్కం నించి చెప్పరనుకుంటా. 2వ ఎక్కం నించే మొదలు పెడతారేమో! కానీ, 1టో ఎక్కం, ఎంతో ముఖ్యం. 1కి, ఇంకో 1 కలుస్తూ, ఆ 1 అంకె, 2గా, 3గా, 4గా, 5గా, అలా పెరుగుతూ వుండడాన్ని పిల్లలు చూడాలి. వాళ్ళు, 'ఎక్కం' అంటే, ఏమిటో గ్రహించడానికి, 1వ ఎక్కం నించీ నేర్పడం చాలా అవసరం. ఈ విధంగా పిల్లలు, 2వ, 3వ ఎక్కాల్ని కూడా చూస్తే, ఈ 'మొదటి పద్ధతిని' ఆపి వెయ్యవచ్చు!

**'మొదటి పద్ధతి'లో, 2వఎక్కానికి,**
**చదివే విధానమూ, రాసే విధానమూ:**

| ఈ నిలువు లైను,అడ్డం లైన్లలోవున్న అంకెల్ని చూపిస్తుంది.<br>**1** | ఇది, ఏ ఎక్కమో చెప్పే నిలువు లైను.<br>**2** | ఇది, ఈ ఎక్కంలో జవాబుల్ని చెప్పే నిలువులైను<br>**3** | వివరణలు |
|---|---|---|---|
| ఒక్క<br>1 | రెండు | రెండు<br>2 | ఇది ఒక్క రెండే.<br>2 |
| రెండు<br>2 | రెండులు<br>2 + 2 | నాలుగు<br>4 | పైన వున్న 2కి,2 కలిసి, 4 అయింది. |

| | | | |
|---|---|---|---|
| మూడు<br>3 | రెండులు<br>2, 2+2 | ఆరు<br>6 | పైన వున్న 4కి, 2 కలిసి 6 అయింది. |
| నాలుగు<br>4 | రెండులు<br>2, 2, 2+2 | ఎనిమిది<br>8 | పైన వున్న 6కి, 2 కలిసి, 8 అయింది. |
| ఐదు<br>5 | రెండులు<br>2,2,2,2+2 | పది<br>10 | పైన వున్న 8కి, 2 కలిసి, 10 అయింది. |

టీచరు, బ్లాక్ బోర్డు మీద, ఈ పట్టికని రాసి, పిల్లల్ని ప్రశ్నిస్తూ జవాబులు చెప్పించాలి. ఈ పిల్లలు ఐదారేళ్ళ పిల్లలు."పిల్లలూ! ఇది, 2డో ఎక్కం. అంటే, మొదట '2 ని' తీసుకుంటాం. తర్వాత, ఆ మొదటి 2కి, ఇంకో 2డే కలుస్తుంది. అది 4 అవుతుంది. ఆ 4కి, మళ్ళీ 2డే కలుస్తుంది. ఇది, 2డో ఎక్కం కాబట్టి, ప్రతీ సారీ 2డే కలుస్తూ వుండాలి. ఆ మొదటి 2 అంకె, ఎలా పెరుగుతూ వుంటుందో పిల్లలు చూడాలి.

"మొదట 2 వుంది. దానికి ఇంకో 2 కలిస్తే, అది ఎంత అవుతుంది? మీ వేళ్ళని తీసి లెక్క పెట్టండి!"– టీచరు ప్రశ్న!

"పిల్లలు ఉత్సాహంగా 2 వేళ్ళని ఎత్తి, ఆ పక్క ఇంకో 2 వేళ్ళని కూడా ఎత్తి, లెక్క పెడతారు. "నాలుగు అయింది టీచర్!" అని అరుస్తారా? అలా చెప్పలేకపోతే టీచరే మళ్ళీ మళ్ళీ చెప్పి, వాళ్ళతో చెప్పించాలి.

తర్వాత నించీ, టీచరు ఓపికతో చెప్పి, ప్రశ్నలు వేయడమే జరగాలి. "పిల్లలూ! 2+2**వ** 4 అని చెప్పండి! ఆ 4కి ఇంకో 2 కలిస్తే? అది ఎంత అవుతుంది?" అని టీచరు, గింజలనో, గోలీలనో, బల్ల మీద పెట్టి చూపిస్తూ, వాటిని కలుపుతూ అడగాలి.

ఈ చిన్న పిల్లలు, 2డో ఎక్కాన్నీ, ఆ అంకెల్నీ, నేర్చుకునే వయసు పిల్లలు కాబట్టి, టీచరుకి తన చిన్న వయసు గుర్తు వస్తే రావచ్చు బహుశా.

"ఈ ఎక్కంలో, నిలువు లైన్లు ఏవి? ఎన్ని?" అని ప్రశ్నించి, పిల్లలతో ఆ లైన్లని చెప్పించాలి. తర్వాత, "అడ్డం లైన్లు ఏవి? అవి ఎన్ని?" అని అడిగి, పిల్లలు వాటిని కూడా చెప్పగలిగే లాగ చెయ్యాలి.

"పిల్లలూ! మనం, అడ్డం లైన్లని, 5 వరకే రాశాం. 6వ అడ్డం లైనుని మీరు చెప్పండి" అని పిల్లల్ని అడిగి, వాళ్ళతో తర్వాత ఇంకా కొన్ని అడ్డం లైన్లని చెప్పించాలి.

| | | |
|---|---|---|
| ఆరు<br>6 | రెండులు<br>2,2,2,2,2+2 | పన్నెండు<br>12 |

అని బోర్డు మీద రాసి చూపించి, 12ని ఎలా వెయ్యాలో, 10+2 అని వివరించాలి. తర్వాత, "12కి ఇంకో 2 కలిస్తే?" అని ప్రశ్నించి, దాన్ని, 12 + 2 = 14 గా చూపించాలి.

ఇప్పటికి, 2వ ఎక్కాన్ని చూశాం. దీన్ని ఇంకా పెంచాలో లేదో టీచరు నిర్ణయించాలి, పిల్లల ఉత్సాహాన్ని బట్టి. తర్వాత, 3వ ఎక్కాన్ని కూడా చూడాలి.

**మొదటి పద్ధతిలో,3వ ఎక్కాన్ని,**
**చదివే విధానమూ,రాసే విధానమూ:**

| ఎక్కంలో వుండే అడ్డం లైన్లని చెప్పే నిలువు లైను. **1** | ఇది ఏ ఎక్కమో చెప్పేనిలువు లైను. **2** | జవాబుల నిలువు లైను **3** | వివరణలు |
|---|---|---|---|
| ఒక్క<br>1 | మూడు,<br>3 | మూడు<br>3 | ఇక్కడ, ఒక్క 3డే. |
| రెండు<br>2 | మూడులు, | ఆరు 6<br>3 + 3 | ఇక్కడ, 3కి, 3 కలిసింది. |
| మూడు<br>3 | మూడులు,<br>3, 3+3 | తొమ్మిది<br>9 | ఇక్కడ, 6కి, 3 కలిసింది. |
| నాలుగు<br>4 | మూడులు,<br>3,3,3+3 | పన్నెండు<br>12 | ఇక్కడ 9కి, 3 కలిసింది. |
| ఐదు<br>5 | మూడులు,<br>3,3,3,3+3 | పదిహేను<br>15 | ఇక్కడ 12కి 3 కలిసింది. |

"పిల్లలూ! ఇది, 3డో ఎక్కం కదా? ప్రతీ సారీ, మొదటి జవాబుకి 3డే కలుస్తూ, ఎక్కం పెరుగుతూ వుంటుంది.

1టో ఎక్కంలో, ప్రతీ సారీ 1కి, 1 కలిస్తే 2డో ఎక్కంలో ప్రతీ సారీ 2కి, 2 కలిస్తే ఇది 3 డో ఎక్కం కాబట్టి ఇందులో ప్రతీ అడ్డం లైనులోనూ, 3యే కలుస్తూ వుండాలి.

2డో ఎక్కానికి పట్టికని చూపించిన తర్వాత, ఎటువంటి ప్రశ్నలు వేశారో, అలాగే ఇక్కడ కూడా పిల్లల్ని అడగాలి.

"ఈ 3డో ఎక్కంలో, 5 అడ్డం లైన్ల వరకూ చూశాం కదా? ఆ లైనులో జవాబు 15గా వచ్చింది కదా? అది 5దో అడ్డం వరసలో, 12కి, 3 కలిసి, 15 అయింది కదా? అక్కడితో, అప్పుడు పట్టికలో అడ్డం లైన్లని ఆపాం. ఈ 15కి, ఇంకో 3ని కూడా కలిపితే, ఎంత అవుతుంది? అంటే, 15 ఇంకా ఎంతగా పెరుగుతుంది?" అని 15తో మొదలు పెట్టాలి.

| | |
|---|---|
| 15 + 3 = 18. ఇలా. | ఎక్కాలు నేర్పడం, చిన్న కూడికల్ని నేర్పడమే. |

ఇంకా మనం ఎక్కాల్ని నేర్పే మొదటి పద్ధతినే చూస్తున్నాం.

ఎక్కాల ప్రారంభంలో, టీచరు ఇంత శ్రద్ధ పడితే, పిల్లలకు లెక్కల పునాది, ఎంతో తేలికైన గ్రహింపుతో మొదలవుతుంది. ఒక ఎక్కం పూర్తయిన తర్వాత, ఆ లైన్లని ఇంకా పెంచే విధంగా పిల్లల్ని ప్రశ్నిస్తూ, వాళ్ళతో చెప్పించాలి.

"పిల్లలూ! 1టో ఎక్కాన్ని చదివేటప్పుడు, 'ఒక్క ఒకటి, ఒకటి' అని మొదలవుతుంది. 2డో ఎక్కాన్ని, ఎలా మొదలు పెట్టాలి? 'ఒక్క రెండు, రెండు' కదా? మూడో ఎక్కం ఎలా మొదలవుతుంది? 'ఒక్క మూడు, మూడు' అని.

"4గో ఎక్కం అయితే?"

"5దో ఎక్కం అయితే?"

ఇలా ప్రశ్నలూ, జవాబులూ, మళ్ళీ మళ్ళీ.

పిల్లలకు ఏ ఎక్కం అయినా తేలికగా, సరిగా, త్వరగా రావాలంటే, టీచరు, ఎక్కంలో వున్న కూడికల్ని బోర్డు మీద చూపిస్తూ, పిల్లల్ని ప్రశ్నిస్తూ నేర్పడం, మంచి పద్ధతి. "ఎక్కాల పుస్తకం లో ఎలా వుందో, అలా చదవండి!" అని చెప్పడం కాదు. పుస్తకంలో మంచిగా వున్నా సరే, పుస్తకం చదవడం కాదు మొదట.

పిల్లల్లో తెలివిగా జవాబులు చెప్పే పిల్లలు వున్నా, వాళ్ళని తెగ పొగడడం చెయ్యకూడదు. మెచ్చుకోడం వేరూ, పొగడడం వేరూ! త్వరగా చెప్పలేని పిల్లల మీద, వెటకారాలు వుండ కూడదు.

క్లాసులో, 10,15 మంది పిల్లల కన్నా ఎక్కువ మంది వుంటే, టీచర్లు చాలా అలిసి పోతారు. అయినా, పిల్లలకు బోధించడమే తమ కర్తవ్యం అని, టీచర్లకి తెలుసు కాబట్టి, పిల్లలకు నేర్పడంలో టీచర్లు సహనం తోనే ప్రవర్తిస్తారు.

నేను, ఈ వ్యాసం రాయాలనుకున్న సందర్భంలో, తెలిసిన టీచర్లతో మాట్లాడి నప్పుడు, ఒక టీచరు, ఇలా అన్నారు: "పది మంది పిల్లలే వున్న క్లాసుని, నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. డబ్బు తీసుకునే ప్రైవేటు స్కూళ్ళల్లో కూడా అంతే. ఇంగ్లీషు దేశాల్లోనూ అంతే అని వింటాం. అంతే అయినా కాదు, చిన్న వయసు పిల్లలు ఎందరున్నా, ఆ పిల్లల తరగతులకు, ఒక్కరే టీచరు అన్ని సబ్జక్టులకూ!"

ఏ ఎక్కం పట్టికలో అయినా, ఎన్ని నిలువు లైన్లు, ఎన్ని అడ్డం లైన్లు వున్నాయో అవి, ఎందుకు వున్నాయో పిల్లలు గ్రహిస్తేనే, ఎక్కం ఎలా ఏర్పడిందో, ఎలా తయారైందో, పిల్లలు తేలిక గానే తెలుసు కుంటారు.

1వ, 2వ, 3వ ఎక్కాల పట్టికల్ని చూపించి, ఇంత వరకూ ప్రశ్నలు అడిగిన తర్వాత, ఇక ఆ 3 ఎక్కాల్నీ, పిల్లలు గబ గబా చెప్ప గలిగే లాగ, ఆ ఎక్కాలు పిల్లలకు అలవాటవ్వాలి. ఇదంతా, 2డో తరగతి లోనే జరగాలని కాదు.

'ఒక్క ఒకటి, ఒకటి' - అంటూ ఒకటో ఎక్కం, 10 లైన్ల వరకూ.

'ఒక్క రెండు, రెండు' - అంటూ, 2డో ఎక్కాన్నీ.

'ఒక్క మూడు, మూడు' - అంటూ 3డో ఎక్కాన్నీ.

3 ఎక్కాల్నీ, 10 అడ్డం లైన్ల వరకూ! ఇలా రావాలంటే, వాటిని ఒకటీ రెండు సార్లు చదివితే చాలదు. ఎక్కువ సార్లు చదవాలి. అలా చదవడం అంటే, 'కంఠతా పట్టడమే.' ఈ కంఠతా పడ్డడం అస్సలు లేకుండా, ఎక్కాలు రావు.

ఎక్కాల్ని నేర్పే ఈ మొదటి పద్ధతిలో, ఎక్కాల్ని కంఠతా పట్టడం గురించి తెలుసు కోవలిసింది ఏమిటంటే ఏ ఎక్కం గురించైనా, కంఠతా పట్టక ముందే ఎక్కంలో వుండే లైన్ల గురించీ, వాటిని చదివే పద్ధతి గురించీ, తెలిసి వుండాలి. ఆ తర్వాతే కంఠతా పట్టడం!

ఇంత వరకూ 1, 2, 3 ఎక్కాల్ని మాత్రమే చూశాం. ఇక, తర్వాత 4గో ఎక్కం నించీ. టీచరు, వాటికి కూడా బోర్డు మీద పట్టికలు రాస్తూ పిల్లలకు చూపించాలి. వాటి మీద కూడా ప్రశ్నలూ, జవాబులూ, సాగాలి. పిల్లల నోట్ బుక్కులో కూడా ఎక్కాల పట్టికలు వుండాలి. ఎక్కాల అచ్చు పుస్తకాలు ఎలాగా వుంటాయి.

1,2,3 ఎక్కాలకు అవసరమైనంత బోధన, సరిగా జరిగి వుంటే, తర్వాత ఎక్కాలకు అంత బోధన అక్కర లేదు. అయినా, ప్రతీ ఎక్కానికీ కొంత శ్రద్ధతో ప్రశ్నించడం అవసరమే.

ఇక తర్వాత, ఎక్కాలు ఎన్నో నంబరు ఎక్కం వరకూ రావడం అవసరం? 10 ఎక్కాల వరకూనా, 20 ఎక్కాల వరకూనా?

ఎక్కాల చదువు మొదలవడం, ఏ 2డో తరగతి లోనో ప్రారంభ మవుతుంది. పిల్లలు 4, 5 తరగతుల్లోకి పోయేటప్పటికి కొంత ఎదుగుతారు. అప్పటి వరకూ ఎక్కాల్ని సరైన పద్ధతిలోనే నేర్చుకుంటూ వుంటే, 10వ ఎక్కం వరకూ ధారాళంగా చెప్పగలుగుతారు. అప్పటికి, కూడికల్నీ, తీసివేతల్నే గాక, హెచ్చవేతల్నీ, భాగాహారాల్నీ కూడా కొంత చేయ గలుగుతారు. ఇంత వరకూ చూసినది, ఎక్కాల్ని నేర్పడంలో, మొదటి పద్ధతినే. ఇక దీన్ని ఆపుదాం!

*రెండో పద్ధతి: వచ్చే సంచికలో*

## గ్రంథాలయం

**ఖలీల్ జిబ్రాన్** (ప్రవక్త)
తెలుగు అనువాదం: డా. తుర్లపాటి రాజేశ్వరి
పుటలు: 71, వెల :150/-
ప్రతులకు : తుర్లపాటి రాజేశ్వరి ఫ్లాట్‌నెం. 405, 3వ అంతస్తు, రాజారాణి సరోవర్ అపార్ట్‌మెంట్స్, శాస్త్రినగర్ ఎదురుగా, 3వ లేన్, బరంపూర్-760 002 సెల్: 7077613351





గోపీనాథ్ మహంతి **ఈతచెట్టు దేవుడు**
తెలుగు సేత: తుర్లపాటి రాజేశ్వరి
సెల్: 9078743851
పుటలు:96 వెల: 125/-
ప్రతులకు :సాహిత్య అకాదెమి రవీంద్రభవన్, 35, ఫిరోజ్‌షా రోడ్, ఢిల్లీ 110001



ఆంధ్ర మహిళాలలామ **పొణకా కనకమ్మ**
కూర్పు: తూమాటి వీరనారాయణరెడ్డి
పుటలు: 224, వెల :100/-
ప్రతులకు : తూమాటి వీరనారాయణరెడ్డి బట్టేపాడు గ్రామం, ఆత్మకూరు మండలం, పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, సెల్: 9494618322

**జోలాలీ...** (ఉ.సా పాటలు)
రచన :ఉ.సా
పుటలు:312 వెల: 150/-
ప్రతులకు :సి.ఎల్.ఎన్ గాంధి, ప్రెసిడెంట్, ఉ.సా. స్మారక కమిటీ, 102, మెట్రోపామ్‌గ్రోవ్ అపార్ట్‌మెంట్స్, రాజ్‌భవన్ రోడ్, హైదరాబాదు-500 082 ఫోన్: 9848055369



సి.వి. క్రిష్ణయ్య
93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 4

**జరిగిన కథ:**

అడవిలో జంతుజనాలు పక్షిజనాలు పెద్ద సభ చేసారు.
ఈ భూమిమీద తెలివిగల ప్రాణి ఏది అనే ప్రశ్న
వచ్చింది. మనిషి తెలివిగలవాడే కానీ అతని
బుద్ధిహీనత బానిసత్వం దుర్మార్గాలు తక్కువేమీకాదు.
ఇందుకు బడి బడిలో చదువులే కారణమని తేల్చారు.
మంచి బడి పెట్టుకుని జంతు పక్షి జనాలు
తెలివితేటలు సంపాదించుకోవాలనుకున్నారు.
ఒక కోతి సహాయంతో బడి పెట్టుకొన్నారు.
కష్టాలు ప్రారంభమయ్యాయి. తరువాత కథ చదవండి

## తల్లిదండ్రులకు తలనొప్పులు

**రో**జురోజుకు బడి కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. బడికి అలవాటయ్యేకొద్దీ పిల్లల్లో చాలా మార్పులురాసాగాయి.

తిండి తినడంలో నిద్రపోవడంలో తేడాలు కనబడుతున్నాయి. ఎప్పుడూ ఏదో ఒక జబ్బుచేస్తూ ఉంది. జలుబో, తలనొప్పో, కడుపునొప్పో, జ్వరమో వచ్చి బడి ఎగ్గొడుతున్నారు. ఇవన్నీ దొంగవేషాలని టీచర్లు పిల్లల్ని బడికి బలవంతంగా లాక్కొని వెళుతున్నారు. ఈ బడితో తల్లిదండ్రులకు తలనొప్పులు మొదలయ్యాయి.

పిల్లలు నిద్రపోతే ఎంత లేపినా లేవడంలేదు. అడవిజనాలు ఎంతో మెలుకువతో ఉండాలి. అడవి ప్రాణులది మెలకువతో కూడిన నిద్ర. కాని ఎంత కొట్టినా గిచ్చినా నిద్రలేవడం లేదు. ఒంటికి దొడ్డికి కూర్చున్న దగ్గరే విసర్జిస్తున్నారు. పక్షిపిల్లలు వెనక్కి వెనక్కి వచ్చి దూరంగా పడేటట్లు విసర్జిస్తాయి. జంతువులు మలమూత్రాలు శరీరానికి అంటకుండా నేర్పుగా విసర్జిస్తాయి. పిల్లులు తమ మలాన్ని గోతులు తీసి పూడ్చిపెడతాయి. అలాంటి పిల్లి పిల్లలు కూడా పడకను అపరిశుభ్రం చేసుకొంటూ ఉన్నాయి. స్నానం జోలికి వెళ్లడంలేదు. శరీరాలు మాసిపోయి నల్లగా తయారయ్యాయి.

పిల్ల జంతువులు పిల్ల పక్షులు చీటికీ మాటికి భయపడుతున్నాయి. ఈ బాధలు పడలేక ఒక రోజు తండ్రిపులి బడికివచ్చింది. రాగానే టీచర్ల మీద పెద్దగా అరిచింది "నా బిడ్డకు మీరు ఏమి నేర్పిస్తున్నారు. నా బిడ్డ నిన్న కుందేలును చూసి భయపడి ఇంట్లో నుండి బయటకు రాలేదు. వేట నేర్పించే మాస్టారు ఎవరు? అని తండ్రిపులి కోప్పడింది.

ఏం! నేనే అంటూ ఒక గండుపిల్లి పులిముందుకు వచ్చి నిలబడింది. గండుపిల్లిని చూసి పులి ఒక్క క్షణం భయపడింది. అంతలోనే తేరుకుని "అది కాదు సార్ కుందేలును చూసి నా బిడ్డ భయపడడం ఏమిటి? ఇట్లయితే ఈ చదువులవల్ల లాభం ఏముంది. రేపు అది ఎలుకపిల్లను కూడా పట్టుకోలేదు. ఆకలితో మాడిచస్తుంది. తమ ఆహారాన్ని తాము స్వయంగా సంపాదించుకోవడం చేతగాని ఈ చదువులెందుకు? మనుషుల పిల్లలు కూడా పెద్దపెద్ద చదువులు చదివి కూడా బ్రతకడం చేత గాక ఆత్మహత్యలు చేసుకొంటారట. మన చదువులు కూడా అలానే తయారవుతాయేమో?

ధైర్యం మాసొత్తు. మమ్మల్ని చూసి అందరూ భయపడాలి. అలాంటిది గడ్డిపోచలు తినే కుందేలుకు భయపడడం విచిత్రంగా ఉంది. సహజమైన శక్తిని కూడా లేకుండా చేసే ఈ బడి ఎందుకు? అని కోపంగా విసుగ్గా వినయంగా అడిగింది పులి. ఎక్కడ తన బిడ్డను బడిలో నుండి తీసేస్తారోనని భయంతో నవ్వు ముఖంపెట్టింది.

గండుపిల్లి గంభీరంగా మొహంపెట్టి "మొదట అలానే ఉంటుంది. రాను రాను అన్నీ నేర్చుకొంటారు. మొదట భయపడిపారిపోవడం నేర్పాను. ప్రాణం రక్షించుకోవడం ఆహారం కోసం వేటాడడం రెండింటిలో ఏది ముందు?" అని ప్రశ్నించింది.

"ప్రాణం రక్షించుకోవడం ముందు చేయాల్సిన పని" అని చెప్పింది పులి. చూసారా మీ నోటితో మీరేచెప్పారు. కాబట్టి ప్రాణం రక్షించుకోవడం ముందు నేర్పాను. కొన్ని సిద్ధాంతాల ప్రకారం నేర్పాలి. ఇవన్నీ మీకు చెప్పినా అర్థంగావు" అన్నది గండుపిల్లి.

"అదిగాదు సార్ వారి వారి సహజస్వభావాలు ప్రవర్తనలు ఉంటాయి కదా! తనకంటే బలమైన వాటితో తలపడేడప్పుడు ఓడిపోతామనే భయంతో పారిపోవడం సహజం. తనకంటే బలం తక్కువ ఉన్న శత్రువుతో పోరాడాలి. పారిపోతారా? పులి కుందేలును చూసిపారిపోవడం సరైన పనేనా? ఎవరికి ఏది అవసరమో అది నేర్పాలి. పులికి భయపెట్టి తరమడం నేర్పాలి! కుందేలుకు భయపడిపారిపోవడం నేర్పాలి. పారిపోయి దాక్కోవడం పులికి నేర్పి, ఎదురుతిరిగిపోట్లాడడం కుందేలుకు నేర్పితే ఏమి ప్రయోజనం". అని చెప్పింది పులి.

మన గండుపిల్లి మాస్టారు ఈ మాటలేమి పట్టించుకోలేదు. చూడండి మీతో వాదించే తీరిక మాకులేదు. నాకు వేరే తరగతి ఉంది. వెళ్లిరండి. చివరగా ఒక మాట. మీ పులిజాతికి వేటనేర్పింది మా పిల్లిజాతే. అంటూ గుడ్లుమిటకరించి చేతులూపుకుంటూ వెళ్లింది గండు

పిల్లి. చేసేదేమి లేక మన పులి ఇంటిదారి పట్టింది.

మరునాడు జింక బడికి వెళ్ళింది. జింకను చూసి టీచర్లందరూ అక్కడికి వచ్చారు. మా పిల్లలకు మీరు ఏమి నేర్పిస్తున్నారు. నా బిడ్డను నిన్న నక్కపిల్ల తరుముతున్నది. పారిపోకుండా పళ్ళు ఇకిలించి కూర్చున్నది. సమయానికి నేను రాకపోతే ఆ నక్కపిల్ల చేతిలో నాబిడ్డ చచ్చిపొయ్యేది. అని అమ్మజింక బాధగా చెప్పింది.

"అప్పుడు నువ్వు ఏమి చేశావు" గండుపిల్లి అడిగింది.

"ఏముంది? ఒసేయ్ పరుగు తీయవే" అని అరిచాను.

"అలా మీరు పిల్లలకు చెప్పకూడదు. పైగా ఒసేయ్ అనడం ఏమిటి? అసహ్యంగా" అన్నది గండుపిల్లి.

"బాగుంది మీరు చెప్పేది. ఇంతకూ మా పిల్లలకు పరుగు నేర్పేది ఎవరు?" అని అడిగింది జింకతల్లి.

ఏం నేనే అంటూ ముందుకు వచ్చి నిలబడింది నల్లగుర్రం.

"అది కాదు సార్ పరుగుదీయకుండా పళ్ళికిలించి కూర్చోడం ఏమిటి?" అని అడిగింది జింకతల్లి. "అది సమయానికి మరిచిపోయి ఉంటుంది. గుర్తుకురాగానే పరుగు దీస్తుందిగదా! పిల్లల్ని హైరానా పెట్టకూడదు" అన్నది గుర్రం. "ప్రాణం మీదికి వచ్చినా మర్చిపోతే ఎలా తప్పించుకొంటుంది. ప్రాణాలు ఎలా కాపాడుకుంటుంది?" అని విచారంగా అడిగింది జింకతల్లి.

"చూడండి మీరు ఇంటిదగ్గర ఏమీ నేర్పకూడదు. మేమొకటి చెప్పి మీరొకటిచెప్పి అంతా గందరగోళం అయిపోతుంది. మాకొక పద్ధతి ప్రణాళిక ఉంటుంది అన్నది గుర్రం. జింక చేసేది లేక ఇంటికి బయలుదేరింది. దారిలో కోకిలమ్మ ఎదురైంది.

ఎక్కడికి చెల్లీ అని అడిగింది జింకతల్లి.

"బడికి వెడుతున్నా! నువ్వెక్కడినుండి? అని ప్రశ్నించిది కోకిలమ్మ. బడికి వెళ్లివస్తున్నాను. నువ్వుకూడా వెళ్లిరా తర్వాత మాట్లాడుకొందాం. ఇంట్లో చిన్న బిడ్డ. త్వరగా వెళ్లాలి అంటూ పరుగుతీసింది. కోకిలమ్మ బడికి వచ్చి నేరుగా సంగీతం నేర్పించే మాష్టారి దగ్గరికెళ్లింది. గండు కోయలగారు కళ్లుమూసుకొని రాగాలాపన చేస్తుంటే పిల్లలంతా శబ్దంలేకుండా ఎక్కిరించుకుంటూ గిచ్చుకుంటూ ఉన్నారు. కొద్దిసేపు నిలబడి ఎంతసేపటికీ కళ్లు తెరవకపోవడంతో వెనుదిరిగి హెడ్మాష్టర్ దగ్గరకెళ్లింది.

"మీ సంగీతం మాష్టారు కళ్లు తెరవరా? అని అడిగింది కోకిల.

"ఆయన మహా పండితులు. అప్పుడప్పుడు మైమరచి రాగాలాపన చేస్తూ మరో లోకంలోకి వెళ్లిపోతారు. ఆయన దగ్గర సంగీతం నేర్చుకోవడం మీ పిల్లల అదృష్టం. అంటూ సంగీతం మాష్టరు గారి గొప్పతనం గురించి వివరించారు.

"చూడండి నేను సంగీతం మాష్టారితో మాట్లాడాలి. పిలిపించండి" అని అడిగింది కోకిలమ్మ. హెడ్మాష్టరు సంగీతం మాష్టారిని పిలిపించారు. "సార్! నాబిడ్డ బడికి రాకముందు కూకూ అంటూ పాటలు పాడేది. పాడుతూ ఉంటే మనుషుల పిల్లలు పోటీలు పడి పలికేవాళ్లు. ఇప్పుడేంది సస అంటూ పాము బుసలుకొట్టినట్లు పాడుతున్నది"

అవి "పాటలుకాదు సంగీత స్వరాలు. ముందు స్వరాలు నేర్పిస్తే వాటి ఆధారంగా పాటలకు బాణీలుకట్టి పాడుకొనే జ్ఞానం వస్తుంది." అంటూ వివరించారు. సంగీతం మాష్టారు

"పసిపిల్లలకు సంగీతం ఎందుకు? వాళ్లేమైనా పండితులు కావాల్నా, మంచి పాటలు నేర్పించండి" అని అడిగింది కోయలమ్మ.

పాటలు ఇక్కడ నేర్పించం. మీకు ఇష్టమైతే ఉంచండి! లేకపోతే తీసుకొని పొండి అన్నది కోపంగా. కోకిలమ్మకు కూడా కోపం వచ్చింది. మీరు గొప్ప పండితులని మీకొచ్చిన పాండిత్యంతా పసి పిల్లలకు నేర్పించడానికి పూనుకుంటారా? నాబిడ్డను తీసుకొని వెళ్లమంటారా? ఈ బడి మీకోసం పెట్టిందా? మాకోసం పెట్టిందా? అని కోపంగా అడిగింది. ఈ తతంగమంతా చూసిన హెడ్మాష్టరుగారు కోకిలమ్మని సముదాయించి సంగీతం మాష్టారిని పిల్లల దగ్గరకు సాగనంపాడు.

మీరు చెప్పినట్లు పాటలు నేర్పిస్తాం. మీరు వెళ్లిరండి అంటూ కోకిలమ్మను సమాధాన పరిచి ఇంటికి పంపించారు హెడ్మాష్టరుగారు.

ఒకరోజు తల్లినక్క ఇల్లంతా శుభ్రంచేస్తూ ఉంది. నక్కపిల్ల ఇంటి బయట బండమీద కూర్చుని రెండుమూళ్ల ఆరు రెండుమూళ్ల ఆరు అంటూ రొప్పుతూ ఉంది. నక్క ఈ మాటలు విని వీడికి మతి భ్రమించిందా? ఒకేమాటను అదేపనిగా అంటున్నాడు అనుకొని దగ్గరకొచ్చింది. జ్వరం వచ్చి పలవరిస్తున్నాడేమోనని చెయ్యి నుదుటిమీద పెట్టి వేడిచూసింది. కళ్లు నోరు పరిశీలించింది. అన్నీ బాగానే ఉన్నాయి. "రెండుమూళ్ల ఆరు రెండుమూళ్ల ఆరు అంటూ పలవరిస్తున్నావు దాని అర్ధంఏంది బిడ్డా?" అని అడిగింది. అర్థం పర్థం మాకు చెప్పలేదు. ఇది రెండోఎక్కం. కంఠస్తం చేస్తున్నాను. మధ్యలో నువ్వు అడ్డం వచ్చావు. రెండుమూళ్లు ఎంతో మరచి పోయాను. నువ్వు ఆవలికి ఫో అంటూ కసురుకున్నాడు పిల్లాడు. "అయితే రెండుమూళ్లు ఆరు ఎలా అవుతుందో నీకు తెలియదా" అని తల్లి నక్క అడిగింది – తెలుసు రెండుమూళ్లు ఆరేగదా అన్నాడు నక్కపిల్లాడు. అదికాదమ్మా ఒకమూడు ఒకమూడు కలిపితే ఆరుఅవుతుంది గదా ఈ సంగతి నీకు తెలియదా అని అడిగింది నక్కతల్లి. "అయ్యో! పిచ్చి అమ్మా అవన్నీ ఎందుకు తెలుసుకోవడం. హాయిగా టీచర్ చెప్పింది నేర్చుకుంటే సరిపోతుంది గదా! నీకేమీ తెలియదు ఫో– అని విసుకున్నాడు పిల్లవాడు. ఈ మాటలతో నక్క తల్లికి తల తిరిగిపోయింది.

మరునాడు నక్కతల్లి బాగా ముస్తాబై బడికివెళ్లింది. నేరుగా హెడ్మాష్టరు దగ్గరకెళ్లి లెక్కలు చెప్పే మాష్టారు ఎవరు? నేను ఆయనగారితో మాట్లాడాలి అన్నది. హెడ్మాష్టరు గారు లెక్కల మాష్టారైన తెల్లకోడిపుంజుగార్ని పిలిపించారు.

తెల్లకోడిపుంజుగారు వచ్చి ఏమిటి సంగతి అంటూ నక్క తల్లిని అడిగారు–"నా బిడ్డ రెండుమూళ్ళ ఆరు రెండుమూళ్ళు ఆరు అంటూ రొప్పుతూ ఉంది. రెండుమూళ్ళ ఆరు ఎలా అవుతుందో అడిగితే చెప్పడంలేదు – మీరు ఎక్కాలు ఎలా ఏర్పడతాయో చెప్పడం లేదా? ఎక్కాలన్నీ కూడికలేనని పిల్లలు అర్థం చేసుకోవాలి. ఎక్కాలు కంఠస్థం చేస్తే మరిచిపోతారు గదా! అది బండచాకిరీ కదా! మనస్సులోనే కూడుకుంటూ రెండింతలు తెలుసుకుంటూ తీసివేస్తూ ఎవరికి తోచినవిధంగా వాళ్లు మదింపు పద్ధతిలో చేసుకోవాలి. ఎక్కాలు గబగబా చెప్పలేకపోయినా రాయగలిగితే చాలు. – రెండుమూళ్ల ఆరు – రెండో ఎక్కం ఎలా అవుతుంది? కూడింది మూళ్లను అది మూడో ఎక్కం –



రెండుమూళ్లు ఆరు, మూడుమూళ్లుతొమ్మిది నాలుగు మూళ్లు పన్నెండు అని చెప్పాలి. ఈ మాత్రం టీచర్లకు తెలియక పోతేఎలా?

"చూడండి పిల్లలకు ఇవన్నీ అర్థంగాదు. ప్రపంచమంతా కంఠస్థం చేస్తున్నారు. మేమూ అలాగే చెప్పిస్తున్నాం"– అని పెడసరంగా సమాధానం చెప్పారు లెక్కల మాష్టారు తెల్లకోడిపుంజు గారు.

హెడ్మాష్టారుగారు నక్కతల్లి తెలివితేటలు మెచ్చుకొని "మీరు చెప్పిన పద్ధతి కూడా బాగుంది. ఆ పద్ధతిలోనే నేర్పిస్తాం. మీరు వెళ్లిరండి అంటూ సాగనంపారు. హెడ్మాష్టారుగారు లెక్కల మాష్టరుగారితో తల్లి నక్కగారు చెప్పిన పద్ధతి బాగుంది. ఆ పద్ధతిలోనే నేర్పించండి. మీరు బాగా తయారు కావాలి అని చెప్పారు. "ఎన్నో ఏళ్ల నుంచి ఇలానే చెబుతున్నారు. మేమంతా ఇలానే నేర్చుకొన్నాం." అంటూ నిష్ఠూరం వెలిబుచ్చారు కోడిపుంజుగారు.

ఒకరోజు కాకిపిల్ల ఇంట్లో కూర్చొని ఒకటోతరగతి పుస్తకం చదువుతూ ఉంది. తల్లి కాకి వింటూ ఉంది. ఖా–ఖరము, ఖా–ఖరము అని కాకిపిల్ల చదువుతూ ఉంది. "ఖా–ఖరము అని చదువుతున్నావు. ఖ–ఏంది? ఖరము ఏంది? అని అమ్మకాకి పిల్లకాకిని అడిగింది. నీకు తెలియదులే– ఖ అంటే వత్తు ఖ. ఖరము అంటే గాడిద అని మా టీచర్ చెప్పింది.

"గాడిదను గాడిద అని చెప్పాలిగాని ఖరము అని చెప్పడం ఎందుకు? ఏది పుస్తకం చూపించు అని అడిగింది. కాకిపిల్ల పుస్తకం చూపించింది. ఆ బొమ్మకు రంగులు సరిగా లేక మసకమసకగా ఉంది. ఇది గుర్రమై ఉంటుంది. కాకి ఆ బొమ్మను చూసి పుస్తకంలో పొరపాటున తప్పుపడి ఉంటుంది అనుకున్నది. రేపు నేను బడికి వచ్చి కనుక్కొంటానన్నది.

మరునాడు కాకి కాకిపిల్లనూ పుస్తకాన్నీ తీసుకొని బడికి వచ్చింది. నేరుగా చిలుకమ్మగారి దగ్గరకెళ్లింది. పుస్తకంచూపించి ఈ పుస్తకంలో గుర్రంబొమ్మ ఉంది. కింద గుర్రం అని రాయకుండా ఖరము అని తప్పు రాసారు. మీరు గమనించి సరిచేయాలిగదా! తప్పును అలాగే చెబుతారా? అని ప్రశ్నించింది.

"కాకమ్మగారూ! అది గాడిద బొమ్మ. సరిగాలేదు అన్నది చిలుక" "అయితే బొమ్మకింద గాడిద అని రాయకుండా ఖరము అని ఎందకు రాశారు" అని ప్రశ్నించింది కాకి

"ఖరము అంటే గాడిద. ఖ–అక్షరము చెప్పడానికి ఆ పదం ఉపయోగించారు."

ఓహో! మీరు ఇంగ్లీషు భాషకూడా చెబుతున్నారా? అని తన సందేహాన్ని వెలిబుచ్చింది కాకి. ఖరము అనేది ఇంగ్లీషు పదం కాదు. అది సంస్కృతపదం అని చెప్పింది చిలుక. "అయితే మీరు సంస్కృతం కూడా నేర్పిస్తున్నారన్నమాట" అన్నది కాకి. "నేర్పించేది తెలుగే" అని చెప్పింది చిలుక.

"మీరు చెప్పేది నాకు బొత్తిగా అర్థంగావటంలేదు. కాసేపు సంస్కృతం అంటారు. కాదుకాదు తెలుగేనంటారు. ఖ చెప్పడానికి ఇన్ని డొంకతిరుగుళ్లు ఎందుకు? ముఖం అని చెబితే సరిపోతుందిగదా" అన్నది కాకి. ముఖాన్ని చూసి తల అంటారుగదా! అన్నది చిలకమ్మ. ఈ మాటతో కాకి తల తిరిగిపోయింది– ఏమి చెప్పాలో తెలియక నోరుమూసుకొని ఇంటికి బయలుదేరింది.

అర్థంలేని అక్షరాన్ని నేర్పడానికి అర్థంతెలియని పదాన్ని చెప్పడం ఏమిటి? కమ్మటి అమ్మభాష నేర్పడానికి ఈ బాధలేమిటి? ఈ గాడిద చాకిరి ఏమిటి? పెద్ద గాడిదలు చదువు చెబుతూ ఉంటే చిన్న గాడిదలు నేర్చుకొంటున్నట్లు ఉంది. అంతా గాడిద చాకిరి అనుకొన్నది కాకి.

ఇంతలో దారిలో గాడిద ఎదురైంది. గాడిదను చూడగానే నవ్వు వచ్చింది. పకపకా నవ్వింది నక్కతల్లి.

"ఎందుకు నన్నుచూసి నవ్వుతున్నావు?" అడిగింది గాడిద. "ఏంలేదు తమ్ముడూ పిల్లల చదువులు తలుచుకుంటే నవ్వు వస్తూఉంది. నువ్వు గుర్తుకొస్తున్నావు. నువ్వు ఎంతో ఓర్పుతో బరువులు మోస్తూ ఉంటావు. మన పిల్లలు కూడా పుస్తకాలు మోస్తూ పుస్తకాల్లో ఉన్న చెత్తనంతా బుర్రల్లోకి ఎక్కించుకొని మోస్తూ ఉన్నారు. ఇందాకనే ఒక తమాషా జరిగింది. పుస్తకంలో నీ బొమ్మవేసి దానికింద ఖరము అని రాసిఉంది. ఈ సంగతే అడిగాను. సంస్కృతంలో నిన్ను ఖరము అంటారని చెప్పింది. ఈ ఖర్మఏమిటి నీకు?"

"ఏమోనక్కా నాకేమితెలుసు నన్ను ఖర్మ అంటారని – నిజంగా ఈ బరువులు మోసే ఖర్మవల్లే నాకు ఖరమని పేరు పెట్టారేమో? నా బిడ్డకూడా అర్థం పర్థంలేని చదువులు చదువుతూఉంది. దీని సంగతేమిటో తెలుసుకొందామని బడికి వెళుతున్నాను అన్నది గాడిద.

"సరే వెళ్లిరా అంతా కలుసుకొని ఈ చదువుల సంగతేమిటో? టీచర్ల సంగతేమిటో తేల్చుకొందాం. వస్తా" అంటూ నక్క ఇంటిదారి పట్టింది.

గాడిద నేరుగా హెడ్మాష్టరుగారి దగ్గరకెళ్లింది. "మా బిడ్డలకు ఏమి చెబుతున్నారో ఏమిటో పుస్తకం చదవరా బిడ్డా వింటానంటే చదవడంలేదు. ఒకటే రాయడం– నేను బలవంతం చేస్తే రెండుమూడు ముక్కలు నసుగుతూ చదివి నాకు చదవడం రాదు అంటున్నాడు. 24 గంటలు చూసి రాయడం ఏమిటి? చదవడం వస్తేనే గదా రాయాలి. చాలా విషయాలు పుస్తకాలలో ఉంటాయి. అవన్నీ చదివి అర్థం చేసుకోవాలి గదా. అప్పుడు గదా! చదువు వచ్చినట్లు అన్నది తల్లిగాడిద. "చూడండి! పిల్లలకు అవన్నీ అర్థంగాదు. బాగా చూసి రాయడం వస్తే పరీక్షల్లో రాయడం సులువు అవుతుంది" అన్నారు హెడ్మాష్టరుగారు. చిరునవ్వుతో. "ఏమిటి? పరీక్షలు కూడా చూసిరాస్తారా కొంపదీసి!" అని ఆశ్చర్యంగా అడిగింది గాడిద. అయ్యో మీరు నామాటలు అపార్థంచేసుకొన్నారు. మేము రాయడం నేర్పిస్తున్నాం గదా! మీరు ఇంటి దగ్గర బాగా చదవడం నేర్పించండి. బడిలోనే అంతా రావాలంటే కుదరదు" అన్నారు హెడ్మాష్టరు. "కొందరేమో ఇంట్లో ఏమి చెప్పవద్దు అంటారు. కొందరేమో చెప్పమంటారు. చదవడం రాకపోగా ఒక్కడే ఏవో అక్షరాలు విచిత్రంగా పలుకుతూ వాడిలో వాడే నవ్వుకొంటున్నాడు. ఏందిరా చెప్పరా అంటే చెప్పడు. నేను చాటుగా ఉండి విన్నాను. కచటతపలు పచ్చడి బద్దలు అనుకొంటూ నవ్వుకొంటున్నాడు. ఈ మాటలేమిటిరా అని అడిగా. అది యాకరణంలే అన్నాడు." అని వివరించింది గాడిద.

"యాకరణం కాదు వ్యాకరణం. అక్షరాలు శబ్దాలేగదా! ఆ శబ్దాలు మననోటిలో ఎక్కడి నుండి వస్తున్నాయో తెలుసుకొంటారు. పదాలను విడదీయడం కలపడం–సంధులు సమాసాలు ఇవన్నీ చాలా ఉంటాయి. భాష గొప్ప శాస్త్రం– ఇవన్నీ మీకు తెలియదు. అంటూ చాలా గొప్ప సంగతులు చెప్పానని" గర్వంగా ముఖం పెట్టారు హెడ్మాష్టరుగారు.

మాకు అవన్నీ తెలియకపోవచ్చు. ఒక్క విషయం మాత్రం తెలుసు. ముందు చదవడం నేర్పించండి. పసిపిల్లలకు పాండిత్యం అవసరం లేదు. పిల్లల్ని మీ పాండిత్యంతో భయపెట్టకండి. వాళ్లు పారిపోతారు అన్నది గాడిద.

దారి తప్పిన చదువులు: వచ్చేసంచికలో

కవిత

# నిజ నిర్ధారణ

ఇపుడు
ఆ నాలుగు గోడలు
ఆకాశమయ్యాయి
నిశ్శబ్దం గాలివలె ప్రవహిస్తున్నది
వాళ్ళిపుడు రెండు పక్షులుగా మారిపోయారు

ఆమె ఇన్నాళ్లు ఎన్నో ప్రశ్నలను
మోస్తున్నది
ఆ ప్రశ్నలన్నింటికి అతడు
సమాధానమవుతాడనే నమ్మకం కలిగింది

అతని ఎదపై మెల్లగా వాలి
కళ్ళలోకి చూస్తుంటే
ఆమె హృదయ అన్వేషణను అర్థం చేసుకుంటూ..
అతను తన కనురెప్పలను ఒంచుతూ
నేనున్నాను అన్నట్టుగా ధైర్యమిచ్చాడు .

అంతలో ఆమె
"నాకో సందేహం ...!!?" అన్నది

"హక్కులు అంటే ఏమిటి ..!?"
నీ అస్తిత్వం కోసం నువ్వు స్వేచ్ఛగా జీవించగలగడం ...
అవి ఇతరుల నుండి పొందేవి కావు... నీలోనే ఉండేవి .

"మరి ఆడవాళ్ళహక్కులు మగవాళ్ల అధీనంలోనే ఉంటాయా ..!?"

అతనిలో మౌనం ప్రవహిస్తున్నది.....
సిగ్గుతో తలదించుకున్నాడు

ఆమె అతని తలను ఎత్తుతూ
"మరి నేనెందుకు చదువుకోలేదు."
మగవాడు ఆధిపత్యం చలాయించేది
ఆడవాళ్ళ బతుకు పైననే కదా

కనపడని పంజరంలో
కట్టేయబడ్డ హక్కులెన్నో ...

ఇపుడు
అతను, అతను లాంటి ఎందరో
హృదయాలు వర్షిస్తున్నాయి.
ఆమె ఓదార్పు కాదు
ఆమె ఒక సానుభూతి కాదు
ఆమె ఒక నిజం
దోచుకొని దాయబడుతున్న
వెలుగులాంటి నిజం .

రామ్ పెరుమాండ్ల

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (12)



రాబర్ట్ కాల్డ్వెల్

**తె**ల్లవాళ్ళ వల్ల రాజకీయంగా మనకెన్నో అనర్థాలు వచ్చినా సాహిత్య సాంస్కృతిక సామాజిక రంగాల్లో ఎనలేని మేలు జరిగిందని ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో పేర్కొన్నాడు. నిజానికి పాశ్చాత్యుల వల్ల భాషా పరంగా, విద్యావైద్య విజ్ఞాన వికాసపరంగా ఎంతోమేలు జరిగింది. దేశపురోగమన దిశగా కొనసాగాలంటే విద్య వికాసం చెందాలి. వర్ణాంతర భేదం లేకుండా విద్యాభివృద్ధి కొనసాగాలి. అది తెల్లవాళ్ళు వచ్చాక విద్యాభివృద్ధి చెందిననదనేది అక్షరాక్షర సత్యం. విద్య వికాసం చెందిన కారణంగా భాషాభివృద్ధితోపాటు, భాష మూలాలు అన్వేషించడం కూడా జరిగింది. తెలుగుభాషకు మూలం సంస్కృతం అని విలియం కేరీ (17-8-1761 - 9-6-1834) నమ్మాడు. అదే నిజమని నిరూపించ యత్నించాడు. ఆయన రాసి రూపొందించిన Grammar of the Telinga Language -1814 లో కూడా తెలుగు సంస్కృత జన్యమనే వివరించాడు. సిరంపూరులో 1801 నుండి 1832 వరకూ 47 భారతీయ భాషల్లో ముద్రణ జరిగింది. 40 భాషలకు సంబంధించిన పోత అక్షరాలు తయారు చేసి కేరీ భారతదేశానికి సరఫరా చేశాడు. 1815 నాటికి కేరీ 7 భాషలకు వ్యాకరణాలు రచించాడు. 1. సంస్కృతం 2. చీనీ 3. బర్మా 4. బెంగాలి 5 మరాఠీ 6 పంజాబి 7. తెలుగు

తెలుగు వ్యాకరణరచనకు సుబ్బశాస్త్రి (Sooba Shastree) నాగేశ్వర శాస్త్రి (Nageshwar shastree)ల సహాయం తీసుకున్నానని తెలుగు వ్యాకరణం పీఠికలో (పుట 2) వివరించాడు. బహుశా ఆయన తెలుగు సంస్కృత జన్యమని అభిప్రాయం స్థిరపరచుకోవడానికి తెలుగు పండితుల ప్రభావం కొంత కావచ్చు. దానికితోడు తెలుగు భాషలో ఉన్న సంస్కృత పద ప్రయోగాల్లో తత్సమ, తద్భవ రూపాలవల్ల తెలుగు సంస్కృత జన్యమని నిర్ధారించడం జరిగింది. అదే చాలాకాలం వరకూ కొనసాగింది. విలియం కేరీ తన పండితుల సహాయంతో బలంగా ఏర్పరచుకున్న అభిప్రాయం నేటి వరకూ ఒక వర్గంలో అదే అభిప్రాయం కొనసాగుతుంది.

నిజానికి భాషల్లో తులనాత్మక విశ్లేషణ సాహిత్య భాషాజన్య వివరణ భాషల మూలాలను వెలికి తీసి చిలికిచేసి నకషీలు దిద్ది నిజ నిర్ధారణ గావించిన ఆధునిక భాషా విజ్ఞానం కొత్త చూపును సరికొత్త మార్గాన్ని చూపింది. ఇది ప్రాచీన తెరలను చీల్చి పటాపంచలు చేసింది. ఈ క్రమంలో పేర్కొదగిన భాషా శాస్త్రవేత్త రెవరెండ్ రాబర్ట్ కాల్డ్వెల్ (Rev. Robert Caldwell 7-5-1814-28-8-1891) దక్షిణాత్య భాషలనొక కుటుంబంగా ఏర్పరచి, వాటికి ద్రావిడ భాషలు అన్న నామకరణం చేసినవాడు రాబర్ట్ కాల్డ్వెల్ మహాశయుడు. ఆయన రాసిన A Comparative grammar of the Draidian or south Indian Family of Languages - భాషా శాస్త్రవేత్తలకు అత్యంత ప్రామాణిక గ్రంథం. ఇది అంతకు ముందున్న వాదాలను ఖండించి ద్రావిడ భాషల మూలాలను తులనాత్మకంగా వివరించి విశ్లేషించాడు.

**కాల్డ్వెల్ జీవిత రేఖలు:**

రాబర్డ్ కాల్డ్వెల్ ఐర్లండ్ తీరంలోని క్లాడి (clady) అనే గ్రామంలో 1814 మే 7న జన్మించాడు. తల్లిదండ్రులు స్కాటిస్ ప్రెస్బిటేరియన్స్ అని తెలుస్తుంది. తొమ్మిదేళ్ళ ప్రాయంలో గ్లాస్ గో నగరానికి తలిదండ్రులతో సహా వెళ్ళాడు. 15 ఏళ్ళ వయసు వచ్చేసరికి తిరిగి ఐర్లాండ్ కి వచ్చాడు. అక్కడేడబ్లిన్ కళాశాలలో చేరి ఫైన్ ఆర్ట్స్ లో చిత్రలేఖనంతోపాటు వేదాంత విద్య తులనాత్మక భాషాశాస్త్రం నేర్చుకున్నాడు. బహుభాషావేత్త గ్రీకు భాషా ఆచార్యుడయిన డేనియల్ కీట్ శాన్ఫోర్డ్ నేతృత్వంలో గ్రీకు, హిబ్రూ భాషలు నేర్చుకున్నాడు. 24 ఏళ్ళ ప్రాయంలో లండన్ మిషనరీ సొసైటీ పక్షాన జనవరి 8, 1838న మద్రాసుకు సొసైటీ ఫర్ ది ప్రాపగేషన్ ఆఫ్ ది గాస్పల్ మిషన్ (SPG) పక్షాన మిషనరీగా వచ్చాడు. కాల్డ్వెల్ భారత దేశానికి ప్రయాణం చేస్తున్నప్పుడు ఓడలో సి.పి. బ్రౌతో పరిచయం ఏర్పడింది. బ్రౌన్ పరిచయంతోనే జ్ఞానం వెల్లివిరిసింది. తెలుగు భాష తీయదనాన్ని బ్రౌన్ పరిచయం చేయడం ఒక కొత్త ఆలోచనకు తెరతీసింది. ఓడలోనే సంస్కృతం తెలుగు భాషల అధ్యయనం బ్రౌన్ సహాయంతో నేర్చుకున్నాడు. అనంతరం సంస్కృత నిఘంటువులలోని ద్రావిడ భాషా పదాలను గుర్తించడానికి ఒక అవకాశం కలిగింది. ద్రావిడ భాషల్లోని లింగ వివక్షను విశదీకరించాడు. సంస్కృత -ద్రావిడ భాషల్లోని ప్రత్యేకతను గుర్తించాడు. ఇంత శ్రమించడానికి కారణం కాల్డ్వెల్ బహుభాషా శాస్త్రవేత్త. ఆయనకు పద్దెనిమిది భాషలతో పరిచయం, తులనాత్మక భాషా విజ్ఞానం ఉంది. అదే అనంతర కాలంలో ద్రావిడ భాషల తులనాత్మక రచనా విన్యాసానికి మూలం అయింది. మద్రాసు వచ్చాక తమిళం బాగా నేర్చుకున్నాడు. ఇక్కడే తమిళంతో పాటు తెలుగు నేర్చుకున్నాడు. కాలినడకన తమిళ ప్రాంతమంతా తిరిగి ఎంతో మంది



మెరీనా బీచ్‌లోని రాబర్ట్ కాల్డ్వెల్ ప్రతిమ

స్థానిక పండితులతో పరిచయం ఏర్పరచుకున్నాడు. అక్కడే తిరువాన్నూరు మిషనరీగా పనిచేస్తున్న రెవరెండ్ చార్లెస్ మాల్ట్ (1791-1858) కుమార్తె అయిన ఎలైజా మాల్ట్ ని 1844లో వివాహం చేసుకున్నాడు. ఎలైజాకి అప్పటికే తమిళంలో మంచి ప్రావీణ్యం ఉంది. ఆమె ద్వారా భాషలోని మెలకువలు, తమిళభాషా విజ్ఞానం కొంత సేకరించాడు. కాల్వెల్ ఎలైజాల వైవాహిక జీవితంలో ఏడుగురు పిల్లల్ని కన్నారు. తిరునల్వేలి సమీపంలోని అడయంగుడి అనే ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకుని 50 ఏళ్ళు గడిపారు. ఈ కాలంలోనే తెలుగు, కన్నడం, మలయాళ భాషలను నేర్చుకుని బైబిలు అనువాద సంఘంతో కలిసి కొంత అనువాదం చేశాడు. దక్షిణ ద్రావిడ భాషల అధ్యయనం అనువాదాల ద్వారా ఏర్పడిందని చాల సందర్భాల్లో చెప్పాడు. ఆయన బహుభాషలు నేర్చిన పండితుడు కాబట్టి తెలుగు-కన్నడ భాషల సాహిత్య నిరూపణ గావించాడు. ఈ రెండు భాషల అధ్యయనంలో సాహిత్య భాషా పదాలను ప్రత్యేకంగా తయారు చేశాడు. తెలుగు, కన్నడ, తమిళ భాషా పదాలకు సంస్కృత భాషా పదాలకున్న భేద సాదృశ్యాలను వివరంగా సేకరించాడు. దీనితోపాటు తమిళం కన్నా తెలుగు భాష తీయదనాన్ని గుర్తించాడు.

"In respect of antiquity of culture and glossarial copiousness Telugu in the litirature of Dravidian idioms whilst in point of euphonic sweetness it Justly claims to occupy first place" 4.3 oulaatio వెలిబుచ్చాడు. దీనికితోడు తెలుగువారు దేశాటన స్వభావం కలవారని వారు వెళ్ళి స్థిరపడిన తర్వాతే తమిళులు తెలుగువారిని అనుసరించారని అన్నాడు. పైగా 16,17 శతాబ్దాలలో తెలుగువారు తమిళ దేశాన్ని ఆక్రమించి వాళ్ళ గడ్డపై తమ రాజ్యాన్ని స్థాపించారుగాని తమిళులు తెలుగునాట తమ రాజ్యాన్ని నెలకొల్పలేదు. దీనికి రాజరాజ నరేంద్రుడే గొప్ప ఉదాహరణగా పేర్కొవచ్చు. (11-12 శతాబ్దాల చరిత్రను ఉదాహరించవచ్చు) దీని ఫలితంగానే A Comparative Grammar of Dravidian or South Indian family of languages, (Harison London 1856)అనే తులనాత్మక ద్రావిడ భాషా వ్యాకరణ గ్రంథం రచించాడు. తొలికూర్పు 1856లోనూ, మలికూర్పు 1875లో వచ్చాయి. తరువాత తిరునల్వేలి జిల్లా చరిత్ర రాశాడు. (1881) వాటితో పాటు ధ్యానమాలై (1871) తామరై తటాకం లాంటి తమిళరచనలు మరో 15కి పైగా చారిత్రక వ్యాసాలు, చిన్న పుస్తకాలు రచించాడు. పాండ్య రాజుల చరిత్రను గ్రంథస్థం చేశాడు. ఆయన పరిశీలనలో దక్షిణ ద్రావిడ బ్రాహ్మణ వర్గానికి ఇండో యూరోపియన్ జాతుల తులనాత్మక చరిత్రను గ్రంథస్థం చేశాడు. ఆయన పాండిత్యం, సాహిత్య చారిత్రక రచనా పటిమను గుర్తించి మద్రాసు యూనివర్సిటీ సిండికేట్ సభ్యుడిగా ఆనాటి ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రతిభను గుర్తించిన దహం యూనివర్సిటి గౌరవ డాక్టరేట్ బిరుదు ప్రసాదించింది. 1877 ప్రాంతంలో కొంతకాలం తిరునల్వేలి బిషప్ గా కొనసాగి అక్కడే ఒక దేవాలయానికి అధిపతిగా ప్రార్థనలు నిర్వహించాడు.

కాల్వెల్ మతాధిపతిగా మాత్రమే కాకుండా విద్యావిషయకంగా కొంత శ్రమించాడు. తిరునల్వేలి సమీపంలోని సాయం పురం ప్రాంతంలో 1862లో ఒక పాఠశాలను ప్రారంభించాడు. అది ఉన్నత పాఠశాలగా ఎదిగే క్రమంలో తెలుగువారు కూడా ఉన్నారని ఆయా లేఖల బట్టి తెలుస్తుంది. తిరునల్వేలి జిల్లాలో కొంత తెలుగు వారి ఉనికి ఉందని ఆ పాఠశాల రికార్డులను బట్టి తెలుస్తుంది. ఈ ప్రాంతంలోనే కొన్ని వర్ణాంతర, మతాంతర వివాహాలు జరిపించాడు. ఆ ప్రాంతంలో ఉండే అవర్ణ-సవర్ణ-భేదాలు రూపు మాపడానికి కొంత కృషిచేశాడు. కాల్వెల్ తన జీవితయానమంతటిలో దక్షిణ భారత దేశంలోని భాషల సాజాత్య నిరూపణతో పాటు ప్రాంతీయ అసమానతలను, రూపుమాపే దిశగా ప్రయత్నించాడు. ఈ విధంగా చూస్తే ఆయనలో ఒక మానవతావాది కనిపిస్తాడు. తమిళనాడులోని మారుమూల గ్రామాల్లో ఉన్న పేద, బడుగు, అట్టడుగు వర్గాలవారిని ఉన్నత దిశగా నడిపించడానికి కొంత కృషి చేశాడు. ఒకవైపు భాషాపరంగా, మరోవైపు సామాజికంగా దేశంలోని అసమానతలను రూపు మాపేదిశగా ఆయన కృషి చేశాడు. అక్కడే స్థిరపడిన తెలుగువారి ఆవాసాలను గుర్తించి వారికి తమిళులకు సత్సంబంధాలను ఏర్పరచి వివాహాలు జరిపించాడు. తెలుగువారికి తమిళులకు పాఠశాలలు నెలకొల్పినట్టు తిరునల్వేలి జిల్లా చారిత్రక రికార్డులను పరిశీలిస్తే విషయాలన్నీ వెలుగులోకి వస్తాయి. కాల్వెల్ జీవితాన్ని సమగ్రంగా రచించిన గ్రంథం ఒకటి కనిపిస్తుంది. కుమార్ దాస్ రచించిన Robert caldwell A scholar missionary in colonial south India - Delhi ISpck - ISBN 978-81-7214-958 (2007) kumardoss - Y vincent అనే గ్రంథంలో వివరాలు లభిస్తాయి.

దక్షిణాది భాషలన్నీ ఒకే కుటుంబానికి చెందినవని సంస్కృత జన్యం కాదని నిరూపించిన బహుభాషా పండితుడు కాల్వెల్. 53 సంవత్సరాలు తమిళ భాషను అధ్యయనం చేశాడు. తమిళ దేశంలోనే తన జీవితయానం కొనసాగించాడు. తమిళులకు ఎనలేని సేవచేసి 1891 ఆగష్టు 28న దిండిగల్ జిల్లాలోని కొడైకెనాల్ లో కన్నుమూశాడు. కాల్వెల్ స్మృత్యర్థం తమిళనాడు ప్రభుత్వం ఒక పోస్టల్ స్టాంపుని విడుదల చేసింది. ఆయన సేవలకు గుర్తింపుగా 1967లో చెన్నై మెరీనా బీచ్ లో ఒక విగ్రహాన్ని ప్రతిష్టించి తనకు తాను గౌరవించుకుంది.

తెలుగువారితో సత్సంబంధాలు ఏర్పరచి తెలుగుభాషకు, తెలుగు సంప్రదాయాలకు, తెలుగు సంస్కృతికి పెద్ద పీటవేసిన రెవరెండ్ బిషప్ రాబర్ట్ కాల్వెల్ మహాశయుడు చిరస్మరణీయుడు. ఆయన అనుసరించిన సర్వమత సహన సంస్కృతికి, తెలుగు తమిళ భాషా విద్యావ్యాప్తికి, బహుభాషా పాండిత్యానికి పాదాభివందనం చేయడం ఉత్తమ సంస్కారం.

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# అరకులోయలో ఆదివాసీ అంతరంగం.
# 'చూసే కళ్ళకు మనసుంటే - ఆ మనసుకు కూడా కళ్ళుంటే'

**ప**నిముట్లు, విత్తనాలు, ధింసా ఆటలు, గిరిజనుల జీవితం చిత్రించే బొమ్మల కొలువులు;

ఇవి అరకులోయ మ్యూజియంలో;

చుట్టూ కాఫీ తోటలు, జలపాతాలు, బొంగుచికెన్ వంటకాలు కనిపిస్తాయి.

కానీ తెలుసుకుంటేకాని తెలియనివి, పల్లెలలో - ఏడాది పొడుగునా గిరిజనులు చేసుకునే పనిపాట్లు, కట్టుబాట్లు, రాజులు/ప్రభుత్వాలు, ప్రజల మధ్యసంబంధాలు, పండుగలు, మొక్కులు, వంటలు, కష్టసుఖాలు. వాటిలో రాగం, తానం, లయలవలె అల్లుకుపోయిన ఆటపాటలు, కథలు, సామెతలు సాహిత్యం - లెక్కలు, ఆశయాలు ఆదర్శాలు.....

అరకు, ఒడియా గిరిజన మాండలికం మాట్లాడే బగతలు, కొటియాలు, కొండదొరలు; తమ, తమ భాషలుగల కోదు(సామంత), పొరజ/జోడియా వగైరా తెగలు నివసించే బహుభాషల ప్రాంతం. అరకులోయలో జీవితకాలం గిరిజనాభివృద్ధికి పనిచేసిన కెనడా దేశీయుడు గుస్తాఫ్, ఆదివాసీ ఒడియా, తెలుగు అనువాదంతో తయారుచేసిన 'ఆదివాసీ పండుగలు'ను 1976లో పాడేరు గిరిజనాభివృద్ధి సంస్థ ప్రచురించింది. 76-82 మధ్య శక్తి శివరామకృష్ణ సేకరించిన తెలుగు గిరిజన గీతాలు' మీద, 1991లో సమత రవి ఏర్పాటుచేసిన ప్రసంగాన్ని విన్న, నాటి ప్రాజెక్ట్ అధికారి సోమేశ్ కుమార్, 200 కాపీలు కొని ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. దాన్ని పరివర్ధిత ముద్రణగా తెచ్చే ప్రయత్నంలో 2002లో పాడేరు చుట్టూ తిరుగుతున్నప్పుడు, అప్పుడు action ఎయిడ్‌లో, ఇప్పుడు అజీత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో పనిచేస్తున్న మిత్రుడు రఘుదగ్గర ఈ గుస్తాఫ్ పుస్తకం దొరికింది.

ఇదేకాక తెలుగేతర తెగఅయిన కొంధుల మీద ప్రముఖ భాషాశాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి 1960 లో అధ్యయనం చేసారు. 65లో ఈ తెగలన్నిటి మీద జనగణన, ఎథ్నోగ్రాఫిక్ నోట్స్ తో పాటు, కొండిబా, లంప్తాపుట్టు, జెర్రిల, అన్నవరం గ్రామాలమీద మోనోగ్రాఫ్‌లు ప్రచురించింది. కొండదొరల మీద రాఘవరావు 75 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. 1863, 1907 లో వచ్చిన విశాఖ డిస్ట్రిక్ట్ గజెటిర్‌లో గల అన్నిరంగాల చరిత్ర వీటన్నిటికి పునాది.

నేటి అనంతగిరి, అరకు, దుంబ్రిగూడ, పెదబయలు, ముంచెంగిపుట్ మండలాలు, హుకుం పేట మండలంలో పెదగరువుదాకా, కొండదొరలు పాలించిన ఒకనాటి ఒడిశా జయపూర్ సంస్థానంలో పాడువా తాలూకా లోనివి. స్వతంత్రం తరువాత ఈ తాలూకాలో ఈ మండలాలు ఆంధ్రప్రదేశ్ లో కలిసిపోయాయి. ఆ సంస్థానం ఆఖరి పాలకుడు విక్రమదేవవర్మ ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రోచాన్సెలర్. వారి బంధువులు కురుపాం, మేరంగి, సాలూరు, ఆంధ్ర, పాచిపెంట పాలకులు, తమ రాజ్యాలను ప్రగతి పథంలో నడిపిస్తూ, దిగువనున్న విజయనగరం, బొబ్బిలి సంస్థానాలకు పోటిగా, విశాఖనగరం అభివృద్ధి చేసారు.

ఇక్కడి ఒకనాటి కాశిపట్నం జమిందారీలోది, ఘాటీ ఎక్కుతుంటే వచ్చే, అనంతగిరి మండలంలో పుణ్యగిరి తీర్ధం/ధారలగంగమ్మ. అక్కడ గూగుల్ ఎర్త్ మ్యాప్ లో 'విరాట పర్వతం' అని ఎవరో నోట్ చేసారు. నిజమే. ఈ ప్రాంతం 14 శతాబ్దివరకు వడ్డాది రాజధానిగా పాలించిన మత్స్యరాజుల విరాట రాజ్యం. వారూ, జయపూర్ వారు బంధువులు. విరాటరాజ్యంలో అజ్ఞాత వాసం గడుపుతున్న పాండవులుగా గిరిజనులు తమను పోల్చుకుంటూ 'పంచ పాండవుల పంట-దుర్యోధనుడి వంట' అంటూ భారతకథను తమకు అనువుగా మార్చుకుని పిప్పలి, పసుపు, చిక్కుళ్ళు, అల్లం, అనాస వగైరా తాము ప్రత్యేకంగా పండించే పంటల దోపిడిని 'నందిపదం'లో పాడుకుంటారు. ఆసియా అంతా, పాండవులు, వ్యవసాయ సంస్కృతితో ముడిపడి ఉన్నారు. అలాగే ధారల గంగమ్మ, అటువంటి క్షేత్రమే పాడేరు మండలంలోమత్స్యగుండం. ఈ నీటి వనరులు ప్రపంచమంతా జలకన్యలవి, (virgins, nymphs, mermaids), క్రూరజంతువులతో నిండిన అడవులు కొండ రాజులు/దేవతలవిగా భావించి మొక్కే, మన ఆచారాల మూలాలు, గిరిజనసంస్కృతిలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

'తెలుగు గిరిజన గీతాలు'(91), పరివర్ధిత ముద్రణ 'కొండకోనల్లో తెలుగు గిరిజనులు'(2007) తెలుగు తెగల ఈ వారసత్వాన్ని, నందిపదం వంటి వారిసాహిత్యంలో వ్యవసాయ విజ్ఞానం, సంస్కృతిని సమగ్రంగా తెలియచేస్తూ అరకులోయ సంస్కృతిని కూడా అర్థం చేసుకోటానికి సహకరిస్తుంది. తెలుగు గిరిజనుల నుడికారం తెలిస్తేనే, ఇతర తెగల భాషలు మనకు బాగా తెలుస్తాయి అంటారు భద్రిరాజు కృష్ణమూర్తి.

గుస్తాఫ్ పుస్తకం గిరిజన జీవితాన్ని నెలలవారీగా వర్ణిస్తూ, మనకు తెలియని గిరిజనుల ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. సహజ వ్యవసాయ విధానం అమలు చేస్తున్న మిత్రులకోసం ఇక్కడి




వ్యవసాయ సంస్కృతిని పరిచయం చేస్తూ, ముఖ్యంగా ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్న గిరిజనులకోసం, ఈ పుస్తకాన్ని ముందు సంక్షిప్తంగా పరిచయం చేసి, క్రమంగా మిగిలిన పరిశోధనలను జోడించటం కొనసాగుతుంది.

**చైత్రం /విటిం; ఏప్రిల్-మే**

'విరాటరాజు దేశం ఇటికె పండుగలు, కాశివారి దేశం గంగ పండుగలు' అని నందిపదం'లో పాడుకునే, ఈ నెలలో చేసే ఇటుకల/వేటల పండుగ గిరిజనులకు పెద్ద పండుగ. ఈ నెలలో ఆడవాళ్లదే రాజ్యం. ప్రతి ఇంటిమగవాడు, తెల్లవారగానే ఆడవాళ్లు ఊగటానికి ఉయ్యాల కడతాడు. మగవారిని వేటకోసం కొండకు తరిమాక, ఆడవారు పాటలు పాడుతూ ఉయ్యాలలూగుతారు. ఈ పండుగకుముందు, కొండమామిడికాయలు తినరు. ఫాల్గుణం/పొగునులో హోలీ కాల్చిన రోజునుండి పాడే సంగడి ఆటపాటలు ఈ నెలతో ముగుస్తాయి. ఆటకు రానివారిదగ్గర ఆడవారు పన్ను(పెజోర్) వసూలు చేస్తారు. మఖ, కృత్తిక, చిత్త, స్వాతిః-ఇలా ఎవరికి ఏ నక్షత్రం అనుకూలమో చూసి విత్తనాలు వేసుకుంటారు.

**వైశాఖం; మే -జూన్**

ఈ నెల వేసంగిలో వర్షాలు వడగండ్లతో పడతాయట. పెళ్ళిళ్ళ కాలం. ప్రకృతి అంతా పెండ్లిలో అయిరేని/బోయ్ కుండలలాగా రంగురంగులతో నిండి ఉంటుంది. వేటలు ముగుస్తాయి. గొట్ను పండుగ చేసి, తోపహల్వా వండి, గొడు పశువులకాపు మొదలు పెడతాడు. గొట్ను అంటే భోజనంకుండ. ఈ పండుగ తరువాతే పొలంపనిచేసే వారికి భోజనం తీసుకెళ్లటం మొదలు పెడతారు. పుష్యమాసంలో నియమించుకున్న పని వాళ్ళందరికీ ఆయా పొలాలు కేటాయిస్తారు. ఇటుకల పండుగలో వసూలు చేసిన పన్ను డబ్బులతో ఆడవారు పిట్టు వండుకుంటారు.

**లండిజేట్/జ్యేష్ఠం;**

లండి/సామ పొట్టిజడలు వేస్తుంది. ఈ నెలలో పౌర్ణమి అయ్యాక సామలు చల్లరు. మెట్టుధాన్యం, చోడిలాంటి కొద్దిరోజుల పంటల గింజలు చల్లుతారు. ఆషాఢం;మేఘాలు కమ్మి వర్షాలు కురుస్తాయి. గింజలు నూర్చేటప్పుడు పంటదిగుబడి ఎక్కువగా ఉండాలని జన్ని పండుగ చేస్తారు. అడవి జంతువుల బారిన పడకుండా వచ్చిన పశువులకు నైవేద్యం పెడతాడు. సామ పంటతో పూజారి నైవేద్యం పెడతాడు.

**భాద్రపదం/ బందపని**

జాకరిమెట్టలో కొర్రపంటకు కొత్తల పండుగ చేసారు. కొత్తకుండ, కొత్తజిబ్బి, కొత్త తెడ్డులతో, తరగాయ్ దుంపలు, గుమ్మడికూర, కొత్తచింతకాయ జాకరికి పెడతారు.' లోల్లోసే అన్నవారికి లోపలొక పిల్ల, సైలోరే అన్నవారికి చంకనొక పిల్ల' లోల్లోసి/సైలోరి పాటలు మొదలుపెడతారు.

**ఓస/ఆశ్వయుజం**

పెద్ద పెద్ద వర్షాలు కురుస్తాయి. కొత్తధాన్యం అందుతుంది. పాలకులలో ఇసుకపోసి విత్తనాలు వేసి, పసుపునీళ్ళతో పెంచి మొలకెత్తాక ఆ పువ్వులను బల్లి/లక్ష్మి పువ్వులు అంటారు. ఆ పూలతో నేస్తం కట్టుకుంటారు. బల్లిపాటలు పాడతారు. ఈ నెలనుండి చలి మొదలవుతుంది. పంటలు నేలకొరిగి పరుచుకుని పోతాయి. ఓస అంటే ఒడియాలో పరుచుకొనుట అని అర్థ7o.

**దసరా**

దసరాలో దుర్గ/మెరియా పడుతుందని నమ్మకం. జంతువులు కూడేనెల. నెలపొడిచి పదిరోజులయ్యాక(దశమి) దసరా పండుగ చేస్తారు.

**దీపావళి**

పంటలన్నీ పచ్చగా పండుతుంటాయి. జలకన్యల ప్రతినిధి కప్పదేవతకు పండుగ చేస్తారు. దీపావళి నాలుగు రోజులు అన్నం పప్పు మాత్రమే తింటారు.

**మార్గశిర**

మంచు ముద్దలు ముద్దలుగా పడుతుంది. ఇళ్ళు, వాకిళ్ళు అలకటం తలంటి పోసుకోటం, లక్ష్మి దిగుతుంది. మూడురోజులు బల్లి పండుగ చేస్తారు. బల్లి నాటకాలు అడతారు.' బంగరాల బల్లి, బాలగొంతెమ్మ' అంటూ పాండవుల తల్లి కుంతిని పిలుచుకుంటారు తెలుగు గిరిజనులు

**పుష్యం/సంక్రాంతి**

దీపావళికి తలస్నానం చేసినప్పటి నుంచి మొదలైన దిమ్సా ఆటలు, పాల్గుణ పుష్యమాసాలలో ముగుస్తాయి. డప్పు, ధంకా, కిరిడి, సన్నాయి, పిల్లనగ్రోవి, జోడుకొమ్ములు వాయిద్యాల కనుగుణంగా 14 గతులలో గిరిజన జీవితాన్ని అభినయించేదే ధింసా ఆట.. ఆడవాళ్ళవి సైలోరి పాటలు, మగవాళ్ళది కోలాటం.

మాఘం

'మాఘంలో మేఘం ఫాల్గుణంలో వర్షం'. పుట్టమట్టితో ఒక నంది/ఎద్దును, దుంపలతో ఒక నందిని తయారుచేసి వాటికీ పెళ్లి చేస్తారు. బస్కి పూలతో నేస్తాలు కట్టుకుంటారు.

**ఫాల్గుణం /పొగును**

దీపావళిలో మొదలైన చలి పొగును మంటలో కాలిపోతుంది. నందిపండుగలో ఇచ్చిన విత్తనాలను హోలీ బూడిదలో వేస్తారు. హోలీ పాటలు పాడతారు. దుక్కులు మొదలు పెడతారు.

సమత టీంలో, దేవుళ్ళు సంజీవని సంస్థ, 1990 నుండి రాష్ట్రమంతటినుండి విత్తనాల జాబితా పోగుచేయిస్తున్న డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ(DDS) స్ఫూర్తితో దుంబ్రిగూడ మండలంలో ప్రారంభించిన విత్తనాల సేకరణ, పండుగలు చేయటం,

కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందింది. ఈ సొసైటీ కృషిలో సహకరించిన కామేశ్వర శర్మ, రవి విశ్వవిద్యాలయాలలో పర్యావరణ, వృక్ష శాస్త్రవేత్తలు. ఇతర శాస్త్ర వేత్తలు, సంస్థలు తమపక్కనే ఉంటూ చేసినకృషిని, అందరు శాస్త్రవేత్తలలాగే వీరుకూడా పట్టించుకోలేదు. భద్రిరాజు కృష్ణమూర్తి నాయకత్వం లో 1960 లోనే రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి రైతులనుండి సేకరించిన పదసంపదతో కూర్చిన వ్యవసాయ మాండలిక వృత్తి పదకోశంలో, 427 వడ్లరకాలు, 100 రకాల జొన్న,18 రకాల రాగి, ఆరికలు 5, కొర్ర 37, ఉలవలు 13, బొబ్బర 8, సెనగలు 8, నువ్వు 19, ఆముదాలు 7, చెరకు 2, పత్తి 12, పొగాకు 15,మిరప 10,కొబ్బరి 51,అరటి 15,నిమ్మ 8 రకాలు పేర్కొన్నారు. అయితే ఈ పదకోశంలో గిరిజనప్రాంతాల వివరాలు లేవు. దేవుళ్ళు వగైరాలు తయారు చేసిన విత్తనాల జాబితా ఈ లోటును(ఇంకా దేవుళ్ళు నుంచి ఈ జాబితా అందలేదు.) పూరిస్తుంది.

భద్రిరాజు కృష్ణమూర్తిగారి ఇల్లు, నేడు వ్యవసాయరంగంలో పనిచేస్తున్న 'వాసన్' వగైరాల మాతృసంస్థ action for world solidarity పక్కనే ఉండేది.కానీ ఆయన వ్యవసాయపదకోశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఈ పదకోశాల నిర్మాణంలో పాల్గొన్న చేకూరి రామారావు, బూదరాజు రాధాకృష్ణ పత్రికారంగంమీద విశేష కృషి చేసారు. కాని వారు ఈ రైతుల పదసంపదను పత్రికలకు గుర్తుచేయలేదు. Rural devolopment, Putting last things first (83); Farmers First (89) పుస్తకాలు రాసి, రైతును గూర్చి ముందు తెలుసుకోవాలని ఉద్బోధిస్తూ PRA విధానాలను ప్రచారం చేసిన రాబర్ట్ చాంబర్స్ తో పనిచేసిన శాస్త్రవేత్త సంఘి (మేనేజ్) ఈ సంస్థలతో సన్నిహితంగా పనిచేసేవారు. అప్పట్లో పెర్మాకల్చర్ బిల్ మోలిసన్ తో వీరందరూ ఒక కార్యశాల నిర్వహించారు. తూర్పు కనుమలలో చెదపురుగుల సమస్యగూర్చి అడిగినపుడు, చెదలున్న భూముల్లో చింత, పనసలు బాగా వస్తాయి. అవికూడా పంటలే. ప్రకృతికి ఎదురీదవద్దు అని, బిల్, హెచ్చరించారు. క్రమంగా ఈ ప్రాధాన్యతలు, పద్ధతులు మారిపోయాయి.

అత్యధిక వర్షపాతం పొందే ఈ ప్రాంతంలో కొండవాగులు, జోరెలగర్భంలో మళ్ళు కట్టి వరి పండిస్తారు. ఈ జోరెలలోనే నీటిమొక్కలు బరణి, పణగి(fern), (cycad), సైకడులు అనాదిగా పెరుగుతున్నాయి. ఈ మొక్కలు, కొండప్రాంతాలలో తీవ్రసమస్య భూమికోతను అరికడుతున్నాయి. వ్యవసాయం పెరిగినకొద్దీ నరికి వేయటంతో ఇవి అంతరించాయి. హైదరాబాద్‌లో ప్రకృతివ్యవసాయం చేస్తున్న నాగరత్నం నాయుడు, ఇటువంటి cycadలను, అడవులలో దొరికే archid పూలను పెంచి అంతర్జాతీయ మార్కెట్ లో అమ్ముతున్నారు. జీలుగుకొమ్మలను పోలిన ఈ fernను గిరిజనులు 'కన్నెజీలుగు' (జలకన్యల), నీటిమీద పరుగెత్తే pond skaterను 'గన్నికల పురుగు' అంటారు. వారి మనోప్రపంచంలో కప్ప, చేప, ఎంద్రిక మొదలైన జలచరాలు జలకన్యల ప్రతినిధులు. విశాఖ మన్యంలో అత్యున్నత శిఖరం పేరు 'ఎంద్రిక' పర్వతం.

విశాఖ గజేటిర్ జయపూర్ రాజులు, వారణాసి నుండి మాలీలను రప్పించి పూలు, పొందరలచేత కూరగాయలు, వ్యవసాయానికి అవసరమైన ఇతర వృత్తులు ప్రోత్సహించారు అని తెలియచేస్తుంది.. జేపోర్, అత్యధిక వరివంగడాలుగల ప్రాంతంగా శాస్త్రవేత్త రిచారియా 1970 లలోనే ప్రపంచానికి చాటారు. హరితవిప్లవం వ్యాప్తిలో పడి నిర్లక్ష్యం చేసిన, ఈ జన్యు సంపదను, ఆ విప్లవ పితామహుడు స్వామినాథన్ ఫౌండేషన్, ఇక్కడి 340 వరిరకాలు,వాటిలో 24 సువాసన కలవి, 27 వరద, 2 నిలవ నీళ్ళను, 1 కరువును తట్టుకునేవి. 8 రకాలు చిరు ధాన్యాలు, 9 రకాల పప్పులు, 5 నూనె గింజలు, 3 పిచు చెట్లు, 7 రకాల కూరగాయలు జాబితా ఇంతవరకు తయారు చేసింది.. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (FAO), భారతదేశంలోగల మూడు ప్రదేశాలలో ఒకటిగా, జేపోర్ వ్యవసాయవారసత్వాన్ని గుర్తించింది.

దశాబ్దాలుగా ఈ అరకులోయలో నేచర్, వికాస మొదలైన స్వచ్ఛంద సంస్థలు నాబార్డ్ మొదలైన సంస్థల విధానాలబట్టి వ్యవసాయాభివృద్ధి చేస్తూ, రైతు సంఘాలు నడిపిస్తున్నారు. మారుమూల ఉన్న సొవ్వ పంచాయితీలో పండే కూరగాయలను విశాఖలో అమ్మించటంలో దేవుళ్ళు విశేషమైన కృషి చేస్తున్నారు కాని, రవాణా ఖర్చులు పోగా మిగిలేది తక్కువ అని గిరిజనులు వాపోతున్నారు. కేరళలో ఈ మాత్రంకూడా భూములులేని గిరిజనులు ఇంటిచుట్టూ మిరియం పండించుకుని గడిస్తున్నారు. ఇక్కడ భూమికంటే అడవి ఎక్కువ. కాబట్టి అటవీ హక్కులగుర్తింపు ద్వారా అడవి కాపాడుతూ లాభం పొందే ప్రయత్నం చేయాలి, ఇందుకోసం గతంలో ధింసా గిరిజన సమాఖ్య 27 పంచాయతిలలో గల 217 అవాసాల సంప్రదాయ వనరులపటాలు తయారుచేసింది. పోడు భూముల కొలతలు తక్కువగా చూపినందుకు ఆందోళన జరిగింది.. ఆ కృషిని కొనసాగించాలి.ఆ ప్రయత్నం గ్రామసభలకు ప్రాణం పోస్తుంది. సరియైన భూమి హక్కుల నమోదు, ఆ పథకాలకు ఇచ్చే రాయితీలను పొందటంలో న్యాయం చేస్తుంది.

'వాసన్' సొవ్వ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి నిధులకోసం ప్రయత్నిస్తున్నది. గ్రామసభలతో సంబంధం లేకుండా తామే లబ్ధిదారులను ఎంచుకొని, వారి ఖాతాలో ఇంటర్ నెట్ ద్వారా పథకాల తాలూకు సొమ్ము జమచేయటం, అవి దక్కించుకోటంలో అవకతవకలు, పడేపాట్లు, లోపాలను 'నగదు బదిలీ సఫలమా, విఫలమా' వ్యాసంలో (ఆంధ్రజ్యోతి)లో విటేక్ చక్రధర్ ఎత్తిచూపారు.

సహజవ్యవసాయం ప్రకారం పేడపానకం వగైరా తయారుచేయటం గిరిజనులు నేర్చుకుంటుంటే , ఇదే సమయంలో కంపనీలు తయారు చేసిన ఈ

## ‘మౌనఘోష’ పద్మావతమ్మ ఇక లేరు.!



**రా**యలసీమ తొలితరం వచన కవయిత్రి, ప్రముఖ రచయిత్రి, సంఘసేవకురాలు పసుపులేటి పద్మావతమ్మ(76) గురువారం కన్నుమూశారు. ‘మౌనఘోష’ కవితా సంపుటి ద్వారా కవయిత్రిగా పేరుపొందారు. చేరా, పొత్తూరి వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు మౌనఘోష గురించి ప్రత్యేకంగా రాశారు. రాధా మహిళా సమాజాన్ని స్థాపించి మహిళల అభ్యున్నతికి కృషి చేశారు. సారావ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రొద్దుటూరు, కడప పట్టణాల్లో వృద్ధాశ్రమాలను నిర్వహించారు. హాస్పటల్ ద్వారా రోగులకు సేవలను అందించడమే కాక అనేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. కడపజిల్లా రెడ్ క్రాస్ జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. తన సేవలకుగానూ గవర్నర్ చేతులమీదుగా దుర్గాబాయి దేశ్ ముఖ్ అవార్డు అందుకున్నారు. పద్మావతమ్మ కొంతకాలంగా కూతురు అనురాధ వద్ద హైదరాబాద్‌లో ఉంటూ అనారోగ్యం కారణంగా గురువారం తెల్లవారుజామున మరణించారు. సాహితీవేత్తలు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి , రాధేయ, తవ్వా ఓబుల్‌రెడ్డి, పాలగిరి విశ్వప్రసాదరెడ్డి , నూకా రాంప్రసాదరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, ఎన్నెస్ ఖలందర్, ఎస్ ఆర్ ప్రతాపరెడ్డి, సిపిఐ నాయకుడు గుజ్జులఓబులేసు, ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

పోషకాలనుకూడా అధికారులు పంచుతున్నారు.సహజ వ్యవసాయంవల్ల పెట్టుబడులు తగ్గాయి కాబట్టి దిగుబడి తక్కువైనా పరవాలేదు అని గిరిజనులు అనుకుంటున్నారు..

గిరిజన సంక్షేమశాఖలో పనిచేసి, నేడు ఆ శాఖ కమిషనర్ అయిన రచయిత, వక్త వీరభద్రుడుగారు, ఇతర అధికారులు ప్రభుత్వకార్యక్రమాలలో తమ అనుభవాలతో అనేక రచనలు చేసారు.కాని వారి రచనలలో గిరిజన సంస్కృతిగుర్చి పొడి మాటలు మించి ఏమీ ఉండదు.

అటువంటి అధికారుల అధ్వర్యంలో నడిచే ‘చదువుకొత్త’ పాఠశాలలో చదివి ఉపాధ్యాయుడైన, సవర రచయిత మల్లిపురం జగదీశ్ ‘ స్వతంత్రం వచ్చిన తరువాత ఏడు దశాబ్దాలలో ,నాలుగు దశాబ్దాల గిరిజనాభివృద్ధి సంస్థల పాలనలో గిరిజనుడి పరాయీకరణ ముమ్మరమైంది. చట్టాల అమలు ప్రశ్నార్థకమైంది. అతడు లబ్దిదారుగా మారి, దరఖాస్తు దారుగా క్యూలో నుంచున్నాడు. గిరిజనసాహిత్యం అంటే ఉద్యమసాహిత్యం అనే పేరు పడిపోయింది. గిరిజన విద్యాలయాల నుండి, తన సంస్కృతి గురించి చెప్పుకోగల గిరిజన రచయిత ఎందుకు రాలేదు? (‘బహుళ’ .పెర్స్పెక్టివ్స్ ప్రచురణ 2019) అని నిలదీస్తున్నాడు.

ఇలా, ప్రజల జ్ఞానాన్ని, సంస్కృతిని పట్టించుకోకుండా, శాస్త్రవేత్తలు, అధికారులు, సంస్థలు, ఎవరిదారిది వారుగా ‘అభివృద్ధి’ చేస్తూ జనాన్ని ముష్టివాళ్ళుగా మార్చారు. వీరంతా, ఇటువంటి ప్రశ్నలే వేసుకుని, ఇప్పుడైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. సహజవ్యవసాయం ప్రచారం చేసేప్రవక్తలు, సంస్కృతి అధ్యాత్మికతలంటూ పెద్ద పెద్ద ఉపదేశాలిస్తారు. వారిలో ఒకరు, వికారాబాదులో ఈ వ్యవసాయంచేసే విజయరాంగారు , గత సంచికలో తెలియచేసినట్లు, అక్కడ చిరకాలంగా పనిచేసే DDS వలెనే, అక్కడి ప్రజలు పాడుకునే పాటలు, పండుగలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఆయన ప్రసంగాలలో అక్కడి గ్రామీణులు తలుచుకునే పాండవులు, పర్వతాల, అనుముల బ్రహ్మారెడ్డివంటి కథలు, కార్తెలు, దుక్కులు, సామెతలేవీ వినిపించవు.(జానపద గేయగాథలు) కొత్త పరిభాషను, పదజాలాన్ని, పండుగలు, యాత్రలను అలవాటు చేస్తున్నారు.

వీరభద్రుడు తన ‘నేను నడిచిన దారులు’లో, అరకులో అభివృద్ధిని అధ్యయనం చేయటానికి వచ్చిన విద్యార్థి బృందానికి, పైన చెప్పినట్లు, చుట్టూ కనిపించే విషయాలు వివరిస్తారు. గుస్తాఫ్ చేసే అభివృద్ధిని స్కేల్ అప్ చేయాల్సిన అవసరం బోధిస్తారు. కాని గుస్తాఫ్ గ్రంధస్తం చేసిన సంస్కృతి ప్రసక్తి తేలేదు..

దేవుళ్ళు క్లాస్ మేట్, నేడు కాకినాడలో




పశుసంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణగారు, తన కుమార్తె అభివృద్ధి అధ్యాయనం (devolopment studies) విద్యార్థి వైష్ణవితో, అరకులోయలోని సొవ్వలో, అనకాపల్లి వ్యవసాయశాఖవారు, పోషక సామగ్రి, పనిముట్ల పంపిణీకి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వచ్చారు. అప్పుడు వారిద్దరితో సంస్కృతిలో ఈ కనిపించని విషయాలు, చరిత్ర గుర్తు చేసే తరుణం దొరికింది. విశాఖలో దుంబ్రిగూడ మండలం సర్పంచ్‌లతో వాసన్ నిర్వహించిన సమావేశాలు, చొరవ తీసుకుని అరకులోయలో చేసిన పర్యటనలో చూసిన పరిశీలనలు, 60 ఏళ్ల అభివృద్ధి చరిత్ర నేపథ్యాన్ని కాగితంమీద పెట్టటానికి తొందర పెట్టాయి. అ

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-15

# నా అమరాపురం - హేమావతి యాత్ర

నీలకంఠాపురం. శివుడు నీలకంఠుని పేర వెలసిన గ్రామం. అనంతపురం జిల్లాలో, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ముద్దుగా ప్రకృతి నడుమ ఒదిగిన గ్రామం. ఆదిమమానవుని అడుగుజాడలు, ఆనవాళ్లకు ఆటపట్టైన గ్రామం. ప్రజల మనిషిగా, పరిపాలనా దక్షునిగా, మంత్రివర్యులుగా, పీసీసీ ప్రెసిడెంటుగా, పదవులకే వన్నెలద్దిన శ్రీ నీలకంఠాపురం రఘువీరారెడ్డిగారు పుట్టిన గ్రామం. తమపూర్వీకుల ప్రేరణతో అనేక ఆలయాలను నిర్మించి, ఆధునిక ఆధ్యాత్మిక అమరధామంలా భాసిల్లజేసిన గ్రామం. తిరుపతి శిల్పకళాశాల విద్యార్థులు, ప్రముఖ శిల్పులు, కరణం గోపాలకృష్ణ, మంజునాథుల శిల్పకళా ప్రావీణ్యంతో, నిర్మించిన రఘువీరారెడ్డిగారు అపురూప ఆలయ సముదాయమున్న గ్రామం. ఆలయ నిర్మాణ క్రమంలో, చూచిపొండని నన్ను ఆహ్వానించగా, నేను పెదారపు చెన్నారెడ్డి, వంగాల రజిత కలసి నీలకంఠాపురం వెళ్ళి, అనేక చారిత్రక ఆధారాలను వెతికి పట్టుకొన్న గ్రామం. ఆలయాలు పూర్తైన తరువాత, గ్రామం, ఆలయాల చరిత్రపై ఒక పుస్తకం రాయాలని మాజీ మంత్రిగారు నన్ను పురమాయించగా, గ్రామ పరిసరాల్లో విస్తృతంగా గాలించి ఆనవాళ్లను సేకరించటానికి గతంలో రెండుసార్లు నీలకంఠాపురంలో సందర్శించినపుడు, నాకు హైదరాబాదు నుంచి హిందూపురం దాకా రైలు ప్రయాణ ఏర్పాట్లు, హిందూపూర్ నుంచి మడకశిరలో వసతి, తిరగటానికి వాహనం, పరిసరాలపై పట్టున్న నాగేష్ అనే మిత్రుని ఇవ్వటంతో పాటు వారి ఇంట్లో, శ్రీమతి రఘువీరారెడ్డిగారి అపురూప ఆతిథ్యం, ఆప్యాయతలు తలచుకొంటే ఆనందం అవధులు దాటుతుంది.

నీలకంఠాపురం గ్రామ చరిత్ర రాయటం పూర్తైంది. ఒకసారి సమీక్ష చేద్దాం రండి అన్న రఘువీరారెడ్డిగారి ఫోన్ పలకరింపుతో మళ్లీ మడకశిర చేరుకొన్నాను. మడకశిరలో నీలకంఠాపురం వెళ్లటానికి కారెక్కుతున్న నాకు ఎదురుగా ఒక కొండ, కొండపైన కోటగోడ, బురుజులు కనిపించాయి. మడకశిరలో, సాయిబాబాగుడి పక్కనున్న 300 ఏళ్లనాటి దిగుడుమెట్ల బావి, ఆంజనేయ స్వామి దేవాలయం, కోటగుమ్మం, దానిముందున్న విజయనగరకాలపు శిథిలమైన రథం, కోటగుమ్మం దాటిన తరువాత పై కెక్కమంటున్న మెట్లు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇంతలో రఘువీరారెడ్డిగారి నుంచి ఫోను. 'మీరు హేమావతి చూశారా' అని. 'లేదుసార్' అని జవాబిచ్చిన నాకు, 'మీరు ఖచ్చితంగా హేమావతి చూచిరండి. నాగేష్ మీకు దగ్గరుండి అన్నీ చూపిస్తాడ'ని చెప్పారు.

ఇంకేముంది. కదిలే కాలు ఊరుకోదన్నట్లు కారెక్కాం. నగేష్‌గారినడిగి, పోతూపోతూ ఏవైనా చారిత్రక ప్రదేశాలు, గుళ్లు, గోపురాలు, కోటలు, శిల్పాలు, శాసనాలు ఉంటే చూద్దామన్నాను. ఆయన వృత్తిరీత్యా జర్నలిస్టు. ఆసక్తిగలవాడు. మడకశిర దాటి

వెళ్తున్నాం. రోడ్డు కిరువైపులా పంట పొలాలు. అక్కడక్కడా కొండలు, గుట్టలు. ఆహ్లాదకరంగా సాగుతున్న ప్రయాణం ఒకచోట ఆగింది. ఇదేవూరని అడిగితే, గుడిబండ అని చెప్పాడు నాగేష్. ఆగిన చోట రోడ్డు పక్కన ఒక కొండ, దాని సానువులో ఒక రాతిద్వారం, కారు దిగి ఆ ద్వారాన్ని, దానిపై నున్న నంది బొమ్మలు, కొంచెం దూరంలో ఒక వీరుని శిల్పం, ఒక అస్పష్ట శాసనం నన్ను కట్టిపడేశాయి.



గుడిబండ తోరణం



గుడిబండ కోట

చరిత్రలోకి తొంగి చూశాను. మడకశిర కోటను మరాఠీలు కట్టారు. మరి గుడి బండపైన ఇంత దూరంలో మరో కోటను ఎవరు కట్టి ఉంటారని వాకబు చేయగా, 300 ఏళ్ల క్రితం, రాహుత్తమహారాయ అనే రాజు, కొండపైన కోట, మల్లేశ్వరాలయం, ఇతర కట్టడాలను నిర్మించాడనీ, నిర్మించే కొద్దీ ఆ కోటగోడ పడిపోతుండగా, ఒక నిండు శూలాలిని బలివ్వగా, కోటగోడ పడిపోకుండా నిలిచిందనీ స్థానికులు తెలిపారు. ఏమైనా మండల కేంద్రమైన గుడిబండ చరిత్రను తెలుసుకొన్న ఆనందంతో, నేను ఎప్పట్నించో చూడాలనుకొంటున్న అమరాపురం మీదుగా హైమావతి వెళ్లొచ్చా అని అడిగితే మనం అమరాపురం మీదుగానే హేమావతి వెళ్తున్నాం అని నాగేష్ చెప్పాడు. నాకు మరింత

ఆనందం కలిగింది. కారు కదిలింది. అరగంట తరువాత ఒక ఊరు కనిపించింది. ఒకచిన్న హోటలు. నేను మాత్రం ఉగ్గాని, బజ్జీలతో కలిపి తిన్నాను. ఇదేవూరని అడిగితే అమరాపురం అనగానే, ఒకప్పటి జైన కేంద్రాన్ని చూడాలన్న తపన పెరిగింది.

అమరాపురం, నోళంబపల్లవులు, కళ్యాణ చాళుక్యుల కాలంలో ఇదొక గొప్ప జైన విద్యా కేంద్రంగా విలసిల్లింది. ఇక్కడ జైనబసదులు, శిల్పాలు, శాసనాలు ఆ విషయాన్ని నిరూపిస్తున్నాయి. అదెంత వరకు నిజమోగానీ, అమరకోశం రాసిన అమరసింహుడు ఈ వూరి వాడే నని, అతని పేరుమీదే ఈ ఊరికి ఆ పేరొచ్చిందని స్థానికులే కాదు, కొందరు పరిశోధకులు కూడా నమ్ముతున్నా, నాకెలాంటి ఆధారాలూ దొరకలేదు. కళ్యాణ చాళుక్య రెండో తైలపుడు ఇక్కడ ఒక కోటను కట్టాడని, అప్పటి నుంచి అది తైలగిరి అని పేరొచ్చిందంటారు.

అక్కడి పార్శ్వనాథజినాలయాన్ని చూద్దామని ఆశతో వెళ్లిన నాకు అలనాటి విద్యాకేంద్రం, కైవల్యధామం, ముళ్లకంపలతో నిండిపోయి క్రీ.శ.1278 నాటి ఇరుంగొండ దేవచోళుని శాసనం, చుట్టూ జైన శిల్పాలు కనిపించాయి. ఆ శాసనం ప్రకారం అక్కడొక పార్శ్వనాథ జినాలయముందేదని దానిని బ్రహ్మజినాలయ మంటారనీ, దేశిగణానికి చెందిన, చెల్లపిల్ల అనే ఒక జైన బ్రాహ్మణుడు తమిళనాడులోని



అమరాపురంలోని బ్రహ్మ జినాలయం. ప్రాంగణంలోని రాతి స్తంభాలు మరియు గుమ్మటాలు

సిద్దన్నవాసల్ నుంచి వలస వచ్చి, ఆలయ పూజారిగా ఉన్నాడు. బాలేందుమలధారి శిష్యుడైన మల్లిశెట్టి, సమీపంలోని తమ్మడహళ్లిలో 2000ల పోక చెట్లను బ్రహ్మజినాలయంలోని పార్శ్వదేవ బసదికి దానం చేసినట్లు చెప్పబడింది. బ్రాహ్మణుల్లో జైన బ్రాహ్మణులున్నట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది. రోడ్డు పక్కనే ఉన్న మరో జైన ఆలయంలో నిర్లక్ష్యంగా పడేసిన ఐదు జైన శిల్పాల్లో, నలుగురు మగజిన అనుయాయులు, ఒక వనిత, బహుశ సల్లేఖనం (ఆహారం తినకుండా మరణించనటం) పొందారేమో, వారికి జైన తీర్థంకరులు కైవల్యాన్ని ప్రసాదిస్తున్నట్లుగా ధ్యానముద్రలో నున్న తీర్థంకరుల శిల్పాలు పై భాగంలో ఉన్నాయి. ఆంధ్రదేశంలో జైనమతంపై పరిశోధనలు గావించిన బియస్ఎల్ హనుమంతరావు, ఘంటా జవహర్‌లాల్ గార్లు గుర్తుకొచ్చారు. చిక్కి శిథిలమైన పార్శ్వనాథ జినాలయంలో పార్శ్వనాథుడు లేడు. ఖాళీపీఠముంది. జిన బ్రాహ్మణులు లేరు, వారి అడుగుజాడలున్నాయి గుండె బరువెక్కింది. నిట్టూర్పులతో మళ్లీ కారెక్కాను.

మా ప్రయాణం మళ్లీ మొదలు. క్రీ.శ.10-11 శతాబ్దాల్లో ఈ ప్రాంతాన్ని పాలించిన నొళంబుల రాజధాని, హెంజేరు అని పిలువబడిన హేమావతికి. కార్లో పోతున్నానేగానీ మనసంతా, అమరాపురంలోని జీర్ణావస్థలో నున్న జైన బసది, శిల్పాలతో నిండిపోయింది. ఇంతలో హేమావతి రానే వచ్చింది. కారు దిగీదిగంగానే, ఆలయాలు, శిల్పాలు, అదొక అపురూప చారిత్రక ఉద్యానవనంలా అనిపించింది.

హేమావతిలో కేంద్రపురావస్తు శాఖ పరిరక్షణలో నున్న దొడ్డేశ్వర, సిద్ధేశ్వర, మల్లేశ్వర, విరూపాక్షేశ్వర, అక్క చెల్లెళ్ల గుడులు ముఖ్యమైనవి. ఈ ఆలయాలు, అటు పల్లవ, ఇటు చోళ వాస్తు మిశ్రమ శైలిలో నిర్మించబడినాయి. గోడలపైన కిటికీల్లోని శిల్పాలు, స్థంభాలు,



మానవ రూపంలో సిద్దేశ్వరునిగా సుఖాసనంలో కూర్చున్న శివుడు

ద్వారబంధాలు, కప్పు, దూలాలపై నగల శిల్పాలు, ఇంకా అక్కడి పురావస్తు మ్యూజియం వద్ద శిల్పాలు నోళంబ పల్లవ శిల్పుల పనితనానికి మచ్చుతునకలు. ఏ ఆలయానికి, ఆ ఆలయం ప్రత్యేకం. శివుడు మానవ రూపంలో సిద్దేశ్వరునిగా సుఖాసనంలో కూర్చుని ఉండటం, మన దేశంలోనే అరుదైన సంఘటనగా మరింత ప్రత్యేకతను సంతరించుకొంది.

హేమావతి ఆలయాల ముందు పార్కులో ప్రవేశించగా నోళంబ శైలికి పరాకాష్టగా ఉన్న నంది, శివలింగాలు, శిలాశాసన స్థంభం, ఒకప్పుడు వైభవోపేతంగా ఊరేగి శిథిలమై చతికిలబడిన కొయ్య రథపు చక్రం, రామరావణ యుద్ధం, అష్టదిక్పాలకు, తీగెలు, లతలతో అద్భుతంగా చెక్కిన స్థంభం, మరో నంది, మ్యూజియం బయట చండి, చాముండి, ఆలయ విడిభాగాలు, సప్తమాతలు, నాలుగు కాళ్ల మండపాలను, చూచి దొడ్డేశ్వరాలయంలో ప్రవేశించిన నాకు, ఆ శిల్పాలను చూచి మతిబోయింది.

ఎదురుగా మండపంలో నంది, లోపలిద్వారాలు, మహామండప స్థంభాలపైన చెక్కిన సూక్ష్మశిల్పాలు, నాకు మాట రాకుండా చేశాయి. ఆలయం బయటకొచ్చి, అన్ని ఆలయాలను, మండపాలను చూచి, ఒకసారి, నొలంబ పల్లవ మహేంద్రున్ని తలచుకొని, అలనాటి శిల్పులకు మొక్కాను. ఇంతటి అద్భుత వాస్తు శిల్పవైభవమున్న ఆలయాల గురించి, ఇది ఒకప్పటి కన్నడ – ఆంధ్ర రాజధాని అని చాలా మందికి చెప్పాల్సిన బాధ్యత నాపైనా ఉందనిపించింది.

నేను మొబైల్‌తో తీసుకోగలిగినన్ని ఫోటోలు తీసుకొని, ఆలయంలో



హేమావతి వద్ద నంది, స్తంభం



దొడ్డేశ్వరాలయం

ఒకచోట కూర్చున్నాను. ఎపుడో, సి. శివరామమూర్తిగారు మద్రాస్ మ్యూజియంలో నొలంబుల శిల్పాలపైన రాసిన పుస్తకం, మైసూరు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, ఎం.ఎస్. క్రిష్ణమూర్తి నొలంబుల మీద రాసిన పుస్తకం, బి. రాజేంద్రప్రసాద్‌గారు రాసిన ఆర్ట్ ఆఫ్ సౌత్ ఇండియా': ఆంధ్రప్రదేశ్ లోని నొలంబుల శిల్పకళపై నున్న అధ్యాయం కళ్ల ముందు కదలాడాయి. ఇంతలో రఘువీరారెడ్డిగారి నుంచి వచ్చిన ఫోన్ కాల్



హేమావతి మ్యూజియంలోని శిల్పాలు

నన్ను వెయ్యేళ్ల కాలనాళికలోంచి బయటపడేసింది.

మళ్లీ కారెక్కాను. నావయసు 67 ఏళ్లు. ఇన్నాళ్లు హేమావతి దేవాలయాలు, శిల్పాలను చూడకపోవడం నన్ను బాధించింది. ఉదయాన్నుంచి తిరిగి చూచిన చారిత్రక ఆనవాళ్లు, శాసనాల రాళ్లు చుట్టు ముట్టి ఉక్కిరిబిక్కి చేస్తున్నాయి. పాఠ్యపుస్తకాలకెక్కని చరిత్ర కనీసం పర్యాటకుల మస్తిష్కాల్లో కెక్కటానికి ఏదైనా చేయాలన్న ఆలోచనను రేకెత్తించాయి. ఇంతలో నీలకంఠాపురం చేరుకొన్నాం. (అ)


గ్రంథాలయం



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** | **శ్రీశ్రీసూక్తులు** |
| సాహిత్యం – 1 | సాహిత్యం – 2 | హేతువాదం – 1 | హేతువాదం – 2 | నాటకం, సినిమా–1 | నాటకం, సినిమా–2 | సామాజికం–1 | సామాజికం–2 |
| పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, | పుటలు: 135, |
| వెల :125/- | వెల :125/- | వెల :125/- | వెల :125/- | వెల :125/- | వెల :125/- | వెల :125/- | వెల :125/- |

కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్

ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతి నగర్, విజయవాడ–04 సెల్: 9246277375

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# తెన్నాటి తెమ్మెర




**నెల** రోజులక్రితం మిత్రులు స.వెం.రమేశ్ తిరుపతిలో జరగబోతున్న 'తెన్నాటి తెమ్మెర' అనే పుస్తకావిష్కరణకు రమ్మని పిలిచారు. తరువాత ఆ పుస్తకాన్ని నాకు పంపారు. దాన్ని చూశాక గానీ రమేశ్ పని గట్టుకుని నన్ను ఆవిష్కరణ సభకెందుకు ఆహ్వానించారో బోధపడలేదు.

'తెన్నాటి తెమ్మెర' అన్నది తెలుగువారి తమిళ కథల సంకలనం. తమిళనాడులో పుట్టి, పెరిగి, తమిళంలో కథలు రాసిన తెలుగువాళ్ళ కథలవి. 1850 ప్రాంతంలో మా ముత్తాత గారు చెంజి కోట దగ్గరి వెంకటాపురం అనే గ్రామం నుంచీ దామల్‌చెరువుకు మూడు మైళ్ల దూరంలోని రవణయ్యగారి పల్లె అనే కుగ్రామానికి వలస వచ్చివుండక పోయివుంటే, నా కథ కూడా యీ సంకలనంలో వుండి వుండేదని నాకప్పుడే తోచింది. యింతకూ మా ముత్తాత గారి ప్రయాణం అదే కాలంలో మన ప్రాంతం నుంచీ బర్మా, సింహళం, ఆఫ్రికా వంటి సుదూర ప్రాంతాలకు వలసవెళ్ళిన వాళ్ళు చేసినంత సాహసమేమీగాదు. ఆయన ఆనాటి వుత్తర ఆర్కాటు జిల్లాలోని అటు చివరి పల్లెనొ కదా ని నుంచీ యీ చివరి పల్లెకొకదానికి వలస వచ్చాడు. అయితే ఆ తరువాత జరిగిన అనేకానేక సాంఘిక రాజకీయ పరిణామాలవల్ల, ఆ పాత వుత్తర ఆర్కాటు జిల్లా రకరకాలుగా విభజనలకు గురైపోయింది. ఆ విభజనలు ఆపాత జిల్లా వాసుల జీవితాన్నెంతగానో మార్చిపారేశాయి. చిత్రమేమిటంటే ఆ మార్పుల్ని ఆ ప్రాంతపు జనాలే గమనించలేదు. పట్టించుకోలేదు. యీ విభజన వల్ల జరిగిన ఆయోమయంలో దారి తప్పిపోయాననే విషయం నాకు బాగా ఆలస్యంగా తెలిసి వచ్చింది.

వుత్తర ఆర్కాడు జిల్లాకు వేలూరు, చిత్తూరు కేంద్రాలుగా వుండేవి. యీ ప్రాంతంలో ప్రజలు తమిళమూ, తెలుగూ రెండు భాషలూ మాట్లాడగలిగే వాళ్ళు. నా చిన్నతనంలో జరిగిన పెళ్లిళ్లల్లో, ఇతర సామూహిక కార్యక్రమాల్లోనూ మా బంధు ప్రపంచంలో చాలా మంది తమిళమే మాట్లాడేవాళ్ళు. జిల్లాలో వుత్తర ప్రాంతంలో వుండే మేము యెక్కువగా తెలుగే మాట్లాడేవాళ్ళం. అప్పుడు వాళ్లు మమల్ని అదోరకమైన చిన్నచూపు చూసే వాళ్లనుకుంటాను అందువల్ల నాకు చిన్నతనం నుంచీ తమిళమంటే కోపమూ. విరోధమూ సహజంగా వచ్చేశాయి. అది పెద్ద తప్పనే విషయం కూడా నాకు బాగా ఆలస్యంగానే తెలిసింది.

మా బంధుప్రపంచంలో చాలా మంది తమిళమే మాట్లాడేవాళ్ళు. మా యింటిపేరయిన 'మధురాంతకం' అనేవూరు కంచికి 60 కిలోమీటర్ల దూరంలో చెంగల్పట్టు జిల్లాలో వుంది. అయా కారణాలవల్ల మా పూర్వీకుల మాతృభాష తమిళమేనని అనుకున్నాను. అదికూడా పొరబాటనే విషయంకూడా నాకు యింకా చాలా ఆలస్యంగా తెలిసింది.

1850 ప్రాంతాల్లో మా ముత్తాత గారిని బెంజి వెంకటాపురం నుంచీ వచ్చి తమకు పాఠాలు నేర్పమని రమణయ్యగారి పల్లె వాసులు ఆహ్వానించారని మాత్రం తెలుస్తోంది. అప్పుడాయన పాతిక యిండ్లయినా లేని ఆ పల్లెకు తెలుగుపాఠాలు చెప్పడానికే వచ్చారు. ఆనాటి బోధనలో అమరము, భారతంలోని ఆది అయిదు పర్వాలు, భాగవతం మొదలైన కావ్యాలే వుండేవి. ఆనాటి వుపాధ్యాయుడి మరో ముఖ్యమైన పని గ్రామీణులకు 'ఆట' నేర్పడం. 'ఆట' అనే ఆనాటి పరిభాషకు నేటి అర్థం నాటకం అని. అంటే గ్రామీణులకు నాటకాలు నేర్పించి, వాళ్ళ చేత ప్రదర్శనలిప్పించడమన్నమాట! బోధనలో సంగీతానికీ, నాటకాలకూ అలా ప్రముఖమైన స్థానముండడాన్ని ఆ తర్వాతి కాలంలో రవీంద్రుడి శాంతినికేతన్ లో మాత్రమే మనం గమనించవచ్చు. యిన్ని విషయాలు తెలిశాక కూడా మా ముత్తాతగారి మాతృభాష తెలుగేననే విషయం నాకు చాలాకాలం వరకూ తెలియదు.

వేలూరు 'తెలుగువాణి' కార్యనిర్వాహకులతో పరిచయంకలిగాక, హోసూరు తెలుగు మిత్రులను కలిశాక, క్రమక్రమంగా నాకు కొన్ని విషయాలు తెలియసాగాయి. అందులో ముఖ్యమైనది: వుత్తర ఆర్కాడు జిల్లా చుట్టూ వ్యాపించిన తొండనాడులో మాత్రమేగాకుండా యిప్పుడు మనం తమిళనాడని పిలుస్తున్న ప్రాంతంలోని చోళ, కొంగు, పాండెనారుల్లో కూడా, చాలా ప్రాంతాల్లోని ప్రజలకు మాతృభాష తెలుగు! కన్యాకుమారి నుంచీ మదరాసు వరకూ వున్న విశాలమైన దక్షిణ భారతదేశంలో, కేరళతో బాటూ, అనేక ప్రాంతాల్లోని ప్రజలకు తెలుగే మాతృభాష యిప్పటికీ. అంతేకాదు, తమిళమూ, తెలుగూ చేయీ చేయీ పట్టుకొని యీ ప్రాంతాల్లో సహజీవనం చేస్తూ యెదిగాయి. తమిళ తెలుగుభాషల సాహచర్యంలోంచీ గొప్ప సాహిత్యమూ, సంగీతమూ, నాట్యమూ పుట్టాయి. యీ గొప్ప సంస్కృతి మూలాలను ప్రాభావాన్నీ మనం గమనించలేదు. గుర్తించలేదు. పట్టించుకోలేదు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో గాఢమైన విభజనరేఖల్ని గీసి తెలుగు మాతృభాషగావున్న కోట్ల మందిని యిరుకున పెట్టిన ఘనత కూడా తెలుగు వాళ్లదే! **తెలుగు వాళ్ళను ఢిల్లీలో మదరాసీలంటున్నారని గుండెలు బాదుకున్న తెలుగువాళ్ళకు మదరాసు తెలుగు నగరమేననే స్పృహలేకపోవడం విడ్డూరం.** భాష పేరుతో తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే తెలుగు వాళ్ళ కేకలు విన్నాకే తమిళులకు తమ భాషనూ, సంస్కృతినీ కాపాడుకోవాలనే స్పృహవచ్చినట్టుంది. ఆ పనిలో తమిళులు కృతకృత్యులయారు. యీ ఘర్షణలో కొన్ని సత్యాలూ, నిజాలూ మసకేసిపోయాయి.

దాదాపుగా తెలుగువాళ్ళ ప్రత్యేక రాష్ట్ర వుద్యమకాలం నుంచే చాలా ప్రాంతాల్లో మాతృభాషా పరిరక్షణోద్యమాలూ మొదలయ్యాయి. బళ్ళారి, జయపూరు(వొరిస్సా), కోలారు, కోయంబత్తూరు లాంటి ప్రదేశాల్లోని తెలుగు వాళ్ళు పెద్దగా వుద్యమాలు చేయకపోయినా తమ తల్లి భాషను

మాత్రం అంటిపెట్టుకున్నారు. బయట బడుల్లో యితర భాషల్నీ చదివినా, యింట్లో మాత్రం తెలుగునే పట్టుకున్నారు. హోసూరు లాంటి ప్రదేశాల్లో తల్లి భాష వుద్యమాలు చెలరేగాయి. యింకా ఆ హోరు కొనసాగుతోంది. వేలూరులో పుట్టిన 'తెలుగువాణి' సంస్థ ప్రస్తుతపు రెండు తెలుగు రాష్ట్రాల కవతల జీవిస్తున్న తెలుగువాళ్ళకు తెలుగు నేర్పించడాన్నొక యజ్ఞంలా చేపట్టింది. యీ ప్రయాణంలో స.వెం. రమేశ్ పూనికతో వెలువడిన తొండనాడు కథలు, మెరసునాడు కథలు అనే కథాసంకలనాలు కొత్త ద్వారాల్ని తెరిచాయి. రాజకీయ ఛాయారేఖల కతీతమైన భౌగోళిక, సాంస్కృతిక భూమికల పునాదులపై వుండే సాహిత్యాన్ని, భాషాభేదాలను ఛేదించుకుని పరిశీలించాల్సిన అవసరాన్నవి గుర్తుచేశాయి. యీ గొప్ప సాంస్కృతిక పునరుజ్జీవన ప్రయాణం యిప్పుడు 'తెన్నాటి తెమ్మెర' అనే తెలుగు వాళ్ళు రాసిన తమిళకథల వరకూ వచ్చింది.

**మనమిప్పుడు 'తమిళనాడు' అని పిలుస్తున్న 'తెన్నాడు'లో కొన్ని శతాబ్దాలపాటూ తెలుగూ తమిళమూ గొప్ప సాహచర్యాన్నీ, సహజీవనాన్నీ చేశాయి. అక్కడి రాజ్యాల్ని యేలిన చాలా మంది రాజులు తెలుగువాళ్ళు. అక్కడి దేవాలయాలకూ తెలుగుకూ యెంతో సంబంధముంది. అక్కడి జనపదులందరూ తెలుగులోనే పాడతారు. తెలుగు రాజకీయ నాయకుల స్వార్థం అసమంజసమైన రాజకీయ హద్దుల్ని యేర్పాటు చేయడంతో ఆగలేదు. తమిళనాడనే ప్రభుత్వం వచ్చాక అక్కడ అధికారం చేపట్టి తెలుగునే తొక్కడానికి కంకణం కట్టుకున్న అనేక రాజకీయనాయకుల తల్లిభాష కూడా తెలుగేనని చరిత్ర చెప్పినప్పుడు విస్తుపోవడం తప్ప మరేమీ చేయలేని దుస్థితిలో మనమున్నామిప్పుడు.**

యిప్పుడొకసారి వెనుతిరిగి చూసి, అప్పుడు యిప్పుడూ తమిళంలో రాసిన రచయితలలో యెందరు తెలుగు వాళ్ళున్నారో తేల్చి చెప్పడం చాలా కష్టమైన పని. గుర్తించినా ఆసత్యాన్ని వొప్పుకునే వాళ్ళు చాలా తక్కువ మందే వుంటారు. అయితే 'తెన్నాటి తెమ్మెర' సంపాదకుడు రెండు వందల మందికి పైగా తెలుగు రాయసకాళ్ళను వెతికి పట్టుకున్నారు. వారిలోంచీ నలభై మంది రాసిన కథల్ని యెన్నుకుని వాటిని తెలుగులోకి అనువాదం చేసి యీ పెద్ద పుస్తకాన్ని తెలుగు సాహిత్య ప్రపంచానికందించారు.

తమిళ తొలి కథకుడుగా సంభావించే వ.వే.సు. అయ్యర్ దగ్గరి నుంచీ యిప్పటి వరకూ రాస్తున్న ప్రసిద్ధ కథకులలో చాలా మంది తల్లి భాష తెలుగేనని తెలిసినప్పుడు ఆశ్చర్యం కలగకమానదు. యీ జాబితాలో అణ్ణాదురై, కరుణానిధి కూడా వున్నారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారంపొందిన రాజ్ నారాయణ్ వంటి లబ్ధప్రతిష్టులూ వున్నారు. యీ కథల వరసలో మువ్వలూరు రామామృతం అమ్మయార్ పేరును చూసినప్పుడు నేను ఆశ్చర్యపడ్డాను.

1883లో తంజావురులో పుట్టిన రామామృతం అమ్మయార్ దేవదాసీల విముక్తి కోసం పోరాటం చేసిన ధీరవనితలో తొలి తరానికి చెందినవారు. ఆమె జీవితమూ, రచనలూ యిప్పటికీ గొప్ప స్ఫూర్తినిస్తాయి. పెరియార్ రామస్వామి నాయకర్‌తోనూ, దేవదాసీల విముక్తి వుద్యమం నడిపిన ముత్తులక్ష్మిరెడ్డితో బాటూ ఆమె కలిసి పోరాటం చేశారు. దేవదాసీల జీవితం గురించిన ఆమె రాసిన నవలకెంతో ప్రాముఖ్యతవుంది. **18,19 శతాబ్దాల్లో కర్ణాటక సంగీతానికి ఆలంబనగా నిలచిన వాళ్ళు దేవదాసీలయితే, దాని రాజధాని ముందు మధుర, తంజావూరు, ఆ తరువాత మదరాసు అయితే, దాని ఆధ్యాత్మిక గురువు కంచి పరమాచార్యుడయితే, దాని తల్లిభాష మాత్రం తెలుగే!** కర్ణాటక సంగీతానికీ చాలా రోజులపాటు అంటిపెట్టుకుని దాన్ని యిప్పుడున్నంతగా పెంచి పెద్ద చేసిన తమిళుల సహృదయతను మనమెప్పుడూ మరచిపోగూడదు(నేనిటీవల రాసిన 'మనోధర్మ పరాగం' నవలలోని వొక పాత్రకు రామామృతం అమ్మయార్ జీవితమే మూలం).

భారతదేశపు సామాజిక చరిత్రను పునర్నిర్మించుకోడానికి ప్రయత్నించి నప్పుడల్లా మతం, కులం ప్రసక్తి రాకుండా పోదు. శ్రమ విభజన ఆధారంగా మానవ నాగరికత తొలినాళ్ళలో పుట్టిన చాతుర్వర్ణ వ్యవస్థ, తరువాతి కాలంలో యెన్ని దుర్మార్గపు పోకడలు పోయిందో చరిత్ర స్పష్టం చూపెడుతూనే వుంది. అలాగే ప్రకృతికీ మానవుడికీ మధ్య వుండే సంబంధాన్ని మార్మికంగా మాత్రం అర్థం చేసుకోవడమనే గత్యంతరం లేని స్థితిలోంచీ పుట్టిన మతం ప్రపంచవ్యాప్తంగా యెన్ని సంకుచిత్వాలకు మూలమై కూర్చుందో మనకు తెలుసు. తెన్నాడులోని తెలుగు వాళ్ళకోసం వెదికినప్పుడు కులాల గురించి తరచిచూడక తప్పదు.

తెన్నాడులో తెలుగు కథలు రాసిన వాళ్ళల్లో అన్ని కులాలవాళ్ళూ వున్నారు. గుడులూ గోపురాల చుట్టూ బతికిన బ్రాహ్మణులూ, దేవదాసీలూ, వ్యవసాయిక కుటుంబాలకు చెందిన రెడ్లూ, నాయుళ్ళూ, పల్లువర్లూ శ్రమజీవనులైన దళితులు (ముఖ్యంగా మాదిగవాళ్ళు) యీ రచనలు చేసినవాళ్ళల్లో ముఖ్యులు. నాగర్‌కోయిల్, తిరుచినాపల్లి ప్రాంతాల్లో రెడ్లూ, ట్యుటికురాన్, కోయంబత్తూర్లల్లో నాయుళ్లూ, మొత్తం తెన్నాడంతా మాదిగులూ ఇప్పటికీ ఇళ్లలో తెలుగే మాట్లాడతారు. యీ పుస్తకంలో చేర్చిన రచయితల కులాల్నీ, యింటిపేర్లనూ, వీలయితే గోత్రాలనూ కూడా అక్షరబద్ధం చేయడానికి సంపాదకుడెంతో కృషి చేశారు. కులాతీత మతాతీత లౌకిక సామ్యవాదాన్నే అందరూ కోరుకోవలసి వుంది. అయితే చరిత్రను తవ్వినప్పుడు జరిగిందేమిటో తేల్చుకోవాలనుకున్నప్పుడు యీ రకమైన అధ్యయనం తప్పదు.

మొత్తం నలభై కథలను వొక చేత్తో స.వెం.రమేశ్ తెలుగులోకి అనువాదం చేశారు. ఆయన చేస్తున్న భాషోద్యమంలో యిదొక పెద్ద పూనిక. పైగా నూటికి తొంభై శాతం అచ్చ తెలుగుపదాలే వాడారు. అందుకే యీ పుస్తకం చదువుతున్నప్పుడు యిప్పటి పాఠకులకు అరుగడుగునా తెలియని మాటలే యెదురౌతాయి. అనువాదకుడు ఆ పదాల నేటి అర్థాలను తెలియజెప్పే చిన్న నిఘంటువును కూడా యివ్వాల్సి వచ్చింది. తెలుగుభాష ప్రత్యేకతనూ, విశిష్టతనూ తెలియజేయడం కోసమే సంపాదకుడీ పని పని గట్టుకుని చేశారని సహృదయ పాఠకులందరూ గుర్తించాలి.

'తెన్నాటి తెమ్మెర'లోని కథకులందరూ తమిళంలో రాసిన తెలుగువాళ్ళు. దీని సంపాదకుడు తెన్నాడులో పుట్టిన తెలుగువాడు. దీన్ని ప్రచురించిన వాళ్ళు అమెరికా కెళ్ళిపోయిన తెలుగు వాళ్ళు (డెట్రాయిట్ తెలుగు సాహితీ సమితి, కేంటన్, మిషిగన్). యిప్పుడు ప్రపంచంలో వున్న దాదాపు పజ్జెనిమిది కోట్ల తెలుగువాళ్లల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు బయటవున్న తెలుగువాళ్ళందరూ దాదాపు మాతృభాషోద్యమంలో వున్నరనడానికివే బలమైన సాక్ష్యాలు. యిప్పుడీ రెండు తెలుగు రాష్ట్రాల్లోపల వున్న తెలుగువాళ్ళేం చేస్తారో, యెలా స్పందిస్తారో, యెలా ముందుకువెళ్తారో వేచిచూడాలి.

సడ్లపల్లె చిదంబరరెడ్డి
94400 73636

# నల్లేరుపై నడక !

## (సామెత వివరణ)

**ప్రతి** భాషలోనూ సామెతలు, పలుకుబళ్లు, నానుడులు, పొడుపుకథలు, పోలికలు వంటివి ఉండి ఆయా భాషల పదసంపదగా చలామణీ అవుతుంటాయి. అవి ఇప్పటికిప్పుడు కవిత్వంలోని కొత్తపదాల్లాగా తయారయినవి కావు. కొన్ని వందల వేల యేళ్ల నుండి అప్పటి ప్రజల అనుభవాలతో వాడుకకు వచ్చినవి.

అది అలా ఉంచి ఇప్పుడు 'నల్లేరు పై నడక, నల్లేరు పై బండి నడక' అనే పలుకుబడి గురించి చెప్పదలిచాను. దీని గురించి ముఖపుస్తకంలో గత రెండు మూడు నెలల నుంచీ వివరిస్తూనే ఉన్నాను. **17.1.2022 నాడు "సాక్షి" దినపత్రికలో వాటినే ముఖ్యాంశాలుగా చేసుకొని "పలుకుబడి" అనే శీర్షికతో సంపాదకీయం** రాస్తూ నల్లేరు పై నడక అంటే ....." ఇసుకలో నడవడం కష్టం. అలా కాక ఆ ఇసుక మీద అక్కడక్కడ పరుచుకొన్న నల్లేరు గుబుర్ల మీద అడుగులు వేస్తూ సులభంగా సాగిపోవచ్చు..."అని రాశారు.

ఈ సామెత గురించి చాలా మంది ఇలాగే వివరిస్తూ ఉన్నారు. అలాగని ఎక్కడైనా పుస్తకంలో రాసిపెట్టి ఉన్నారేమో!? నాకైతే తెలియదు.

**ఇప్పుడు ఎవరైనా 60/70 యేళ్లు పైబడి నదులకు అడ్డంగా ప్రాజెక్టులు కట్టని, కరెంటు అందుబాటుకు రాని కాలంలో నదీ తీరాల గ్రామాల్లో ఉంటూ వ్యవసాయం చేసి ఉంటే దీనికి అర్థం తెలుస్తుంది. అలాకాక ఇప్పుడు కనిపించే సమాజ చిత్రాన్ని చూసి చెబితే పత్రికలో చెప్పినట్లు చాలా కృత్రిమంగా ఉంటుంది.**

వందల వేల సంవత్సరాల నాడు ఇప్పటిలా ఒక చోటు నుండి ఇంకొక చోటుకు వెళ్లడానికి కంకర, తారు, సిమెంటు బాటలు లేవు. అన్నీ మట్టి బాటలే. ప్రయాణ సాధనాలు బళ్లు లేక కాలినడక మాత్రమే!! ఆ బాటల మట్టి రాకపోకల వల్ల మెత్తబడేది. మరలా వానల కాలంలో విపరీతంగా వానలు పడితే ఆ మట్టిబాటలు నీరు ప్రవహించి చిన్న వంకలుగా మారిపోయేవి. వానలు ఆగి భూమి ఎండిన తరువాత గత బాటకు సమాంతరంగా మరో దారిని వాడుక చేసుకోవాల్సిందే!! 1952లో పల్లెల్లో పుట్టి అక్కడే పెరిగిన నేను నా కళ్లతో చూసి చెబుతున్న నగ్నసత్యం ఇది.

ఇక **"నల్లేరు" అన్నది ఇప్పుడు అందరూ అనుకొనే తీగమొక్క కాదు. అది నల్ల నీళ్ల ఏరు....వాడుకలో నల్లేరు అనే పలుకుబడి అయ్యింది.**

కాదు అది "నల్లేరు అనే గుబురు తీగకు సంబంధించినదే" అని వాదించే వారికి......నా ప్రశ్న ఏమిటంటే....ఏటిలో మనిషి నడిచే, బండి వెళ్లే సమయాల్లో ఆ తీగ మాత్రమే నడకను సులభతరం చేస్తుందా!! వేరే ఏ మొక్కలూ ఉండవా!! పలుకుబడిని పుస్తకాల్లో వదిలి ఏటి అంచులకు వెళ్లి మీరెవరైనా చూశారా??

చూడకుండా గుడ్డిగా వాదించకూడదు. చాలామంది ఆ పనే చేస్తుంటారు. ఎవరో రాసిన ఆధారాలు చూపుతుంటారు. అలా రాసినవారికి నాదొక్కటే సమాధానం, మీ ఊహలూ వివరణా తప్పని.

ముందే చెప్పినట్లు రాకపోకల రవాణా మార్గాలు లేని పురా కాలంలో వానా కాలంలో దండిగా వానలు కురిస్తే వాగులు వంకలూ నిండి ఏటిలో చేరేవి. వానాకాలానికి ముందు మట్టి ఎండి ఉంటుంది.వ్యవసాయం కోసం భూమిని దున్నడంతో అది వదులై ఉంటుంది. కాబట్టి ఆ మన్ను మొత్తం వాన నీటిలో చేరడం వల్ల నదులు వాగుల్లో ప్రవహించే నీరు ఎర్రగా ఉంటుంది. ఆ ఎర్ర నీళ్ల వేగం ఉధృతికి ఏటి అడుగు, మలుపులు, గట్లు కోతకు గురి అయి గతం లోని ఆకారాన్ని కోల్పోయి ఉంటుంది.

(ఇప్పుడు మనం వరదలు అంటాం కదా. అలా వరదలప్పుడు మనం ఆధునికంగా నదుల మీద కట్టుకొన్న వంతెనలపై కూడా నీరు ప్రవహిస్తే మన పెద్ద వాహనాలుకూడా దిగలేని పరిస్థితి మనకు తెలుసు.)

అటువంటి ఎర్రెర్రని ఏటి ప్రవాహంలో మనిషి కానీ, బండి కానీ దిగదు. ఎక్కడ ఎంత లోతు నీరు ఉందో ఏరు ఏ వైపుకు కోసుకు పోయి దిశ మార్చుకొందో తెలియదు. ఎక్కడివక్కడ బంద్.

కొన్ని రోజులకు వానల రాకడ తగ్గిన తరువాత ప్రవహించే నీరు కొంత తేరుకొని పాల లాగా తెలుపు రంగుకు మారుతుంది. అప్పుడుకూడా సరిగా ఏటి నీటి అంతు చిక్కదు. మరికొన్నాళ్లకు ఒందు పూర్తిగా తేరుకొని నీరు నల్లబడుతుంది.(ప్రజల అర్థంలో ఇక్కడ "నల్ల" అంటే నలుపురంగు కాదు. transferent అని) దానినే నల్ల నీళ్ల యేరు నల్లేరు అని అంటారు. ఈ నల్లేటిని దాటాలన్నా, దాని వెంబడి పోవాలన్నా భయం ఉండదు సాఫీగా సాగుతుంది. కారణం తేటబడిన నల్లని నీటిలో ఎక్కడ ఎంత లోతు ఉందో, ప్రవాహం ఎక్కడ కోత కోసిందో తెలుస్తుంది. దీనినే నల్లేరు మీద నడక, నల్లేరు మీది బండినడక అంటారు.

మాది పెన్నేటి గట్టులోని వ్యవసాయిక గ్రామం. నంది కొండల వాలుల్లో పుట్టిన పెన్నానది దాదాపు 60/70 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుతుంది. 1960 (దాదాపు) దాకా ఇక్కడా వ్యవసాయం చేశాము. తరువాత నది మొదలయ్యే కర్నాటకలో దాని ఒడ్డునే కాపురం ఉండి వ్యవసాయం చేసిన అనుభవం నాది. అక్కడి నుంచి ఇక్కడి దాకా ఏటికి రెండు వైపులా దాదాపు 20 నుండి 30 గ్రామాలు ఉంటాయి. అన్ని గ్రామాల భూములకూ పెన్నేటి నుండి ఊటనీటి కాలువలు ఉన్నాయి (కరెంటు లేని కాలంలో ఉండి మరలా పూడి పోయేవి) వాటిని అన్ని పల్లెల వారూ నల్లేరు కాలువలే అని వ్యవహరిస్తారు.

వానల వల్ల ఏరు పొంగి ఈ నల్లేరు కాలువల్లో ఇసుక మేట వేసేది. ఏటి ప్రవాహం తగ్గిన తరువాత ఆ కాలువకింద సాగుచేసే వారు ఇంటికి ఒకరు వెళ్లి నల్లేరు కాలువ పూడిక తీయాలి. అంతే కాక ఇసుక ఒడిసిపట్టుకొన్న నీరు నల్లేరు(నల్ల నీళ్ల) కాలువద్వారా పొలాలసాగుకు వెళుతూ ఊట తగ్గిపోతూ ఉంటుంది. దాని జతకు పగలంతా మేతకు వెళ్ళిన పశువులు తొక్కి కాలువ పూడిపోతూ ఉంటుంది. అందుకే ప్రతి రోజూ ఉదయం ఐదు గంటలకే ప్రతి ఇంటి

**తరువాయి 47వ పుటలో....**

జోన్ జాండాయ్
తెలుగుసేత: అన్వర్
95539 55791

# జీవించడం సులభం! కష్టతరం ఎందుకు చేసుకొంటున్నాం?

**తె**లుసుకున్న కొద్దీ జీవితాన్నిమరింత సంతోషంలో ముంచెత్తే సాధారణ జీవన దూత జోన్ జాండాయ్. ఈయన ఒక రైతు, థాయ్‌లాండ్‌లో కెల్లా అత్యంత సంతోషకరమైన వ్యక్తి గా ప్రపంచం ఈయనను తెలుసుకుంది. జోన్ జాండాయ్ థాయ్‌లాండ్‌లోని యాసోథార్న్ రాష్ట్రానికి చెందినవారు. ఈయన వ్యవసాయం చేస్తారు. ఇంకా మట్టి గృహాలను నిర్మిస్తారు. 2003 లో పన్ పన్ అనే విత్తన సంరక్షణ సంస్థను స్థాపించారు. జోన్ జాండాయ్ చేసిన ఒక ప్రసంగ పాఠాన్ని విని ఎంత సంతోషపడ్డానో మాటల్లో చెప్పలేక ఈ ఆనందాన్ని నలుగురితో పంచుకోడానికి చేసిన ఒక ప్రయత్నమే ఈ వ్యాస రూపం. నమస్కారం. –అన్వర్

**జీ**వితంలో నేను నేర్చుకున్నది, తెలుసుకున్నది, ఎప్పటికీ చెప్పగలిగేది ఒకే ఒక మాట ఉంది. అది ఏమిటంటే "Life Is Simple". అవును జీవితం అత్యంత సులభమైనది, సరదా అయినది. "జీవితం సులభం" అనే సులభతరమైన విషయం తెలుసుకోవడం మాత్రం నాకు అంత సులభంగా జరగలేదు. నేను ఇంతకుమునుపు బ్యాంకాక్‌లో ఉండేవాడిని, అక్కడ ఉన్నప్పుడు నా జీవితం చాలా కష్టంగా, చాలా చాలా సంక్లిష్టంగా ఉండేది. "జీవితం సులభం" అనే విషయం గురించి నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఆలోచించలేదు, ఆలోచించడానికి సమయం కూడా నాకు అప్పుడు లేదు.

నా పేరు జోన్ జండాయ్. నేను ఈశాన్య థాయ్‌లాండ్ ప్రాంతంలోని ఒక చిన్నగ్రామంలో జన్మించాను. నా చిన్నప్పుడు మా ఊరు, ఆ వాతావరణం, గాలి, మాట, వెలుతురు, పలకరింపు... ప్రతీది సరదాగా, సులభంగా ఉండేది. అప్పుడు జీవితం సహజంగా ఉండేది కాబట్టి జీవితం అనేది సులభం అనే ఎరుక నాకు అప్పుడు లేదు. అత్యంత సహజమైన మానవ జీవితపు లక్షణాలు ఎప్పుడూ ప్రత్యేక ఎరుక అయి ఉండవు కదా. ఒక రోజు మా ఊరికి టెలివిజన్ వచ్చింది. ఆ టీవీతో పాటు దానికి తీసుకు వచ్చిన పట్నవాసపు మనుషులూ వచ్చారు. ఆ యంత్రం, దానిని నడిపేవారు ఇద్దరూ కలిసి మాకు మునుపు తెలియని, ఆలోచించని, అసలు ఆ జ్ఞానమేలేని ఒక కొత్త మాట మాకు నేర్పారు " ఒరే! నాయనా మీరు మీరు కడు పేదవారు, కటిక దరిద్రులు. మీ జీవితాంతం వరకు మీరు ఇలా దరిద్రపు గొట్టుగా ఉండనక్కర లేదు. మీరు మేల్కోవాలి. మీ జీవితంలో విజయాన్ని వెంబడించాలి, విజయం యొక్క అయిదు మెట్లు ఎక్కాలి. ఆ అయిదు మెట్లు ఎక్కడానికి మీరు బ్యాంకాక్ వెళ్లాలి" అని చెప్పారు. (నేను మా నూనెపల్లె నుండి హైద్రాబాద్ వరకు దేకినట్లు అన్నమాట.) కాబట్టి నేను బ్యాంకాక్ వచ్చాను, నేను కడు దరిద్రుడిని అని తెలుసుకోడం నాకు ఎంతో చెడుగా అనిపించింది. నేను కటిక పేదరికం వాడిని అని తెలుసుకోడం నా మనసుకు భరించరాని కష్టం వేసింది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నేను బ్యాంకాక్‌కు వెళ్లాలి విజయం సాధించాలి. నేను బ్యాంకాక్‌కి వెళ్ళాలని నిర్ణయించుకోవడం . అక్కడికి చేరుకోవడం అప్పుడు నాకు చాలా గొప్పగా , గర్వంగా ఉండింది.

మనం చాలా నేర్చుకోవాలి, గొప్ప చదువు చదువుకోవాలి మరియు చాలా కష్టపడాలి. అలా చేస్తూ ఉంటే ఆ పై మీరు విజయం సాధించవచ్చు అనే మాటలు పదే పదే నా చెవుల్లో ధ్వనించే నిత్య మంత్రాలు అయ్యాయి. అందుకని నేను చాలా కష్టపడటం ప్రారంభించాను , రోజుకు ఎనిమిది గంటలు నిరంతరాయంగా పని చేస్తూనే ఉండేవాడిని. అంత కష్టపడి పని చేసి చివరికి నేను భోజనానికి సంపాదించుకున్నది కేవలం ఒక కప్పు నూడుల్స్ మాత్రమే. లేదా గిన్నెడు ఫ్రైడ్ రైస్. ఇంకా బ్యాంకాగ్ లో నేను నివసించిన గది ఎలా ఉండేది అనుకున్నారు! అది చాల చెడ్డగా ఉండేది, మహా మురిగ్గా ఉండేది, భరించలేనంత వేడిగా ఉండేది . ఆ వేడితోపాటు నాతో పాటు ఆ గది పంచుకుని ఉన్న చాలా మంది ఊపిరి వేడి . ఇటువంటి పరిస్తితుల మధ్య నేను ఇంకా చాలా తీవ్రంగా కష్టపడటం మొదలుపెట్టాను. నాకు అప్పుడు ఓ అనుమానం కలిగింది. కష్టపడి పని చేయడం అనే సూత్రం వెనుక ఏదో తేడా ఉందని నాకు అనిపించింది. నేను ఇంత కష్టపడి పనిచేస్తూ పోతున్న కొద్దీ నా జీవితం సులువు కావాలి కదా! కానీ ఇంకా ఎందుకు కష్టతరమవుతుంది? గిన్నెడు అన్నం, కాళ్ళు చాపుకోడానికి తగినంత స్థలం లేని గదే ప్రాప్తం అవుతున్నది ఎందుకని? కాబట్టి ఎక్కడో ఏదో తప్పుగా ఉండాలి. ఎందుకంటే నేను కష్టపడి పనిచేసి చాలా వస్తువులను ఉత్పత్తి చేస్తున్నాను కానీ నేను వాటిని నా వినియోగం కోసం పొందలేను. నేను సంపాదించే డబ్బుతో అవేమి కొనగలిగే శక్తి నాకు సమకూరడం లేదు. ఒక్క వళ్ళు వంచి పని చెయ్యడమే కాదు, నేను బుర్రా ఉపయోగించి చదువు, జ్ఞానం నేర్చుకోవడానికి ప్రయత్నించాను. విద్యని అధ్యయనం చేయడానికి ప్రయత్నించాను. నేను యూనివర్సిటీలో చదువుకోవడానికి బయలుదేరాను. కానీ యూనివర్సిటీలో నేర్చుకోవడం చాలా కష్టం, ఎందుకంటే చదువుకోవడం అనే పనిని విద్యాలయాలు చాలా విసుగుపుట్టించేదిగా చేసి పెట్టాయి. నేను ఇక్కడ ఈ చదువుల భవనాల్లోని ప్రతి అధ్యాపకుడిలోను, వారు విశ్వవిద్యాలయంలో బోధించే విషయాలను చూసినప్పుడు, వారిలో చాలామందికి **ఉన్నదంతా విధ్వంసక జ్ఞానం.** నాకు యూనివర్సిటీలో **ఉత్పాదక జ్ఞానం అసలు దొరకలేదు.**

**ఒక ఆర్కిటెక్ట్ లేదా ఇంజినీర్ కావడం అంటే అర్థం ఏమిటంటే, మీరు ఈ భూమిని, ఈ సహజ సంపదని మరింత, వీలయినంత మరింత ఎక్కువ నాశనం చేసేవారిగా తయారు కావడం .** ఈ విధ్వంసక వాస్తువేత్త వ్యక్తులు ఎంత ఎక్కువ తయారు అయితే వారు అంత ఎక్కువ

పనిచేసి ఈ భూమి మీది పర్వతాలు, నదులు, అడవులను మరింత నాశనం చేయడమే అన్నమాటే. ఈ పచ్చదనాన్ని, ఈ సహజవర్ణాలని తమ బూడిదరంగు మెదడులన్నుండి బయటికి తీసిన జ్ఞానంతో కొలతలు వేసి ఈ ప్రపంచమంతా కాంక్రీట్ నింపడం. కనుచూపు మేర అంతా బూడిద రంగు, బూడిద రంగు బిల్డింగులు, బూడిద రంగు రోడ్లు, బూడిదరంగు ఆకాశం, బూడిద రంగు జ్ఞానం... భూమికి బూడిదరంగు కట్టడపుపన్ను, చెరువులోని నీటికి ఇంటి ట్యాంకర్‌లలో బంధించిన పన్ను. వ్యవసాయానికి పురుగుమందుల విషపుపన్ను.

జీవితం చాలా కష్టంగా ఉంది. నేను నిరాశకు గురయ్యాను. నేను ఆలోచించడం మొదలుపెట్టాను, నేను అసలు బ్యాంకాక్‌లో ఎందుకు ఉండాలి? నా చిన్నప్పుడు మా పల్లెలో ఎవరూ రోజుకి ఎనిమిది గంటలు పని చేయడం నేను ఎప్పుడూ చూడలేదు అక్కడ ప్రతి ఒక్కరూ రోజుకు రెండు గంటలు, సంవత్సరానికి కేవలం రెండు నెలలు పనిచేశారు, ఒక నెలలో వరినాట్లు నాటడం, మరో నెలలో వరి కోయడం అనేదే పని. మిగిలినది అంతా ఖాళీ సమయం, పది నెలల ఖాళీ సమయం. అందుకే మా థాయ్‌లాండ్‌లో ప్రజలకు చాలా పండుగలు ఉన్నాయి. ప్రతి నెలా మాకు ఒక పండుగ ఉంటుంది. ఎందుకంటే జీవితం గడపడానికి, జీవితాన్ని పండగ చేసుకొడానికి అక్కడ చాలా ఖాళీ సమయం ఉంది. జీవితం పండగ కావడం కన్నా జీవితం మరింకేం కోరుకుంటుంది?

అక్కడ రాత్రి పూటే కాదు మధ్యాహ్నపు భోజనం ముగించి ప్రతి ఒక్కరూ కూడా నిద్రపోతారు.( మా నూనెపల్లెలో వర్షాలుపడే రాత్రిళ్ళు తప్పస్తే, మేము ఎప్పుడూ ఇంటి గోడల మధ్యనో, తడికల మధ్యనో నిద్రపోయిందేలేదు. నిద్ర అంటే అంతా మా ఊరి రోడ్ల మీదే , రాత్రుళ్లు మా ఊరి దారులన్నీ మంచాలు మొలిచిన పొలాల్లా ఉండేవి. ఇంటర్మీడియట్ పరీక్షలప్పుడు అయితే అర్ధరాత్రి ఊరి సెంటర్‌లో టీ తాగడానికి అని పోతూపోతూ తన ఇంటి రోడ్డు ముందు నిద్రపోతున్న మనిషిని మంచంతో సహాలేపుకు వెళ్ళి మరో ఇంటిముందు దింపేవాళ్ళం, కొంటెగా . ఆ ఇంటి ముసలమ్మ మా ఇంటి ముసలమ్మతో రాత్రంతా కబుర్లు చెప్పుకోడానికి మనవడితో మంచం మోపించుకు వచ్చి ఈ మంచం పక్కన ఆ మంచం కుదిర్చి చక్కగా కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయేవారు. పిల్లలూ అంతే చంకలో దుప్పటి దిండు పెట్టుకుని పక్కింటి నేస్తుడితో మహామహా ముచ్చట్లు ఆడటం లేదా రేడియోలో సంక్షిప్త శబ్దచిత్రం వింటూ అక్కడే బజ్జోడం. అర్ధరాత్రిదాటాకా మనుషులు, మంచాలేకాదు మాఊరి రహదారులూ, జట్కాబళ్ళు, సైకిల్ రిక్షాలు అన్నీ నిద్రపోయేవి. కేవలం కీచురాళ్ళ చప్పుడు, లేదా అప్పుడప్పుడు కప్పల బెకబెకలు. ఇప్పుడు రోడ్డులకు అసలు నిద్రలేదు. రోజుకు ఇరవైనాలుగు గంటలు ఏదో ఒక బండి గాను వాటిని తొక్కుతూనే పోతుంటాయి, హారన్లు రోడ్డులను దోమల్లా కుడుతూనే ఉంటాయి).

మధ్యాహ్న భోజనానంతర నిద్ర మేల్కొన్న తర్వాత హాయిగా మేం వీధి అరుగుల పై కూచుని కేవలం కబుర్లు చెప్పుకుంటాం, ముచ్చట్లు ఆడుకుంటాం. దారినపోయే అందరి యోగక్షేమాలు విచారిస్తాం "ఏం బ్బా! మీ అల్లుడు ఎలా ఉన్నాడు, మీ భార్య, కోడలు ఎలా ఉన్నారు, మీ కోడి, మేకా ఎలాఉన్నాయి" ఊళ్ళో జనాలకు ఏం ఉన్నా లేకపోయినా చాలా సమయం ఉండేది, వారికి తమతో తాము ఉండటానికి సమయం ఉంది, తమతో తాము ఉండటానికి సమయం ఉన్నప్పుడు మనిషికి తనను తాను అర్థం చేసుకోడానికి సమయం ఉంటుంది. ప్రజలు తమను తాము అర్థం చేసుకున్నప్పుడు వారు తమ జీవితంలో ఏమి కోరుకుంటున్నారో సులభంగా, స్పష్టం గా గ్రహించగలరు.

చాలా మంది ప్రజలు తమకు ఆనందం కావాలి, ప్రేమ కావాలి, తమ జీవితాలను హాయిగా సంపూర్ణంగా ఆస్వాదించాలని కోరుకుంటారు, తీరిక, తీరుబడి ఉన్న ప్రజలు తమ జీవితంలో చాలా అందాలను చూస్తారు, కాబట్టి వారు ఆ అందాన్ని అనేక విధాలుగా వ్యక్తం చేసేవారు. కొంతమంది హాయిగా ఇంటి బయట కూచుని తమ కత్తిపిడిని నునుపుచేసుకునే వారు, వాటిపై బొమ్మలు చెక్కేవారు, బుట్టా, గంప చక్కగా అల్లుకునేవారు, తడికలకు, చాటలకు కాగితపు గుజ్జు పసుపు అలికేవారు కానీ ఇప్పుడు ఎవరూ అలా చేయడంలేదు. ప్రజలు ప్రతి చోటా ప్లాస్టిక్‌ని ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ పీలుస్తున్నారు. కాబట్టి ఇప్పుడు నడుస్తున్న ఈ జీవితంలో ఏదోతప్పు ఉన్నట్లు నాకు అనిపిస్తోంది, నేను ఈ విధంగా జీవించలేను కాబట్టి నేను యూనివర్సిటీని విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నాను. అందుకని తిరిగి నా చిన్నఊరికి తిరిగివెళ్ళాను. నేను ఇంటికి తిరిగివచ్చి , నేను చిన్నతనంలో ఉన్నట్లుగా, నాకు గుర్తుండేలా జీవించడం మొదలుపెట్టాను. నేను ఇక్కడ సంవత్సరానికి రెండు నెలలు పనిచేయడం ప్రారంభించాను. వ్యవసాయంలో నాకు నాలుగు టన్నుల వడ్లు అయ్యాయి. మేము మొత్తం మా కుటుంబంలో ఉన్నది ఆరుమందిమి. మేమంతా కలిపి సంవత్సరానికి అరటన్ను కంటే తక్కువ తింటాము. కాబట్టి మిగిలిన బియ్యాన్ని అమ్మవచ్చు. ఇంకా నేను రెండు చిన్న చేపల చెరువులు తీసుకున్నాను. మాకు ఏడాది పొడవునా తినడానికి హాయిగా చేపలు ఇక్కడ దొరుకుతాయి. అంతేకాక నేను నాకున్న అర ఎకరం కంటే తక్కువ చిన్నస్థలంలో ఒకచిన్న తోటను కూడా వేసాను. తోటపని కోసం రోజుకు 15 నిమిషాలు గడుపవలసి వస్తుంది. నేను ఈ తోటలో 30 కంటే ఎక్కువ రకాల కూరగాయలను పండిస్తున్నాను. అన్ని కూరగాయలను మేం ఆరుగురం ఎట్లాగో తినలేం కాబట్టి మాకు కావలసినవి కొన్ని ఉంచుకుని మిగతావాటిని మార్కెట్‌లో అమ్మడంవల్ల కొంత ఆదాయాన్ని కూడా సంపాదించవచ్చు. జీవితం ఇక్కడ చాలా సులభం. నేను ఏడేళ్లపాటు బ్యాంకాక్‌లో ఉండాల్సి వచ్చింది, గంటల తరబడి కష్టపడి పనిచేశాను, అంత కష్టపడివని చేసినా సంపాదించుకున్నది తినడానికి సరిపోలేదు, కానీ ఇక్కడ, సంవత్సరానికి రెండు నెలలు మరియు రోజుకు 15 నిమిషాలు మాత్రమే పనిచేసి నేను ఇంట్లో ఆరుగురికి ఆహారం ఇవ్వగలను. జీవితం అంటే సులువుగా ఉండటం.

ఇంకో ముఖ్యమైన విషయం. చిన్నతనంలో స్కూల్లో ఎప్పుడూ మంచి గ్రేడ్ సాధించని నాలాంటి తెలివితక్కువవారికి జీవితంలో ఇల్లు అనేది రాసిపెట్టి ఉండదని నేను అనుకున్నాను. నేనేకాదు ఇది చాలామంది అభిప్రాయం కూడా. ఎందుకంటే నాకంటే తెలివైనవారు, ప్రతి సంవత్సరం క్లాసులో నంబర్‌వన్ అయిన వారు మంచి ఉద్యోగం పొందుతారు, మంచి ఉద్యోగంవల్ల మంచి వేతనం లభిస్తుంది. కాబట్టి అటువంటి వారు ఒక స్వంత ఇల్లు పొందడానికి అత్యంత అర్హులు.

కానీ నాకు, నావంటి యూనివర్సిటి చదువు పూర్తిచేయలేని వారు కూడా ఒక ఇంటిని కలిగి ఉంటారా? నాలాంటి, తక్కువ విద్య

ఉన్న వ్యక్తులకు ఇళ్ళు అనేది ఒక ఆశాజనకపు ఎప్పటికీ పూర్తి కాని కల. కానీ, ఇక్కడ నా పేద గ్రామంలో నాకడుపుకు, కుటుంబ అవసరాలకు ఆహారఉత్పత్తి సాధించిన నేను ఇప్పుడు నేను భూసంబంధమైన భవనాలు చేయడం ప్రారంభించాను, ఇళ్ళు కట్టడం అంటారా అది చాలా సులభం అయింది నాకు ఇక్కడ. నేను రోజూ ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు, రెండు గంటల సమయం ఇల్లు కట్టడానికి వెచ్చించాను . మూడు నెలల సమయంలో నాకు స్వంత ఇల్లు వచ్చింది. మట్టి, రాయి, గడ్డి, వెదురు కలిస్తే ఇల్లు. నేను చదువుకునేప్పుడు నాక్లాస్‌లో అత్యంత తెలివైన స్నేహితుడు ఒకరు, అతను తన ఇంటిని నిర్మించడానికి నాకు లాగానే మూడు నెలల సమయం తీసుకున్నాడు. ఆ ఇంటికి గృహసంబంధమైన వస్తు సంచయంతో పాటు అప్పులూ చేయాల్సివచ్చింది. అతను 30 సంవత్సరాల పాటు తన అప్పు చెల్లించాలి. కాబట్టి, అతనితో పోలిస్తే, నాకు 29 సంవత్సరాల 10 నెలల ఖాళీ సమయం అనేది మిగిలింది. జీవితం అనేది సులభమైనది. ఈ సులభమైన జీవితాన్ని దానిపై అప్పులు, వడ్డీల ఋణం వేసి బరువుగా ఎందుకు బ్రతుకుతున్నాము మనం.

నా మొదటి ఇల్లు కట్టేంత ముందు వరకు కూడా అంత తేలికగా, సులువుగా ఒక ఇల్లు నిర్మించవచ్చని నేను ఎన్నడూ అనుకోలేదు. ఇప్పుడు కనీసం ప్రతి సంవత్సరం నేను ఒక ఇంటిని నిర్మించుకుంటూ ఉన్నాను. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ నాదగ్గర డబ్బులేదు, కానీ ఇళ్ళు మాత్రం నాకు చాలా ఉన్నాయి. సమస్య అల్లా ఈ రాత్రి నేను ఏ ఇంట్లో నిద్ర పోవాలి అనేదే. కాబట్టి, ఇల్లు అనేది ఒక సమస్య కాదు, ఎవరైనా ఇల్లు కట్టుకోవచ్చు. మాదగ్గర చిన్నపిల్లలు, 13 సంవత్సరాల వయస్సు వాళ్ళు. వారు ఒక పాఠశాల కట్టుకున్నారు, అదీను వారు స్వంతంగా చేసుకున్న ఇటుకలను ఉపయోగించి, తరువాత నెలలో ఆ పాఠశాలకు ఒక లైబ్రరీ కూడా. కాబట్టి ఇల్లు కట్టుకోడం పెద్ద విషయం కాదు మమ్మల్ని చూసి ఒక ముసలి సన్యాసిని కూడా ఆమె కోసం ఒక గుడిసెను నిర్మించుకున్నది కాబట్టి జీవితం లాగే, ఇల్లూ కూడా సులభం, మీరు నన్ను నమ్మకపోతే పోనీ, మీరూ ఒకమారు ప్రయత్నించండి. జీవితం అంటే, నివాసం అంటే, హాయిగా బ్రతకడం చాలా సులువు.

ఇంటి తరువాత తదుపరి విషయం దుస్తులు. నేను అందగాడిని కాదు కాబట్టి అందంగా కనిపించడానికి ఖరీదయిన దుస్తులు ధరించడం ఒక మార్గం అనిపించింది. బాగా కనిపించడంకోసం. నేను నాకు నచ్చిన ఒక సినీ నటుడిలా దుస్తులు ధరించడానికి ప్రయత్నించాను. అందుకని ఒక జత జీన్స్ కొనడానికికని డబ్బు ఆదా చేయడానికి ఒక నెల బాగా కష్టపడ్డాను. చివరికి ఆ దుస్తులుకొని వాటిని ధరించి అద్దంలో చూసుకుంటూ నేను ఎడమవైపు నుండి కుడివైపుకు తిరిగాను. కుడి నుండి ఎడమవైపుకు మళ్ళాను. అద్దంలో నా చుట్టూ నేను తిరిగాను. నేను చూసిన ప్రతిసారీ నేను ఒకే వ్యక్తిని, ఆ పాత నేనుని మాత్రమే చూసాను. ఒక నెలపాటు చెమట రక్తం ధారవోసి కొన్న అత్యంత ఖరీదైన ప్యాంటు, చొక్కా కూడా నా మోహాన్ని, జీవితాన్ని మార్చలేదు. అద్దంలో కనబడిన నాకు నేను చాలా వెర్రివాడిని అనిపించింది.

ఖరీదయిన దుస్తుల కొసం, అత్యంత ఆధునిక పోకడల వస్త్రాల వెంట పరిగెట్టి డబ్బు ఎంతగానయినా కూడపెట్టండి. అది మనల్ని ఏమాత్రం మార్చలేదు. నేను దాని గురించి మరింత తెలుసుకోవడం, ఆలోచించడం మొదలుపెట్టాను. మనం ఎందుకని ఫ్యాషన్‌ని అనుసరించాలి? ఆలోచించిన కొద్ది నాకు జవాబు దొరకలేదు. వంటిని కాపాడటమే దుస్తులకేవల ఉద్దేశం. ఆ తర్వాత, 20 సంవత్సరాల వరకు, నేను ఏ బట్టలూ కొనలేదు. ఇప్పుడు నా దగ్గర ఉన్న బట్టలన్నీ ప్రజల నుండి వచ్చినవే ప్రజలు నన్ను సందర్శించడానికి వచ్చినప్పుడు, మరియు వారు ఇక్కడి నుండి వెళ్ళేప్పుడు వారు ఇక్కడ చాలా దుస్తులను వదిలివేస్తారు. కాబట్టి నా దగ్గర ఇప్పుడు టన్నుల కొద్దీ బట్టలు ఉన్నాయి. ఏం చేస్తాం? వద్దనుకున్నవి ఎంత ఉండినా ఏం ప్రయోజనం. ఇలా ఆలోచించినప్పుడు నాకు మరింత స్వేచ్ఛగా అనిపిస్తుంది. అవసరానికి మించి ఏదీ వద్దు అనుకోవడంలో ఉన్నస్వేచ్ఛ మరి ఎందులోనూ లేదు.

ఇక చివరివిషయం ఏమిటంటే, అనారోగ్యం. నేను జబ్బుపడినప్పుడు సంగతి. అప్పుడు ఏమి చేయాలి ? నేను నా పాత జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టేముందు అంత సులువుగా మొదలు కాలేదు, దాని గురించి చాలా ఆందోళన చెందాను, ఎందుకంటే నా దగ్గర డబ్బు లేదు, మందుమాకులు, వైద్యం, ఆస్పత్రి.. వీటి ఖర్చులు! నేను దీని గురించీ ఆలోచించడం మొదలుపెట్టాను, మానవుడికి అనారోగ్యం సాధారణమైనది, అనారోగ్యం అంత చెడ్డ విషయం ఏమీ కాదు. అనారోగ్యం అయింది అంటే దాని అర్థం– మన జీవితాల్లో, మనం గడుపుతున్న జీవిత విధానంలో మనం ఏదో తప్పు చేశామని మన శరీరం మనకు గుర్తుచేసే విషయం. అందుకే మనం అనారోగ్యానికి గురవుతాము. కాబట్టి, నాకు జబ్బు వచ్చినప్పుడు, నేను కాస్త ఆగిపోయి నా దగ్గరకు నేను రావాలి. దాని గురించి కాస్త ఆలోచించాలి. ఇదిగో ఇది నేను చేసిన తప్పు. కాబట్టి ఈ తరహా పని మరల చేయరాదు. డబ్బు లేకపోతే ఏవుంది, నన్ను నేను నయం చేసుకోవడానికి నీటిని ఎలా ఉపయోగించాలో నేర్చుకున్నాను, భూమి, దాని మన్ను నన్ను స్వస్థపరచడానికి ఎలా ఉపయోగించాలో నేర్చుకున్నాను. నాకు ఇది ఆరోగ్య స్వేచ్ఛలాంటిది అనిపిస్తుంది, నేను ఇప్పుడు ఉన్న జీవిత విధానంలో స్వేచ్ఛగా ఉన్నాను. నేను దేనిని గురించీ ఎక్కువగా ఆందోళన చెందను. నాకు భయం తక్కువ, నా జీవితంలో నేను కోరుకున్నది నేను చేయగలను. మునుపు గడిపిన బ్యాంకాగ్ జీవితం నాకు చాలా భయం కల్పించింది, దాని నీడన నేను ఏమీ చేయలేకపోయాను. కానీ, ఇప్పుడు నేను స్వేచ్ఛగా భావిస్తున్నాను, నన్ను నేను ఈ భూమిపై ఒక ప్రత్యేకమైన వ్యక్తిలాగా అనుకుంటున్నా, నాలాగా ఎవరూ లేరు, నన్ను నేను ఎవరిలాగా చేసుకోవాల్సిన అవసరం లేదు. విజయానికి అడుగెట్టాల్సిన ఏ మెట్టు వెదకవలసిన అవసరంలేదు. నన్ను పోగొట్టుకుని ఎవరినో ధరించడానికని పూనుకుని అన్వేషణకు బయలుదేరాల్సిన అవసరమూ లేదు.

ఆహారం, ఆవాసం, ఆరోగ్యం ఆ తర్వాత ఇక ఏం చేయాలి? నేను బ్యాంకాక్‌లో ఉన్నప్పటి జీవితపు మనస్థితి గురించి ఆలోచించడం మొదలుపెట్టాను, నా జీవితంలో అప్పుడు చాలా చీకటిగా అనిపించింది. ఆ సమయంలో చాలామంది నాలాగే ఆలోచిస్తారని, అలోచిస్తూ ఉంటారని నేను ఆలోచించడం మొదలుపెట్టాను. కాబట్టి, నావంటి భావసారూప్యత కలవారిమి కలిసి చింగ్ మాయిలో "పన్ పన్ 'అనే కార్యశాలని ప్రారంభించాము (చియాంగ్ మాయి పర్వత ప్రాంతమైన ఉత్తర థాయ్‌లాండ్‌లోని ఒక నగరం.) మా ఆలోచనల ప్రధాన లక్ష్యం కేవలం విత్తనాన్ని సేకరించడమే! విత్తనాన్ని కాపాడటమే.! విత్తనం

అంటే ఆహారం, ఆహారం అంటే జీవితం. విత్తనం లేకపోతే, జీవితంలేదు. విత్తనం లేదంటే స్వేచ్ఛలేదు. విత్తనం లేకపోతే ఆనందంలేదు. ఎందుకంటే మన జీవితం ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి విత్తనాన్ని కాపాడటం చాలా ముఖ్యం. అందుకే విత్తనాల పొదుపుపై దృష్టి పెట్టాం. ఇది "పన్ పన్‌లో" ప్రధానమైనది. విత్తనం తరువాత రెండవ విషయం ఏమిటంటే ఒక కూడిక కేంద్రాన్ని నెలకొల్పడం. ఇది ఒక అభ్యాస కేంద్రం. ఇదెందుకు అంటే, మనం జీవితాన్ని మళ్ళీ నేర్చుకోవడానికి, జీవితాన్ని సులభతరం చేసుకోడం తెలుసుకోవడానికి అన్నమాట. ఎందుకంటే మనం ఈ జీవితాన్ని వీలయినంత సంక్లిష్టంగా, చిక్కుగా కంగాళీగా ఎలా గడపాలో నేర్పించాము. దానిని ఇప్పుడు ఆ సంక్లిష్టత బారినుండి విముక్తం చేయాలి. జీవితాన్ని ఎలా సులభతరం చేయవచ్చు? చేయడం సులభం, కానీ ఎలా సులభతరం చేయాలో చెప్పడం మాకు తెలియదు. ఎందుకంటే మనం దానిని విముక్తం చేయడానికి సూత్రాలు సులువుగా దొరకనంత చిక్కుగా చేసాము. గొలుసుల మీద గొలుసులు, ముడుల మీద ముడులు, వస్తువుల మీద వుస్తువులు... చెత్త చేసాము మనం జీవితాన్ని. అందుకని ఇప్పుడు ముడులు విప్పడం నేర్చుకోవడం మొదలుపెడదాము. అందరం కలిసి ఉండడం నేర్చుకుందాము. అన్నిటి నుండి డిస్కనెక్ట్ కావడం నేర్చుకుందాము, మనం సంతోషంగా ఉండాలంటే, మన ఆలోచనా స్వేచ్ఛ మనకు తిరిగిరావాలి. అందుకని మళ్లీ మనతో మనం కనెక్ట్అవ్వాలి, ఇతర వ్యక్తులతో కనెక్ట్ అవ్వాలి, మన మనస్సు మరియు శరీరాన్ని మళ్ళీ కలపాలి. జీవితం అనేది సులభం. దానిని చూసి భయపడకండి. వెనక్కి రండి.

మొదటి నుండి ఇప్పటి వరకు, నేను నేర్చుకున్నది నాలుగు ప్రాథమిక అవసరాలు: ఆహారం, ఇల్లు, బట్టలు మరియు వైద్యం. ఈ నాలుగు- ప్రపంచంలో అందరికి చౌకగా మరియు అందుబాటులోకి సులభంగా ఉండాలి, నాకరికత అంటే అర్థంఅదే. కానీ మనం వందలూ, వేలు కాదు ఈ కేవలం నాలుగు సంఖ్యల విషయాలను పొందడానికి ఈ భూమి మీద నివసించే అనేక మందికి కష్టతరం చేసి పెట్టాము. ఇప్పుడు మనం బ్రతుకుతున్న బ్రతుకు ఏ విధంగా నాగరికమైనదో దానిని చూసి మనం ఎలా గర్వపడగలమో నాకు తెలియడం లేదు. ఈ భూమిపై ఇప్పుడు ఉన్నది అత్యంత నాగరికమైన యుగం అని భావించేవారు ఉన్నారు. భూమిపై చాలా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి, మన దగ్గర మహా మహా విశ్వవిద్యాలయాల చదువు పూర్తి చేసిన చాలా మంది వ్యక్తులు ఉన్నారు. ఈ భూమిలో అసాధారణమైన అత్యంత తెలివైన వ్యక్తులు ఉన్నారు, మేధావులు, శాస్త్రవేత్తలు, రాజకీయనాయకులు....... ఒక్కరని కాదు, రకరకాలు. కానీ, జీవితం ఎలా ఉంది అంటారు? కష్టంగా ఉంది కష్టాతి కష్టంగా ఉంది. ఇంత కష్టం మనం ఎవరి కోసం పడుతున్నట్టు? దేనికోసం పరిగెడుతున్నట్లు?

ఈ నడుస్తున్న జీవన వ్యాకరణం తప్పు అని నాకు అనిపిస్తోంది, ఈ తరహా జీవన విధానం సాధారణమైనది కాదు, ప్రాకృతకమైనది కాదు. కాబట్టి, నేను దానినుండి సాధారణ మానవ స్థితికి రావాలనుకుంటున్నాను. మనిషి ఒక సాధారణత్వానికి మరలిపోవాలి. అతను జంతువులతో సమానంగా ఉండాలి. అవును మీరు సరిగా చదివారు. జంతువులతో సమానంగా. పక్షులు ఒకటి లేదా రెండు రోజుల్లో గూడు కట్టుకుంటాయి, ఎలుక ఒక్క రాత్రిలో తన నివాస రంధ్రం చేస్తుంది. కానీ సృష్టిలో మనలాంటి తెలివైన మనుషులు ఒక ఇంటి కోసం 30 సంవత్సరాలు గడుపుతారు. అప్పులు చేసి మరీ జీవితాన్ని క్లిష్టతరం చేసుకుంటారు. ఇంత కష్టమైన జీవితంలో కూడా ఈ భూమి మీద నివసించే చాలామంది వ్యక్తులకు తమ జీవితంలో ఒక ఇంటిని కలిగి ఉంటారని నమ్మలేము. కాబట్టి ఇదంతా తప్పు జరుగుతుంది . మనం మన ఆత్మను ఎందుకు నాశనం చేసుకుంటున్నాము, మనం మన సామర్థ్యాన్ని ఎందుకు అంతగా నాశనం చేసుకుంటున్నాము? ఈ ఆలోచనలో నన్ను నేను వెదుక్కుంటూ వెనక్కి వచ్చాను. నేను ఒక సామాన్యుడిని అయ్యాను అనుకుంటున్నాను. మీరంతా సాధారణ మార్గంలో అనుకునే ఒక అసాధారణమైన రీతిలో జీవిస్తున్నారు. మీకు తెలియదు, మీకు మీ గురించి ఆలోచించే సమయం, స్వేచ్ఛలేదు. నిజానికి ఇప్పుడు ఈ రోజు నేను సాధారణంగా ఉండటానికి, మామూలుగా బ్రతకడానికి, సహజంగా ఉండేలా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను . కానీ ప్రజలు నన్ను ఒక అసాధారణ వ్యక్తి అనుకుంటున్నారు లేదా పిచ్చివాడు, కానీ అదేమీ నేను పట్టించుకోను. ఎందుకంటే అది నా సమస్యకాది, అది వారి సమస్య.

జీవితం నాకు ఇప్పుడు సులభంగా, తేలికగా ఉంది. అది నాకు చాలు. అది నాకు చాలా ఎక్కువ . ప్రజలు ఏమైనా అనుకోవచ్చు. వారు అనుకోడాన్ని, వారి అభిప్రాయాలను మార్చడానికి, నచ్చచెప్పడానికి నేను ఏమీ చేయలేను. నేను చేయగలిగేది ఒక్కటే , నన్ను, నా మనసును మార్చుకోవడం. నా మనస్సును నేనే నిర్వహించుకోవడం. ఎంపిక అనేది ఎవరికి వారి వ్యక్తిగత ఎన్నిక . మీకు ఏం కావాలో మీరు మీరు ఎంపిక చేసుకోవచ్చు. సులభంగా ఉండటం నుండి కష్టంగా ఉండటం ఉండటానికి ఎంపిక. కష్టంగా నుండి సులభంగా ఉండటానికి ఎంపిక, అది మీ పై ఆధారపడి ఉంటుంది. ధన్యవాదాలు.

43 వ పుట తరువాయి...

## నల్లేరుపై నడక !

నుండి ఒకరు పారతో వెళ్ళి కాలువ పూడిక తీయడంతో పాటు లోతు పెంచుతూ ఉండాలి. కర్నాటకలో వ్యవసాయం చేసే సమయంలో నేను కూడా నల్లేరు కాలువ తీయడానికి వెళ్లేవాడిని. ఏరు...వ్యవసాయ భూమి సమమట్టం లో ఉన్నప్పుడు మాత్రమే నల్ల నీళ్లు సేద్యానికి మరల్చడానికి సాధ్యం అవుతుంది. ఏరు చాలా లోతులో ప్రవహిస్తూ భూమి ఎత్తులో ఉంటే కుదరదు.(అటువంటి చోట్ల ప్రాజెక్టులు కట్టినారు- అది వేరే విషయం)

ఏదయినా ఒక ఏడు వానలు పడక ఏరు పారక పోతే నల్లేరు కాలువకు నీరు ఊరక, వ్యవసాయం మూలపడేది. కరెంటు పంపులతో బావుల నుండీ, గొట్టం బావుల నుండి వందల వేల అడుగుల నుంచీ తోడడం నేర్చిన తరువాత నాకు తెలిసిన అన్ని నల్లేరు కాలువలూ మాయమయ్యాయి. వాటి స్థానంలో నల్లేరు మొక్క చేరిపోయింది!!

నేదునూరి కనకయ్య
9440245771
ప్రవీణ్‌కుమార్ జాలిగామ

# ప్రకృతిని కాపాడుకొందాం

**ప**ర్యావరణ కాలుష్యం ప్రపంచ వ్యాప్తంగా సమస్యగా మారింది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక మరియు సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి.

ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్ మరియు నీటి ఆవిరి సమతుల్యంగా ఉండాలి. ఈ సమతుల్యత జల వలయం సాధారణ వర్షపాతం మరియు జంతువుల మొక్కల జీవిత చక్రాలకు సహాయపడతాయి. పర్యావరణ సమతుల్యం వన్యప్రాణి మరియు వ్యవసాయానికి మానవుని అభివృద్ధికి సహాయపడుతుంది.

కాలుష్య కారకాలను వాతావరణంలో ప్రవేశపెట్టడాన్ని కాలుష్యం అని అంటారు. పర్యావరణ కాలుష్యం ప్రధానంగా వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం, ఉష్ణ కాలుష్యం, నేల కాలుష్యం మరియు వ్యవసాయ గృహ నిర్మాణం అటవీ నిర్మూలనకు దారితీస్తున్నాయి. అటవీ నిర్మూలన కూడా పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తున్నది. ఈ విధంగా జీవులకు జీవించుటకు అత్యవసర వనరులైన గాలి నీరు కాలుష్యానికి గురి అవుతున్నాయి. పర్యావరణ కాలుష్యం మానవుల, జంతువుల జీవితాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. వృక్షజాలం జంతుజాలం అంతరించిపోయే ప్రమాదం ఉంది.

ఆధునిక పట్టణీకరణ, ప్రపంచీకరణ పారిశ్రామికీకరణ మరియు ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ యుగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థికాభివృద్ధి పేరుతో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారు.

మరోవైపు ప్రపంచ ధనిక దేశాలు ధనార్జనే ధ్యేయంగా పేద దేశాల సహజ వనరులను వినియోగించుకొని పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగించి ఐశ్వర్యాన్ని పెంచుకోవడంలో పోటీపడి అభివృద్ధి చెందుతున్నాయి. తద్వారా పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగిస్తున్నాయి. పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకొవటమే కాకుండా మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల, జీవాధారమైన నీరు కలుషితమౌతుంది. వాహనాలు ఫ్యాక్టరీలు వదిలే పొగ పెట్రోల్ మరియు డీజిల్ మరియు బొగ్గు ఉపయోగించడం వల్ల విడుదల చేసే పొగ పర్యావరణ కాలుష్యం చేస్తున్నాయి. పరిశ్రమలు ద్వారా ఉత్పన్నమయ్యే వేడి సమీప ప్రాంతాల జలాశయాల ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా ఉష్ణకాలుష్యం జరుగుతోంది.

ఈ విధంగా మానవుడి అనేక కార్యకలాపాల వల్ల కార్బన్ ఉద్గారం ఎక్కువ కావడంతో వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి.

వాయుకాలుష్యం వల్ల శ్వాస కోశ వ్యాధులు ఊపిరితిత్తుల బలహీనత క్షయ మరియు వివిధ రకాల మెదడు మరియు గుండె సమస్యలు పెరుగుతున్నాయి. వాయు కాలుష్యం పెరిగితీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులు, ఉబ్బసం, మెదడులో రక్తం గడ్డ కట్టడం కంటి చూపు మందగించడం లాంటి రుగ్మతలు ఎక్కువ అవుతున్నాయని అనేక ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి.

నేడు మనం నిత్యం వాడే పాలు పండ్లు కూరగాయలు కలుషితమౌతున్నాయి. కాలుష్యం ఫలితంగా ప్రపంచంలో మానవ జాతి నయం చేయలేని భయంకర రోగాలబారిన పడి వైద్య ఆరోగ్య రంగానికి సవాలుగా పరిణమించడం శోచనీయం.

శబ్ద కాలుష్యం వినికిడి లేదా శ్రవణ జ్ఞాన సంబంధ అవయవాలపై ప్రతికూల ప్రభావాలను కలిగించటంవల్ల చెవుడు, అలసట మరియు మానసిక ఒత్తిడి అధికమై పలు మానసిక అనారోగ్య సమస్యలను సృష్టిస్తుంది. పలు అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది.

పర్యావరణ కాలుష్యం అణు పరీక్షలు పరిశ్రమలు ఆటోమొబైల్స్ ఇతర వాహనాలద్వారా వదిలివేయబడిన పొగ, సింథటిక్ డిటర్జెంట్లు, నత్రజని ఎరువులు అధిక దిగుబడులు పేరు మీద వ్యవసాయ రంగములో పంట పొలాల్లో కూరగాయల పాడి పంటల ఉత్పత్తిలో విచ్చల విడిగా వాడుతున్న పురుగుమందుల వినియోగం భూమి ఉత్పత్తి సామర్థ్యం క్షీణత ఇది భూగర్భ జలాలను కూడా కలుషితం చేస్తుంది.

భోపాల్‌లో డిసెంబర్ 3, 1984 సంవత్సరంలో జాతీయ యూనియన్ కార్బైడ్ పురుగుమందుల తయారీ కర్మాగారం నుండి విషపూరితమైన మిథైల్ ఐసోసైనేట్ (MIC) వాయువు లీకేజీ ఫలితంగా ప్రపంచంలో పెద్దపారిశ్రామిక పర్యావరణ కాలుష్య విషాదం సంభవించింది. స్త్రీలు మరియు పిల్లలతో సహా 2000 మందికి పైగా వ్యక్తులు మరణించారు మరియు 3000 మంది తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు.

**పర్యావరణ కాలుష్య నివారణకు పరిష్కార మార్గాలు**

ఇప్పటికే ఉన్న కర్మాగారాలను జనావాస మండలానికి దూరంగా ఉన్న ప్రదేశానికి భౌతికంగా ఎత్తివేయడం సాధ్యం కాదు. అయితే, పర్యావరణ కాలుష్యసమస్యను పరిష్కరించడానికి భవిష్యత్తులో ప్రభుత్వాలు కర్మాగారాలను జనావాసాలకు సుదూర ప్రదేశంలో, టౌన్‌షిప్‌కు దూరంగా ఉన్న పారిశ్రామిక సముదాయంలో ఏర్పాటుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి.

పరిశ్రమలు నిబంధనలు పాటించాలి. దానికొరకై ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని మరియు పర్యావరణ కాలుష్యం కలిగించని పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి. నదీజలాలు మరియు జలాశయాలు కాలుష్యం లేకుండా చేయడానికి ఫ్యాక్టరీ వ్యర్థాలను నీటిలో వదిలేయడాన్ని నిషేధించాలి. అడవుల నరికివేతను అరికట్టి అడవులను అభివృద్ధి చేయాలి. మనం ప్రస్తుతం పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడంలో విఫలమైతే మానవులు భూగ్రహం పైన నివసించుట అసాధ్యం అవుతుందని తెలుసుకోవాలి.

ప్రపంచ స్థాయిలో వాయు కాలుష్యాన్ని పర్యవేక్షించడానికి, అధ్యయనం చేయడానికి మరియు సాధ్యమైన నివారణలను రూపొందించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను పరిశోధన అభివృద్ధి శిక్షణ సంస్థను ఏర్పాటు చేసింది.

మిత్ర దేశాలను ఒకచోట చేర్చి సున్నా కర్బన్ ఉద్గారం 2050 నాటికి చేరుకోవాలన్న లక్ష్యంతో జీరో 2019 ప్రపంచ యుద్ధం ప్రారంభించబడింది. ఈ దిశగా ప్రపంచ మానవాళి కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో సంపూర్ణ భాగస్వాములు కావాలని ఆశిద్దాం.

# అధికార భాషగా తెలుగును ఎందుకు అమలు చెయ్యాలి?

1966లోనే ఇందుకోసం శాసనం వచ్చింది. ఆ చట్టం పేరు ఆంధ్రప్రదేశ్ అధికారభాషా చట్టం. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికీ వర్తించును- అని స్పష్టంగా ఆ చట్టంలో నిర్దేశించారు. అంటే ఇప్పటి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రెండిటికీ వర్తిస్తుంది. 'అమ్మనుడి' చదువరుల కోరికపై దీనిని ఇక్కడ ఉన్నదున్నట్లు ప్రచురిస్తున్నాం...

# ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టము
## 1966లో 9వ చట్టము

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార కార్యములకు రాష్ట్ర శాసన మండలిలో వ్యవహార నిర్వహణకు ఉపయోగించవలసిన భాషగా తెలుగు భాషను స్వీకరించుటకు, పై సంబంధించిన విషయములను గురించి నిబంధించు చట్టము.

భారత రిపబ్లికు పదునేడవ సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలిచే దిగువ రీతిగా శాసించబడినది :-

1. సంగ్రహ నామము, వర్తింపు (1) ఈ చట్టము 1966, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టము అని వ్యవహరింపబడును. ఇది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంతటికి వర్తించును.

2. తెలుగు రాష్ట్ర అధికార భాషగా ఉండుట:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష తెలుగై ఉండవలెను.

3. తెలుగును ఏ యే అధికార కార్యములకు ఉపయోగించవలెనో ప్రకటించుటకు ప్రభుత్వ అధికారము :- 1. రాష్ట్ర ప్రభుత్వము ఆయా సమయములందు ఆంధ్రప్రదేశ్ గెజెట్‌లో ప్రకటన ద్వారా తెలుగు భాషను ఆ ప్రకటనలో నిర్దిష్ట పరచునట్టి రాష్ట్ర అధికార కార్యములకు, అట్టి తేదీలనుండి ఉపయోగింపవలెనని అదేశించవచ్చును.

2. (1) (ఎ) రాష్ట్ర శాసనమండలి ఉభయసభలలో దేనియందైన ప్రవేశపెట్టబడు బిల్లులన్నిటిలోను, వాటికి ప్రతిపాదించబడు సవరణలన్నిటిలోను రాష్ట్రశాసన మండలి చేసిన చట్టములన్నిటిలోను :

(బి) రాజ్యాంగములోని 213వ అనుచ్ఛేదము క్రింద రాష్ట్ర గవర్నరు జారీ చేసిన ఆర్డినెన్సు లన్నిటిలోను, రాజ్యాంగమునకుగల అయిదవ అనుసూచి 5వ పేరా క్రింద ఆయన చేసిన రెగ్యులేషన్లన్నిటిలోను;

(ii) రాజ్యాంగము క్రింద లేదా పార్లమెంటు లేక రాష్ట్ర శాసన మండలి చేసిన ఏదేని శాసనము క్రింద రాష్ట్ర ప్రభుత్వముగాని, రాష్ట్ర ప్రభుత్వ అధికార వర్గములేక అధికారిగాని జారీచేసిన ఉత్తరువులు, నియమములు, రెగ్యులేషన్లు, నిబంధనావళి అన్నిటిలోను: ఉపయోగించవలసిన భాష, రాష్ట్ర ప్రభుత్వము ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రకటనద్వారా నిర్దిష్టపరచు తేదీనను, ఆ తేదీనుండియు తెలుగు భాషయై ఉండవలెను; అయితే ఈ ఉప విభాగపు (1) (2) ఖండములలోని వేర్వేరు అంశములకు, రాష్ట్ర ప్రభుత్వము వేర్వేరు తేదీలను నిర్దిష్ట పరచవచ్చును.

4. రాష్ట్రముయొక్క కొన్ని అధికార కార్యములకును, శాసన మండలిలో ఉపయోగమునకును ఆంగ్ల భాష కొనసాగింపు:- రాష్ట్ర ప్రభుత్వము 3వ విభాగము క్రింద ప్రకటన ద్వారా ఆన్యధా ఆదేశించునంతవరకు -

(1) ఈ చట్టపు ప్రారంభమునకు సద్యఃపూర్వము ఆంగ్ల భాష రాష్ట్రము లోపల ఏయే అధికారకార్యములకు ఉపయోగించబడుచుండెడిదో ఆ కార్యములకు దాని వాడుక కొనసాగవలెను.

(2) రాష్ట్ర శాసన మండలిలో వ్యవహార నిర్వహణకు ఆంగ్లభాష వాడుక కొనసాగవచ్చును.

5. అధికార భాషా సంఘము :- (1) ఈ చట్టపు ప్రారంభమునుండి అయిదు సంవత్సరములు గడచిన మీదట రాష్ట్ర ప్రభుత్వము ఉత్తరువుద్వారా ఒక రాష్ట్ర అధికార భాషా సంఘమును ఏర్పాటు చేయవలెను. అందులో ఒక అధ్యక్షుడు, నలుగురు ఇతర సభ్యులు వుండవలెను, వారిని రాష్ట్ర ప్రభుత్వము నియమించును, సంఘము అనుసరించవలసిన కార్య విధానమును ఆ ఉత్తరువు నిర్వచించవలెను.

(2) రాష్ట్ర అధికార కార్యములకు తెలుగు భాషను ఉపయోగించుటలో సాధించిన ప్రగతిని సమీక్షించుట, ఈ క్రింది వాటిని గురించి రాష్ట్ర ప్రభుత్వమునకు సిఫార్సు చేయుట, సంఘముయొక్క కర్తవ్యమై ఉండవలెను;

(ఎ) రాష్ట్ర అధికార కార్యములకు తెలుగు భాషను క్రమాధికముగా ఉపయోగించుట:

(బి) రాష్ట్ర అధికార కార్యములన్నింటికి లేదా అందు వేటికైన ఆంగ్లభాష ఉపయోగముపై నిర్బంధములు

(సి) తెలుగు భాష ఉపయోగమునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వము సంఘమునకు నిర్దేశించిన ఏదైనా ఇతర విషయము.

(3) సంఘము (2) వ ఉప విభాగములో తెలిసిన విషయములపై తన సిఫార్సులతో పాటు రాష్ట్ర ప్రభుత్వమునకొక నివేదికను సమర్పించవలెను. రాష్ట్ర ప్రభుత్వము నివేదికను రాష్ట్ర శాసనమండలి ప్రతిసభ సమక్షమందు ఉంచుటకు ఏర్పాటు చేయవలెను.

(4) సంఘము అట్లు సమర్పించిన నివేదికలో చేసిన సిఫార్సులను పరిశీలించినమీదట, రాష్ట్ర ప్రభుత్వము ఆ నివేదిక అంతటికి లేక అందలి ఏదేని భాగమునకు అనుగుణముగా ఆదేశములు జారీ చేయవచ్చును.

6. కేంద్ర, రాష్ట్ర చట్టములు మున్నగు వాటి అధికృత తెలుగు అనువాదము:- (1) ప్రకటన ద్వారా నిర్దిష్ట పరచిన తేదీనను, ఆ తేదీ

తరువాత గవర్నరు అధికారము క్రింద :-

(1) 3వ విభాగపు (2) వ ఉపవిభాగములోని (1) వ ఖండము విషయములో ఏదేని కేంద్ర చట్టములేక రాజ్యాంగమునకుగల ఏడవ అనుసూచి యొక్క 3వ జాబితాలో పేర్కొనిన విషయములలో దేనికి సంబంధించి యైనను రాష్ట్ర పతి జారీ చేసిన ఏదేని ఆర్డినెన్సు లేదా ఏదేని రాష్ట్ర చట్టము లేదా గవర్నరు చేసిన ఏదేని రెగ్యులేషను లేదా రాష్ట్రములో అమలునందున్న ఏదేని శాసనమునకు, లేక

(2) 3వ విభాగపు (2)వ ఉపవిభాగములోని (2) వ ఖండము విషయములో రాజ్యాంగము క్రింద లేక ఏదేని కేంద్ర చట్టము లేక రాష్ట్ర చట్టము లేక రాష్ట్రములో అమలునందున్న ఏదేని ఇతర శాసనము క్రిందరాష్ట్ర ప్రభుత్వము గాని రాష్ట్ర ప్రభుత్వ అధికార వర్గము లేక అధికారిగాని జారీచేసిన ఏ దేని ఉత్తరువు, నియమము, రెగ్యులేషను లేక నిబంధనకు -

ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రచురించిన తెలుగు భాషానువాదమును తెలుగు భాషలో దాని అధికార పూర్వక పాఠముగా భావింపవలెను.

(2) రాష్ట్ర శాసన మండలిలో ప్రవేశపెట్టిన బిల్లు లన్నిటిలోను, వాటికి ప్రతిపాదించు సవరణలలోను అది ఆమోదించిన చట్టములలోను ఏ తేదీ నుండి తెలుగు భాషను ఉపయోగించవలెనో నిర్దిష్ట పరచుచు రాష్ట్ర ప్రభుత్వము 3వ విభాగపు (2) వ ఉపవిభాగములో (1) (ఎ) ఖండము కింద ప్రకటన జారీ చేసినప్పుడు రాష్ట్ర శాసన మండలి ఉభయ సభలలో దేనియందైనను ఆంగ్లభాషలో గల చట్టములను సవరించుటకు ప్రవేశపెట్టుబడు బిల్లులు లేదా వాటికి ప్రతిపాదించబడు సవరణలు అన్నిటి యొక్క అధికార పూర్వక తెలుగు భాషా పాఠముతోపాటు ఆంగ్లభాషలో దాని అనువాదము కూడా ఉండవలెను.

**7.** రాష్ట్ర మందలి కొన్ని ప్రాంతములలో ప్రకటన ద్వారా నిర్దిష్ట పరచబడునట్టి అధికార కార్యములకు, అట్టి కాలపరిమితుల వరకు తెలుగు భాషకు అదనముగా ఉర్దూ లేక ఏదేని ఇతర భాష లేక భాషల ఉపయోగమునకు సంబంధించిన ప్రత్యేక నిబంధన :- రాష్ట్ర ప్రభుత్వము ఆయా సమయములందు ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రకటనద్వారా, తెలుగు భాషకు అదనముగా ఉర్దూమ లేక ఇతర భాష లేక భాషల నైనను. అట్టి భాష లేక భాషలను మాట్లాడువ్యక్తుల ప్రయోజనముల దృష్ట్యా ప్రకటనలో నిర్దిష్ట పరచబడునట్టి ప్రాంతములలోను, అట్టి రాష్ట్ర అధికార కార్యములకొరకును, అట్టి కాలపరిమితుల వరకును ఉపయోగించవలెనని ఆదేశించవచ్చును.

**8.** నియమములు చేయుటకుఅధికారము:- (1) రాష్ట్ర ప్రభుత్వము ఈ చట్టపు కార్యములన్నింటిని లేక వాటిలో వేటినైనను నెరవేర్చు నిమిత్తము ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రకటన ద్వారా నియమములు చేయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద జారీచేసిన ప్రతి ప్రకటనను లేక చేసిన ప్రతి నియమమును దానిని జారీ చేసిన వెంటనే లేక చేసిన వెంటనే రాష్ట్ర శాసనమండలి సమావేశమైఉన్నచో అప్పుడు, లేనిచో సద్యానంతరము జరుగు సమావేశములో ప్రతి సభ సమక్షమందు మొత్తము పదునాలుగు దినములపాటు వుంచవలెను. ఈ పదునాలుగు దినములు ఒకే సమావేశములోనివి కావచ్చునులేదా రెండు వరుస సమావేశములలోనిని కావచ్చును. దానిని అట్లుంచిన సమావేశము లేక సద్యానంతర సమావేశము ముగియులోగా ఆ ప్రకటనలో లేక నియమములో ఏదేనిమార్పు చేయుటకు లేక ప్రకటననులేక నియమమును రద్దు చేయుటకు ఉభయ సభలు అంగీకరించిన యెడల ఆ మీదట ఆ ప్రకటన లేక నియమము సందర్భమునుబట్టి అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే అమలు నందుండవలెను, లేదా రద్దు కావలెను, అయితే అట్టి ఏదేని మార్పు లేదా రద్దు ఆ ప్రకటన లేక నియమము క్రింద లోగడ చేసిన యేదైన కార్యపు చెల్లుబడికి భంగకరముగా వుండకూడదు.

**9. 1964**లో **16**వ ఆంధ్రప్రదేశ్ చట్టము రద్దు :- **1964**, ఆంధ్ర ప్రదేశరాష్ట్ర శాసన మండలి (ఆంగ్లభాష కొనసాగింపు) చట్టము ఇందుమూలముగా రద్దు చేయబడినది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రచురించిన
'పరిపాలనలో, విద్యారంగంలో తెలుగు అమలు– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టాలు, ఉత్తర్వులు, ఆదేశాలు' అనే పుస్తకం నుండి.

## ఆచార్య 'ఎండ్లూరి' కనుమరుగు



ప్రముఖ కవి, దళిత సాహితీ రథసారథి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారుజామున హైదరాబాద్‌లో చివరి ఊపిరి విడిచారు.

రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయంలో, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యునిగా సేవలందించి ఎందరో విద్యార్థులకు, పరిశోధకులకు, మార్గదర్శనం చేశారు.

తెలుగు కవితా దిగ్గజంగా సాహితీలోకంలో విశేషమైన కృషి చేసి, తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్రతో పయనించారు.

వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, మొదలైన రచనలతో తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు.

ఎండ్లూరి మరణం పట్ల మా సంతాపాన్ని తెలియజేస్తున్నాము. –సంపాదకుడు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# చిన్నారుల నోట వేమన పద్యాల ఊట



వేమన సాహిత్య వికాస భవన ప్రారంభోత్సవ సంచికను ఆవిష్కరణిస్తున్న ఆం.ప్ర. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ అరెమండ పరపప్రసాదరెడ్డి, ఆం.ప్ర పాఠశాల విద్యానియంత్రణ పర్యవేక్షణ కమిటి వైస్ ఛైర్‌మెన్ శ్రీమతి విజయ శారదారెడ్డి



బహుమతి ప్రదానం చేస్తున్న శాసనసభ్యులు ఆచార్య మేరుగ నాగార్జున



సన్మాన పత్రాన్ని స్వీకరిస్తున్న డా॥ లక్ష్మీపార్వతి



గయోపాఖ్యానం నాటకాన్ని ప్రదర్శించిన విజయషణ్ముఖిరాజు, కృష్ణచైతన్య

**మో**దుకూరు వేమన సాహిత్య భవనంలో మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, మరియూ ఆంధ్రలొయోలా కాలేజీ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 19,20 తేదీలలో జరిగిన వేమన జయంతి ఉత్సవాలలో మార్మోగిన వేమన పద్యాల హోరు నలుదిశలా వ్యాపించింది. చుండూరు, అమృతలూరు మండలాలలోని విద్యార్థులకు నిర్వహించిన వేమన పద్యపఠన పోటీలో సుమారు 150 మంది చిన్నారులు పాల్గొని గొంతెత్తి వేమన పద్యాలను ఆలపించారు.

19వ తేదీన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధిశాఖ అధ్యక్షులు డా॥ ఆరెమండ వరప్రసాదరెడ్డి, ఆయన సతీమణి ఆరెమండ విజయశారద(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యానియంత్రణ అధికార శాఖ ఉపాధ్యక్షురాలు) మోదుకూరు వేమన జయంతి ఉత్సవాలలో వాల్గొని తమ సందేశాన్ని వినిపించారు.

తరువాత కళాలయ చారిటబుల్ ట్రస్టు సంచాలకులు శ్రీమతి గూడూరు లక్ష్మి సామాజిక సేవా దృక్పథం గురించి ఉపన్యసించారు. ఆంధ్రప్రదేశ్ అడిట్ విభాగం సహాయ అధికారి శ్రీమతి భారతి ఉపన్యసించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తెలుగు విభాగం అధిపతి డా॥ నారిశెట్టి వెంకట కృష్ణారావు శ్రావ్యంగా వేమన పద్యాలను ఆలపిస్తూ వేమనను ప్రజాకవిగా కొనియాడారు.

20వ తేదీన వేమూరు నియోజకవర్గ శాసన సభ సభ్యులు గౌ॥ ఆచార్య మేరుగ నాగార్జున పద్య పోటీకి విచ్చేసిన విద్యార్థులకు ప్రశంస,యోగ్యతా పత్రాలను అందజేసి ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ అధ్యక్షురాలు డా॥ నందమూరి లక్ష్మీపార్వతి, గుంటూరు జిల్లా పూర్వ కలెక్టర్ శ్రీ శామ్యుల్ ఆనందకుమార్ ఐఎయస్, పద్యపఠన పోటీ విజేతలకు బహుమతులు అందించారు. కలెక్టర్ గారు వేమన పద్యాల పట్ల తమ ప్రియత్వాన్ని వివరించారు.

ఆ తరువాత మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ వారు తమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ మొవ్వా వీరారెడ్డి గారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వేమన సాహితీ పురస్కారాన్ని డా॥ శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి అందచేశారు. శ్రీ శామ్యుల్ అనందకుమార్ గారు, డా॥ మొవ్వా వాసవి, శ్రీమతి గూడూరు లక్ష్మి ప్రసంగించారు. శ్రీ తియ్యగూర సీతారామిరెడ్డి అనువదించిన 'మిగారుమాత విశాఖ' అనే బౌద్ధ చిరుగ్రంథాన్ని శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి ఆవిష్కరించగా శ్రీ గోళ్ళ నారాయణరావు పుస్తక సమీక్ష చేశారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
FEBRUARY 2022 Vol :7, Issue 9 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/14/2021-23

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలతో...

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

## పూర్తి కంప్యూటరైజ్డ్ చేయబడిన బ్యాంకింగ్ సంస్థ

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, తెనాలి - 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 - 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) అంగలకుదురు ఫోన్ : 08644 - 233299
2) కొల్లూరు ఫోన్ : 08644 - 243788
3) బాపట్ల ఫోన్ : 08643 - 224051
4) కొల్లిపర ఫోన్ : 08644 - 245399
5) రేపల్లె ఫోన్ : 08648 - 222388
6) మంగళగిరి ఫోన్ : 08645 - 231255
7) చెరుకుపల్లి ఫోన్ : 08648 - 294422

త్వరలో పొన్నూరు మరియు గుంటూరు లలో ప్రారంభం

### ఖాతాదారులకు మా సేవలు

సేవింగ్స్ ఖాతాలపై ........ 5.0%
30 రోజుల నుండి 45 రోజుల వరకు ........ 5.0%
46 రోజుల నుండి 90 రోజుల వరకు ........ 6.0%
91 రోజుల నుండి 180 రోజుల వరకు ........ 6.5%
181 రోజుల నుండి 1 సంవత్సరము వరకు ........ 7.0%
1 సంవత్సరము పై కాలము నుండి 24 నెలల వరకు ........ 7.5%

అప్పులు
బంగారు వస్తువుల హామీపై
ప్రతిరోజూ గ్రాముకు రూ. 3,500/-లు
చొప్పున 11.5% తక్కువ వడ్డీకి అప్పులివ్వబడును
ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, ఇతర స్థిరాస్తుల హామీపైన
మరియు పర్సనల్ లోన్స్ 16%
వడ్డీకి ఇవ్వబడును

డిపాజిట్స్ పై సీనియర్ సిటిజన్స్‌కు ఒక శాతం అదనపు వడ్డీ

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్

లాకర్స్ సదుపాయం కలదు

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ అంబటి పోతురాజు, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ వి.వి.వి. శివప్రసాదరావు, డైరెక్టర్



అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.
డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244